


## రవీంద్రనాథ్ ఠాకూర్ రచన

ఘోషాల్ వంశం ఒకప్పుడు గొప్పది. తొలికాలంలో వారు సుందరవన ప్రాంతంలో ఉండేవారట. మలియుగంలో వారు ఏ కారణం చేతనో హుగ్లీజిల్లాలోని నూర్‌నగర్‌కు వచ్చి, అక్కడ గొప్పగొప్ప భవంతులూ, తోటలూ, భూములూ, పాడీ, పంటా ఏర్పాటుచేసుకుని, బంధుబలగంతో వైభవంగా జీవించారు. ఆ కాలంలో వారు తవ్వించిన చెరువు, మూడెకరాల మేరగలది, ఈనాటికీ పాచిపట్టి ఉన్నది. అప్పుడు వారు వెలిగినచోట ఇప్పుడు చాటర్జీలు వెలుగుతున్నారు.

దేవీపూజదగ్గిర ఘోషాలులకూ, చాటర్జీ జమీందార్లకూ తగాదా ఆరంభమయింది. చాటర్జీలను మించిపోవాలని, ఘోషాలులు చాటర్జీలదేవీ విగ్రహంకంటె రెండు మూరలు ఎత్తుగాఉండే విగ్రహం చేయించారు. అందుకు చాటర్జీలు ఏ విధంగా పగతీర్చుకున్నారంటే, రేపు దేవికి ఉద్వాసన అనగా, రాత్రికి రాత్రే, దారిపొడుగునా తోరణాలు కట్టించారు; అవి ఘోషాలుల దేవీ విగ్రహం తలకు అడ్డుతగులుతాయి: ఆ తోరణాలను తెంపటానికి ఘోషాలులు పూనుకున్నారు. ఘోషాలుల దేవీ విగ్రహాన్ని నరుకుతామని చాటర్జీలు లేచారు. తలకాయలు పగిలిపోయాయి. ఆ యేడు దేవికి ఎన్నడూ జరగనంత రక్తబలి జరిగింది. ఉభయపక్షాలూ కోర్టు కెక్కారు. కోర్టు దిగేసరికి ఘోషాలుల పని దివాలా అయింది. మంటలు చల్లారాక చూసుకుంటే కట్టెలు ఖాళీఅయి, బూడిద మిగిలింది. చాటర్జీలుకూడా ఆర్థికంగా నష్టపడ్డారు. అయినా కసి తీరలేదు; ఘోషాలులు హీనజాతి బ్రాహ్మలని చాటర్జీలు ప్రచారం చేశారు. వారి దగ్గిర ఇంకా కొంత డబ్బు ఉండటాన వారి ప్రచారం పారింది. సంఘపు ఒత్తిడికి తట్టుకోలేక ఘోషాలులు మకాంఎత్తి, సాధారణ కుటుంబీకులుగా రజబ్‌పూర్ గ్రామం చేరి, అక్కడ నివాసా లేర్పాటు చేసుకున్నారు

ఆనాడు అస్తమించిన సూర్యుడు, ఘోషాలులకు మళ్ళీ మధుసూదనఘోషాల్ హయాంలో ఉదయించాడు.

మధుసూదనుడి తండ్రి ఆనందఘోషాల్ రజబ్‌పూర్ అడితీలలో గుమాస్తాగా ఉండేవాడు అతను ముతకబట్టలు కట్టి, ముతకబియ్యపు అన్నం తిన్నాడు. అతని ఇంటి స్త్రీలు ఇనపగాజులూ, శంఖపుగాజులూ మాత్రమే ధరించారు.

మధుసూదనుడు పల్లెటూరి బడిలో కంటె, అడితీల చుట్టూ తిరిగి, వర్తక స్థలాలలో బెల్లమూ, పుగాకు, సీమదుప్పట్లూ, అవాలూ, కిరసనాయిలూ, మినుములూ మొదలయిన క్రయవిక్రయాలు చూస్తూ హెచ్చు విషయాలు నేర్చుకున్నాడు. తండ్రి తన పిల్లలందరిలోకీ వాడే ప్రయోజకుడవుతాడని ఆశించాడు. తన తమ్ముళ్లు చెవులలో కలాలు దోపుకుని గుమాస్తాగిరీలో ప్రవేశిస్తే, మధుసూదనుడు కలకత్తా వెళ్ళి కాలేజీలో ప్రవేశించాడు. కాలేజీ ప్రొఫెసర్లుకూడా వాడిపైన ఆశలు పెట్టుకున్నారు. వాడి తల్లికూడా వాడు పెద్ద వుద్యోగి అవుతాడని ఆశించింది.

కాని అంతలోనే ఆనందఘోషాల్ పరమపదించాడు. మధుసూదనుడు తన పుస్తకాలూ అవీ అమ్మేసి పనిలో ప్రవేశించాడు. అతను చిన్నతనంనుంచీ సరుకు నాణెమూ, మనిషి నాణెమూ కూడా గ్రహించగలవాడు. విద్యార్థిదశలో అతనికి కనాయ్‌గుప్త అనే స్నేహితు డుండేవాడు. ఆతడి తండ్రి ఒక గొప్ప కిరసనాయిలు కంపెనీలో పెద్ద ఉద్యోగి. ఆయన పేరు రజనీబాబు

రజనీబాబు కుమార్తెకు వివాహం జరిగినప్పుడు మధుసూదనుడు నడుముకట్టి కార్యభారమంతా తానే మోశాడు - పాకలూ, పందిళూ కట్టించాడు. అచ్చాఫీసులో కూర్చుని బంగారు సిరాతో శుభలేఖలు అచ్చు కొట్టించాడు; గేటుదగ్గర నిలబడి పెళ్ళికి ఆహూతులయిన వారిని మర్యాదచేశాడు; భోజనాలదగ్గిర గొంతు చించుకుని కేకలు పెట్టాడు.

మధుసూదనుడి తెలివితేటలూ, సమర్థతా చూసి రజనీబాబు ముచ్చటపడి, తానే డిపాజిట్ కట్టి, అతనిపేర రజబ్‌పూర్‌లో కిరసనాయిలు డిపో తెరిపించాడు.

అదృష్టం తన్నుకువచ్చింది. వర్తకం శాఖోపశాఖలుగా విస్తరించి, కిరసనాయిలుడిపో చాలా స్వల్ప విషయమైపోయింది; చిల్లర వ్యాపారం టోకు వ్యాపారమైంది; దుకాణాలు ఆఫీసులయాయి; వ్యాపారం సందులలోనుంచి రాజమార్గాని కెక్కింది.

అనేకమంది ఆడపిల్లల తండ్రులు అప్పుడే మధుసూదనుడి దృష్టి పెళ్ళిమీదికి తిప్ప యత్నించారు. "ఒక కడుపు నిండినాక మరో కడుపు నించే భారం నెత్తిన వేసుకోవచ్చు" అని అతను వారికి చెప్పాడు. అతని ఆకలి గొప్పదనడానికి సందేహం ఏమీలేదు.

గోనెపరిశ్రమకు మంచి భవిష్యత్తు ఊహించి అతను రజబ్‌పూర్ నది ఒడ్డున ఉన్న ఖాళీస్థలమంతా చౌకగా కొనేశాడు. త్వరలోనే అక్కడ ఇటుకలూ, గుగ్గిలమూ, సిమెంటూ, ఇనప రేకులూ ఎక్కడెక్కడినుంచో వచ్చి దిగాయి. మధుసూదనుడికి "అజీర్తి" పట్టుకుంటుందని వర్తకులంతా అనుకున్నారు. కాని అలాటి దేమీ జరగలేదు. రజబ్‌పూర్ గొప్ప వర్తక కేంద్ర మయింది. మర్వాడీలూ, కూలీలూ వచ్చిపడ్డారు. గోనె ఫాక్టరీలు లేచాయి.

మధుసూదనుడు గొప్ప సంపన్ను డయాడు. అతనొక రెండంతస్తుల భవంతి కట్టించి, తన కాలేజి సంస్కృత పండితుడిచేత ఆ యింటికి "మధుచక్రం" అని నామకరణం చేయించాడు.

తాను మనమలనూ, మనమరాళ్ళనూ చూడకుండానే పోవలసి వస్తుందని, మధుసూదనుణ్ణి అతనితల్లి, "కోడలిని కళ్ళజూపించారా, తండ్రీ," అన్నది.

"వ్యవధి ఏదమ్మా?" అన్నాడు కొడుకు. కాలానికి బజారుధర ఉన్నదని అతనికి తెలుసు.

కాలం గడుస్తున్నది. వ్యాపారం రాక్షసిలాగా పెరిగిపోతున్నది. హెడాఫీసు కలకత్తాలో ఏర్పాటయింది. ఘోషాల్ కంపెనీపేరు దేశ దేశాల వ్యాపించింది. విదేశ కంపెనీలతో సమానమైన పరపతి దానికి లభించింది. ఆ కంపెనీలోని అన్ని శాఖలకూ మేనేజర్లు తెల్లవాళ్ళే.

మధుసూదనుడి తల్లి కొడుకుపెళ్ళి చూడకుండానే పోయింది.

"ఇప్పుడు నాకుపెళ్ళి చేసుకునేవ్యవధి ఉంది," అని మధుసూదనుడు అనటమే తరవాయిగా అతన్ని పెళ్ళాడటానికి సిద్ధంగాఉన్న కులవతులూ, రూపవతులూ, గుణవతులూ, ధనవతులూ, విద్యావతులూ అన్నివైపులనుంచీ ప్రత్యక్ష మయారు.

మధుసూదనుడు అందరినీ కలయజూసి, "ఆ చాటర్జీల అమ్మాయిని పెళ్ళాడతాను," అన్నాడు.

## 2

ఈలోపల నూర్‌నగర్ చాటర్జీల స్థితికూడా చితికిపోయింది. దేవాలయ ధర్మకర్తృత్వం దగ్గిర వాళ్ళ కుటుంబాలమధ్య పేచీలు వచ్చి కోర్టు కెక్కి, ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోయాక దావా విరమించుకున్నారు. నూటికి పన్నెండణాల వడ్డీతో అప్పులు మిగిలాయి.

ఇప్పుడున్న చాటర్జీలు ఇద్ద రన్నదమ్ములూ, అయిదుగురు అక్క చెల్లెళ్ళూనూ. వాళ్ళ తండ్రి బతికిఉండగానే నలుగురాడపిల్లలను కులీనుల కిచ్చి పెళ్ళిచేశారు. కులీనతకు తగ్గట్టు కట్నాలు పోశారు. గుదిబండగా ఉన్న అప్పు ఉరితాడుగా పరిణమించింది.

చిన్నవాడు సుబోధ్, "నేను సీమకు వెళ్ళి, బారిష్టరయి వచ్చి సంపాదిస్తేనేగాని జరగదు." అని సీమకు వెళ్ళిపోయాడు. సంసార భారం పెద్దవాడైన విప్రదాసుపైన పడింది.

విప్రదాసుకు అమూల్యధనుడనే బాల్యస్నేహితు డొకడున్నాడు. అతను కలకత్తాలో ఒకపెద్ద అటార్నీ దగ్గిర గుమాస్తాగా ఉంటున్నాడు. విప్రదాసును మార్వాడీబాకీదార్లు బాకీ చెల్లించమని తొందర చేస్తున్న సమయంలో ఈ అమూల్యధనుడు తన చిన్ననాటి స్నేహితుడైన విప్రదాసుకు మధుసూదనుడివద్దనుంచి నూటికి ఏడురూపాయల వడ్డీపైన ఏడు లక్షల రూపాయిలు అప్పిప్పించాడు. ఆడబ్బుతో విప్రదాసు తన బాకీలు తీర్చి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

ఈ విధంగా ఘోషాలులకూ, చాటర్జీలకూ తిరిగి అనుబంధం ఏర్పడింది. ఇది జరిగేనాటికి మధుసూదనుడికి ప్రభుత్వం "రాజా బహాదుర్" అనే బిరుదు యిచ్చింది.

విప్రదాసు కిప్పుడు మిగిలిఉన్న చింత తన ఆఖరుచెల్లెలైన కుముదినికి వరుణ్ణి వెదికి, డబ్బు సమకూర్చుకుని పెళ్ళి చెయ్యటం.

కుముదిని చాలా చక్కనిది. సన్నగా, పొడవుగా ఉండేది. తెల్లని రంగూ, నల్లని కళ్ళూ, మెగ్గలాటి ముక్కూ కలిగి, ఆమెను పెళ్ళాట్టమే మహాభాగ్యమని అనుకోదగిన మనిషి. అలాటి కుముదిని తానొక అభాగ్యురాలననీ, తన అన్నకు భారంగా ఉన్నాననీ అనుకుని, ఎప్పుడూ విచారంగా ఉండేది. తన అన్నలను రక్షించినట్టయితే యావజ్జీవమూ దాసిగా ఉంటానని తన ఊహాసుందరుడికి దణ్ణాలు పెట్టుకునేది.

ఆమె ఇల్లు దాటకుండానే అనేక విద్యలు నేర్చింది. విప్రదాసే ఆమెకు చదరంగం ఆట నేర్పి, సంస్కృత వ్యాకరణం కూడా చెప్పాడు. ఫొటోలు తియ్యటం నేర్పాడు. విలువిద్య నేర్పాడు.

తండ్రీ, తల్లీ పోయాక విప్రదాసు తన నివాసాన్ని నూర్‌నగరు నుంచి, కలకత్తాలోని బాగ్‌బజారు ప్రాంతానికి మార్చాడు. అంతవరకూ ప్రకృతిమధ్య పెరిగిన కుముదినికి కలకత్తా వాతావరణమూ, అక్కడి ఎండా మొదలైనవి ఎంతో కొత్త అనిపించినయి. కలకత్తా

ఒక మహాసముద్రం. అసలే ఏకాకి మనస్తత్వంగల కుముదిని కలకత్తా వచ్చి బొత్తిగా ఏకాంతతపస్విని అయింది.

ఒకనాడు సీమనుంచి సుబోధ్ ఉత్తరం రాశాడు, నూటయాభై పౌనులు డబ్బు పంపమని. సీమవెళ్ళిన కొత్తలో సుబోధ్‌కు ఇంటి కష్టాలు బాగా గుర్తుండేవి. అందుచేత డబ్బుచాలా జాగ్రత్తగా ఖర్చుచేసేవాడు. అయితే రానురాను అతని మనసులోనుంచి ఇంటి విషయాలు చెరిగిపోయాయి. ఖర్చు జాస్తి అయింది. ఇదివరకే అతను విప్రదాసునుంచి ఒకటి రెండుసార్లు హెచ్చుమొత్తాలు తెప్పించుకున్నాడు. ఈసారి డబ్బుకోసం రాస్తూ, "గొప్పవాళ్ళతో కలిసి తిరుగుతూ, ధారాళంగా డబ్బు ఖర్చుచెయ్యకపోతే పైకి రావటం కష్టం. అలా చేయలేనివాళ్ళు ఇక్కడికి రానేకూడదు." అని తెలియజేశాడు.

సుబోధ్ రాసిన ఉత్తరాన్ని విప్రదాసు తన చెల్లెలికి చూపించలేదు. అందులో ఏదో దుర్వార్త ఉన్నదని కుముదిని తన అన్న వాలకాన్నిబట్టి గ్రహించి, "చిన్నన్నకు జబ్బేమీ చెయ్యలేదుకద ?" అని అడిగింది.

తమ్ముడికి డబ్బెలా పంపాలో విప్రదాసుకు పాలుపోలేదు. అతను తన "రక్తాన్ని నీరుగా చేసి" కుముదిని పెళ్ళికి రూపాయలు కూడబెట్టుతున్నాడు. వాటిని తమ్ముడికి పంపటమా ? కుముదినికి గతిలేకుండా చెయ్యటమా ? ఆ తరవాత సుబోధ్ బారిస్టరయితేనేం, కాకపోతేనేం ?

ఆ రాత్రి విప్రదాసు పక్కమీద నడుము వాల్చక వరండాలో పచార్లు చేస్తుంటే కుముదిని కళ్ళు మూయలేదు. చివరకామె పట్టలేక అన్నవద్దకు వచ్చి, "చెప్పన్నయ్యా, చిన్నన్నకు ఏమయింది ? నాదగ్గర దాచకు," అని వేడుకున్నది.

నిజం దాచటంవల్ల కుముదిని మరింత కంగారుపడుతున్నట్టు గ్రహించి, "చిన్నన్నకు డబ్బు కావాలట. ఎక్కడతేను ?" అన్నాడు విప్రదాసు.

"అమ్మనగలు నాకోసం ఉంచావు, వాటివి —"

"చాల్లే ! వాటిని నేను తాకలేను," అన్నాడు విప్రదాసు చెల్లెలి మాట కడ్డొచ్చి.


"నేను తాకగలను."

"నువ్వు తాకలేవు; అదంతా ఇప్పు డెందుకు ? వెళ్ళి పడుకో."

తెల్లవారాక కుముదిని తన నగలు అమ్మమని మళ్ళీ అన్నను వేధించింది. అవి అమ్మినమాత్రంచేత సమస్య పరిష్కారం కాదన్నాడు విప్రదాసు.

అతను తన తమ్ముడికి, "డబ్బు పంపాలంటే కుముదిని నగలు అమ్మాలి. అది జరగటం కలలోమాట," అని జవాబు రాశాడు.

సుబోధ్ అందుకు జవాబుగా, కుముదిని కట్నంసొమ్ము తనకు అవసరంలేదనీ, ఆస్తిలో తనభాగం అమ్మి డబ్బు పంపమనీ రాస్తూ, పవరాఫ్ ఎటార్నీకూడా ఉత్తరంలోనే పెట్టి పంపాడు.




విప్రదాసు గుండెలో బాణం గుచ్చుకున్నట్టనిపించింది; సుబోధ్ అలాటి ఉత్తరం ఎలా రాయగలిగాడు ! అతను వెంటనే దివాన్‌ను పిలిపించి, "భూషణరాయ్ కరీమ్‌హాటీతాలూకా కొంటాననంటూ వచ్చాడుగదా. ఎంతకు కొంటాడు ?" అని అడిగాడు.

"ఇరవై వేలదాకా పెట్టవచ్చు," అన్నాడు దివాన్.

"భూషణరాయ్‌ని పిలిపించండి, మాట్లాడాలి."

విప్రదాసు పెద్దవాడు కావటంచేత అతను పుట్టినప్పుడతని తాతగారు కరీమ్‌హాటీతాలూకా అతనిపేర రాసేశాడు. పాతిక లక్షలమీద వడ్డీవ్యాపారం సాగిస్తున్న భూషణరాయ్ జన్మస్థలం కరీమ్‌హాటీ. అందుచేత అతను ఆ తాలూకాను ఎలాగైనా సంపాదించాలని చాలాకాలంగా యత్నిస్తున్నాడు. డబ్బు అవసరంకొద్దీ విప్రదాసు దాన్ని అమ్మటానికి లోగడ కొన్నిసార్లు ప్రయత్నించాడు. గాని గ్రామప్రజలు భూషణరాయ్‌ని తమ జమీందారుగా అంగీకరించమని చెప్పేశారు. అందుచేత విప్రదాసు అప్పట్లో తన ప్రయత్నాలు మానుకున్నాడు; కాని ఈసారి అతని మనసు రాయి చేసుకున్నాడు. ఎందుకంటే సుబోధ్‌కు ఇంకా డబ్బు పంపవలసి వస్తుంది. తాలూకా అమ్మగా వచ్చేడబ్బు అతనికోసం ఉంచేసి, తరవాత సంగతులు తరవాత చూసుకుందా మనుకున్నాడు విప్రదాసు.

దివాన్ విప్రదాసుతో ఏమీ అనలేక, కుముదిని దగ్గిరికి వెళ్ళి, "కరీమ్‌హాటీని అమ్మడం చాలా అన్యాయం; వద్దని అన్నాగారితో చెప్పమ్మా." అన్నాడు.

విప్రదాసు భోజనం చేసి కూర్చుని, గుడుగుడు పీలుస్తుండగా కుముదిని వచ్చి, "తాలూకా అమ్మటానికి వీల్లేదన్నయ్యా," అన్నది.

"అన్నిటికీ నీ పెత్తనమే ?"

"అలా మాట తోసెయ్యకు."

"సుబోధ్ ఏం రాశాడో చూడు." అంటూ విప్రదాసు ఆమెకు ఉత్తరం చూపించాడు.

కుముదిని ఆ ఉత్తరం చదివి, మొహాన్ని చేతులతో కప్పుకుని, "చిన్నన్న ఇలా రాస్తాడని నేను కల్లోకూడా అనుకోలేదు." అన్నది.

"వాడు తన ఆస్తి, నా ఆస్తి అంటూంటే నా తాలూకా వేరుగా ఎలా ఉంచను ? నాన్నలేడు; వాడికి డబ్బు కావాలంటే నేనేగా పంపాలి ?" అన్నాడు విప్రదాసు.

కుముదిని కాసిని కన్నీళ్ళు కార్చి తన తల్లినగల అమ్మకం గురించి మళ్ళీ ప్రస్తావించింది.

"నీ నగలమ్మిన డబ్బుతో సుబోధ్ అక్కడ నాటకాలూ, కాన్సర్టులూ చూశాడంటే వాణ్ణి జన్మలో క్షమించలేను. వాడైనా ఎన్నిటికీ తలఎత్తుకు తిరగలేడు. వాడి కెందు కంత దారుణశిక్ష ?"

ఏదైనా ప్రళయం ముంచుకొచ్చేస్తే బాగుండు ననిపించింది కుముదినికి. కాని అలాటిస్థితిలోకూడా ఆమె తన ఎడమకన్ను అదిరేసరికి అదేదో శుభశకునమని ఆశపడింది.

## 3

ముసుర్లు ప్రారంభమయాయి. కొంచెం జలుబుగా ఉంది. విప్రదాసు సన్నటి రజాయి కప్పుకుని పడుకుని పత్రిక చదువుకుంటూండగా ఎవరో వచ్చి, నమస్కరించి, తనపేరు నీలమణిఘటక్ అని చెప్పాడు.

"ఏం పనిమీద వచ్చావు ?" అని విప్రదాసు అతన్ని అడిగాడు

"మంచి వరు డున్నాడు – మీ ఇంటి అల్లుడు కాదగినవాడు." అంటూ నీలమణిఘటక్ రాజాబహాదుర్ మధుసూదన ఘోషాల్ పేరు చెప్పాడు.

విప్రదాసు ఆశ్చర్యంతో లేచికూర్చుని, "ఏమి టా తుంటరితనపు మాటలు ?" అన్నాడు.

"అంతులేని ఐశ్వర్యం; ఆయన వ్యాపారం స్వయంగా చూడటం మానేసి, గృహస్థాశ్రమంలో అడుగుపెట్టదలిచారు."

విప్రదాసు కాస్సేపు ఆలోచించి, చిరాకుగా, "అతనికి ఈడయిన వాళ్ళెవరూ మా ఇంట లేరే," అన్నాడు.

నీలమణిఘటక్ వదలలేదు. రాజాగారి ఐశ్వర్యాన్నీ, గవర్నర్లతో ఆయనకుగల స్నేహాన్నీ వర్ణించసాగాడు.

కుముదిని టీ తీసుకుని తన అన్నగదిలో ప్రవేశించబోతూ, గుమ్మందగ్గిర తడిగొడుగూ, బురద స్లిప్పర్లూ ఉండటం చూసి ఆగి, లోపల జరిగే సంభాషణ విన్నది.

"రాజావారికి మరో సంవత్సరంలోగా మహారాజాబిరుదివ్వబో తున్నారట – గవర్నరుగారే స్వయంగా చెప్పారు. మహారాణీ సానం ఖాళీగా ఉండరాదు. మీ యింటి జ్యోతిష్కుడు నాకు బంధువే లెండి. అమ్మాయి జాతకం చూపించాడు. కలకత్తాలో ఎంతమంది అమ్మాయిల జాతకాలో చూశాను, కాని మన జాతకం అతికినట్టుగా మరే జాతకమూ అతకలేదు. ఈ సంబంధం అయితీరుతుంది. బ్రహ్మకూడా తప్పించలేడు." అని నీలమణిఘటక్ అనటం వింటుండగానే కుముదినికి కన్ను అదిరింది.

ఇంతేకాక వాళ్ళఇంటి జ్యోతిష్కుడు కుముదిని చెయ్యి చూసి లోగడ చాలాసార్లు ఆమె రాణి అవుతుందని చెప్పాడు. ఆయనే, వార్షికం పుచ్చుకుపోవటానికి నాలుగురోజుల క్రితం కలకత్తా వచ్చి, విప్రదాసుకు అషాఢమాసంనుంచీ రాజసన్మానమూ, శత్రునాశమూ, స్త్రీలద్వారా ధనలాభమూ, వ్యయాన కించిత్తు అనారోగ్యమూ, భార్యావియోగమూ కలిగేటట్టు చెప్పాడు. విప్రదాసు కింకా పెళ్ళే కాలేదు గనక మిగిలిన వన్నీ మంచి ఫలాలే. కొద్దిగా అనారోగ్యం చెయ్యనే చేసింది గనక జ్యోతిష్కు డన్న మాటలు నిజమవుతా యని తెలుస్తూనే ఉంది.

నీలమణిఘటక్ చెప్పినదందా విని విప్రదాసు, "ఈడు కుదరదు," అనేశాడు.

"ఆలోచించండి. మళ్ళీ నాలుగైదు రోజులలో తిరిగి కలుస్తాను." అని ఘటక్ వెళ్ళిపోయాడు.

తన అన్న ఎందుకలా బాధపడి సతమత మవుతున్నాడో కుముదినికి అర్థం కాలేదు. పెళ్ళి విషయంలో కులంతప్ప ఇంకేమీ చూడనవసరంలే దని ఆమె ఉద్దేశం. ఆమె అక్క లందరినీ కులం చూసే చేశారు. వాళ్ళంతా పిల్లలను కని సంసారాలు చేస్తున్నారు. తల్లి పిల్లలను కనేటప్పుడు ఇష్టా యిష్టాలు ఆలోచించి కంటున్నదా ? వరుణ్ణి ఎంచి చేసుకోవటానికి, భగవంతుడు దుకాణం పెట్టుకు కూర్చున్నాడా ? ఆమె ఊహాసుందరుడు ఇంతకాలానికి మారువేషంతో ప్రత్యక్షమయాడు.

కుముదిని పంచాంగం తీసి చూసింది. ఆరోజు మనోరథ విదియ – మనోరథాలు ఫలించే రోజు. సాయంకాలం బ్రాహ్మలను పిలిపించి ఫలహారం పెట్టి, దక్షిణ లిచ్చింది. వా రామెను రాణి కావాలనీ, సమస్త సంపదలతోనూ, సంతానంతోనూ ఆమె ఇల్లు నిండాలనీ ఆశీర్వదించారు.

ఘటక్ రెండోసారీ, మూడోసారీకూడా వచ్చాడు. విప్రదాసుకు తన చెల్లెలిని మధుసూదనుడికి ఇవ్వటం ఏమాత్రమూ ఇష్టంలేదు. కుముదిని పద్దెనిమిద నిండిన మనిషి. మధుసూదనుడు వంశమర్యాదలో చాలా ఉచ్చలో ఉన్నవాడు, కాని కుముదినికన్న చాలా పెద్దవాడు. కుముదినిచేతనే తన కా సంబంధం వద్దనిపించు దామని విప్రదాసు ప్రయత్నించాడు.

"మా ఇద్దరికీ పెళ్ళి స్థిరమైపోయిం దన్నయ్యా." అన్నది కుముదిని.

"ఎలా స్థిరమయింది? నువ్వతన్ని చూడనైనాలేదే?" అన్నాడు విప్రదాసు ఆశ్చర్యంతో.

"చూడకపోతే నేం? నేను నిస్సందేహంగా చెప్పగలను," అన్నది కుముదిని.

"చూడు, కుమూ, ఇది ఆటకాదు. యావజ్జీవమూ ఉండే సంగతి ముందూ వెనకా చూడకుండా ఏదో ఒకటి చెయ్యగూడదు."

"ఆట కాదన్నయ్యా, బాగా ఆలోచించుకున్నాను. ఆయన్ని తప్ప మరెవరినీ పెళ్ళాడలేను."

విప్రదాసు ఉలిక్కిపడ్డాడు. అతను హేతుబద్ధంగా ఆలోచించే వాడు. ఆమె శకునాలను నమ్ముకునేది. అంధకారంతో ఎలా పోట్లాడడం.

అతను అనుకున్నది నిజమే. కుముదిని తన భవిష్యత్తుకు పువ్వుల పరీక్ష పెట్టింది. పువ్వులు జంటలు జంటలుగా విడదీయగా చివరకు నీలిరంగుపువ్వు మిగిలితే తాను ఈ సంబంధమే చేసుకోవాలని భగవంతుడి ఉద్దేశం. నీలిరంగుపువ్వే మిగిలింది. అదే సమయానికి ఎక్కడో హారతి గంటకూడా మోగింది!...

పెళ్ళి నిశ్చయమయింది. అది కలకత్తాలో జరిగితే బాగుంటుం దన్నాడు విప్రదాసు; నూర్‌నగర్‌లోనే జరగాలన్నాడు మధుసూదనుడు. అతని మాటే నెగ్గింది.

మొదట్లో కుముదిని మనస్సులో నిశ్చలమైన ఆనందం తప్ప ఏమీ లేదు. ఆమె హృదయం ప్రపంచంపట్ల దయతోనూ, స్నేహ భావంతోనూ నిండిపోయింది. ప్రకృతి ఆమెను అనుక్షణమూ పులకింపజేసేది. అయితే ఈయన స్థితి – నిలబడకుండా విషవాయువులు వీచాయి.

ఒకనాడు ఒక ముసలిది వచ్చి, "కుము గతి ఎలా అయిందో చూడు! బ్రహ్మజెముడుదొంకల రాజు దొరికాడు. ఈ రాజు ఆ రజబ్‌పూర్ ఆనంద గుమాస్తా కొడుకు కాదూ? కరువొచ్చిన యేడు రంగం బియ్యం తెప్పించి అమ్మి, డబ్బు కూడబెట్టాడు. డబ్బుంటే నేం? చచ్చేదాకా కన్నతల్లిచేత ఇంటిచాకిరీ అంతా చేయించాడు." అని గొంతు తగ్గించి, "కులంగలవాళ్ళు వీళ్ళకి పిల్ల నిస్తారా! అయితే నేం? లక్ష్మి ఏ ఇంటోనైనా ప్రవేశించే టప్పుడు వాళ్ళజాతి చూడదు." అన్నది.

కులమూ, జాతీ అనేవి కుముదినికి వాస్తవమైనవి. అందుచేత, తన కాబోయే భర్త కులాన్నీ, జాతినీ ఎవరన్నా నిందిస్తే చాలా బాధపడి, వినలేక అక్కడినుంచి పారిపోయి, ఏడుస్తూ కూర్చునేది.

విప్రదాసు ఆధునిక భావాలు గలవాడే అయినా, కులమూ, జాతీ అంటే ఆదరణ పోలేదు. ఎవరన్నా మధుసూదనుడి కులంగురించి హీనంగా మాట్లాడితే ఆ మాటలను నిరుత్సాహపరిచేవాడు.

ఇంతలో అతనికి దామోదరవిశ్వా సనే ముసలిరైతు ద్వారా ఘోషాలులకూ, చాటర్జీలకూ మధ్య ఒకప్పుడు సాగిన రంధిగురించి



తెలిసింది; ఘోషాలులు చాటర్జీల కుయుక్తికి దెబ్బతిన్నారేగాని, కులంతక్కువవాళ్ళుకారు! విప్రదాసు మనసు ఆనందంతో నిండింది. అయితే ఇప్పుడు జరగబోయే పెళ్ళికీ, ఆ నాటికీ సంబంధం ఏమైనా ఉన్నదా అనుకున్నా డతను.

## 4

మార్గశిరమాసంలో పెళ్ళి. ఆశ్వయుజమాసంలోనే ఘోషాల్ కంపెనీ ఇంజనీరింగు శాఖవాళ్ళు రకరకాల సామాన్లతో శేయకులికి వచ్చి డేరాలు వెయ్యటానికి ఉపక్రమించారు. చుట్టూ ఉండే అడవి కొట్టెయ్యటానికికూడా పూనుకున్నారు. పెళ్ళివారు కొన్ని రోజులు ముందే వచ్చి, డేరాలలో మకాం చేస్తారట.

పెళ్ళివారి విడిదికి ఇళ్ళూ అవీ తాను ఏర్పాటు చేస్తానని విప్రదాసు అన్నాడు. కాని ఘోషాల్‌లు తమ ఐశ్వర్యం ప్రకటించుకునేటందు కిలా చేస్తున్నారు.

విప్రదాసు దాయాది నవగోపాల్ మండిపడ్డాడు; "మన పూర్వీకులు ఈ ఘోషాలులను ఎముకలు విరగ్గొట్టి తరిమేశారు. వాళ్ళిప్పుడు మన తాలూకాలోకి వచ్చి రూపాయలు గలగల్లాడిస్తారా?



నువ్వుండు అన్నయ్యా. ఖర్చుపెట్టటానికి మేమంతా లేమూ ? మనం ఆస్తులు పంచుకున్నాంగాని మానమర్యాదలు పంచుకున్నామా ?" అన్నాడు.

కుముదిని కారణంగానే తరువాత ముత్తాతలకు ఈ అవమానం జరుగుతున్నదని భావించి, ఆడవాళ్ళు తమ ఆగ్రహాన్ని ఆ అభాగ్యురాలిపై చూపి, "రాణివి అవుతావా ? అవుదువుగాని ఉండు!" అన్నారు. కుముదిని బాధపడింది. తమ కాబోయే అత్తవారి నడవడికి ఆమె తానే సిగ్గుపడింది.

విప్రదాసు ఆమెను అనునయించటానికి, "ఇది వాళ్ళ తాత ముత్తాతల జన్మస్థానం. ఇక్కడ తమ వైభవం చూపాలని వాళ్ళకు ఉండటం సహజమేకద." అన్నాడు. ఇప్పటికైనా మించిపోలేదనీ, ఈ సంబంధం గురించి తన చెల్లెలి కేమన్నా సంశయం ఉంటే పెళ్ళి మాన్పిస్తాననీ కూడా అత నన్నాడు. కుముదిని అందుకు ఒప్పుకోలేదు. తనకు భర్త కాబోయే వ్యక్తిలో ఏ దోషా లుంటేనేం కాక, అతని భర్తృత్వానికి ఆమె ఆదివరకే ఆత్మార్పణ చేసుకున్నది.

ఈ లోపల ఘోషాల్ కోనేరుచుట్టూ ఉండే అడవి అంతా కొట్టి, భూమి చదును చేసి, ఆ ప్రాంతం గుర్తుపట్టరాకుండా చేశారు. కోనేరులోని నాచంతా పీకేశారు. రోడ్లు వేసి, దీపస్తంభాలు అమర్చారు. అక్కడక్కడా పూలమొక్కల మడులు వేశారు. ఇత్తడి స్త్రీ విగ్రహాలతో జలయంత్రాలు అమర్చారు. ఎక్కడ చూసినా "మధు" శబ్దం కనిపిస్తున్నది. చెరువులో పెట్టిన తెప్పలపేర్లు "మధుమత్," "మధుకరీ." రాజా బహాదుర్‌వారి గుడారంపేరు "మధుచక్రం." చెరువుపేరు "మధుసాగరం." గుడారాలన్నీ కలిసి "మధుపురి." ఇదంతా చూసి చటర్జీ వంశీయులు నూర్‌నగరు గుండెల్లో గుచ్చిన బల్లెంమీద ఘోషాలుల జయపతాక ఎగురుతున్నట్టు భావించారు.

"వాళ్ళతో పోటీపడి నెగ్గలేం. మనం కులాచారం ప్రకారం పండితులచేత సామవేదం చదివించి, అనుష్ఠానం జరిపింతాం." అని విప్రదాసు సాత్విక ప్రబోధ చేసినప్పటికీ నవగోపాల్ మొదలైనవాళ్ళు తాను చేయదలచినది మానలేదు. ఏడుకోసుల దూరానికి కనబడేలాగ ఎత్తుగా నౌబత్‌ఖానా కట్టించారు? ఎనిమిది ఏనుగులను ముస్తాబు చేసి చెరువుపక్కను తిప్పారు; "నారఫ్యాక్టరీలలో ఏనుగులు తయారవుతాయా ?" అని హాస్యం చేశారు.

పెళ్ళి ఇంకా పన్నెండురోజు లున్నదనగా రాజావారు సబంధుమిత్ర పరివారంగా వస్తున్నట్టు తెలిసింది. ఆయనకు స్వాగతం చెప్పటానికి స్టేషనుకు వెళ్ళటం పరువు కాదని నిశ్చయించారు చాటర్జీలు.

ఎవరికీ చెప్పకుండా విప్రదాసు గుర్రంమీద స్టేషనుకు వెళ్ళాడు.

"మీ రెందుకు వచ్చారు శ్రమపడి ?" అని మధుసూదనుడు అడిగాడు.

"అదేమిటి ? మొదటిసారిగా మా దేశానికి వస్తున్నారు; మర్యాద చెయ్యవద్దా. రేవులో పడవ ఉన్నది. ఫలహారాలు ఏర్పాటు చేశాను, దయచెయ్యండి." అన్నాడు విప్రదాసు.

"అవసరంలేదు. మా స్టీమ్‌లాంచ్ వచ్చింది. అనవసరంగా హైరానపడకండి. నేనిప్పుడు వచ్చినది మా పూర్వీకుల జన్మస్థానానికి; మీ దేశానికికాదు. పెళ్ళి ముహూర్తానికి మీ గ్రామం వస్తాను." అన్నాడు రాజా మధుసూదనుడు.

విప్రదాసు హతాశుడై బాగా పొద్దుపోయి ఇంటికి చేరుకున్నాడు. ఈ జరిగినసంగతి అతను ఎవరికీ చెప్పలేదు. చల్లగాలిలో తిరిగిన




కారణంగా అతనికి దగ్గుపట్టుకుని, సరయిన చికిత్స జరగక హెచ్చిపోయింది. కుముదిని అతన్ని ఎలాగో ఒప్పించి, మంచంలో విశ్రాంతి తీసుకునేటట్టు చేసింది. అందుచేత కార్యభారం నవగోపాలుడిపైన పడింది.

రెండురోజులు గడిచాయోలేదో నవగోపాలుడి కొక సమస్య వచ్చిపడింది. రాజా బహాదుర్ వెంట దొరలూ, దురసానులూ వచ్చారు. దొరలు తుపాకులు తీసుకుని పిట్టలను వేటాడుతున్నారు. విప్రదాసు లోగడ పిట్టలవేటను నిషేధించిఉన్నాడు. ఆ ఉత్తరువు ప్రకారం వెనక ఒక జిల్లాకలెక్టరును పిట్టలను కొట్టకుండా నిరోధించటం జరిగింది.

నవగోపాలుడు దొరల వేటగురించి చెప్పి, "నువు వద్దనకపోతే మేం వెళ్ళి –'' అని ప్రారంభించాడు.

"వద్దు. మీరేమీ అనవద్దు," అన్నాడు విప్రదాసు.

నవగోపాలుడు వెళ్ళాక కుముదిని, "పిట్టలను కొట్టవద్దని వాళ్ళకు కబురుచెయ్యి అన్నయ్యా," అన్నది.

"ఒకప్పుడు నేనూ కొట్టేవాణ్ణి. అది అన్యాయమని నా కప్పుడు తెలీదు. వాళ్ళింకా ఆస్థితిలోనే ఉన్నారు." అని విప్రదాసు చెల్లెలికి సర్దిచెప్పాడు.

దొరల ఉత్సాహానికి అంతులేదు – పక్షులవేటా, పిక్నిక్కులూ, బాండువాద్యాలూ, డాన్సులూ, టెన్నిసుఆటా, పరుగుపోటీలూ, రాత్రి విందులూనూ. ఈ వినోదాలు చూడటానికి గ్రామప్రజలంతా చెరువుగట్లమీద చేరారు.

వీటన్నిటికీ ప్రతిగా రెండో పక్షంవాళ్ళు ఏర్పాటుచేసిన కుస్తీలూ, హరికథలూ, భాగవతాలూ మొదలైనవి ఏమీ ఎక్కలేదు.

పెళ్ళికి రెండురోజులు ముందుగా కుముదినిని పెళ్ళికూతురు చేసి ఉత్సవం చేశారు. ఇది ఎంతో వేడుకగా జరిగింది. చూడవచ్చిన వాళ్ళకు విందులు చేశారు.

ఉభయపక్షాలవాళ్ళూ విందులు ఏర్పాట్లు చేశారు. చాటర్జీల విందు మధ్యాహ్నంనుంచి సాయంకాలందాకా సాగింది. రాత్రి మధుపురివాళ్ళ విందు. అందుకు భారీఎత్తున వంటకాలు తయారు చేయించి, అందరూ రావచ్చునని దండోరా వేసి, బ్రహ్మాండంగా దీపాలు వెలిగించారు. సనాయివాద్యం ఏర్పాటు చేశారు. కాని బహుకొద్దిమంది వచ్చారు. మధుసూదనుడికి పెద్ద పరాభవం జరిగింది. అతనితమ్ముడు రాధూ వచ్చి, "ఇంకెందుకు? వెళ్లిపోదాంపద," అన్నాడు.

"ఫో అవతలికి." అని మధుసూదనుడు తమ్ముణ్ణి కసిరాడు.

చాటర్జీల ఆనందానికి మేరలేదు. మంచంలో పడిఉన్న విప్రదాసుకిదేమీ తెలియదు.

పెళ్ళినాడు మధుపురిలో పెళ్ళివారు లైట్లు వెలిగించి, రకరకాల బాజాలతో ఉత్సవం చేసుకుంటుండగా, పెళ్ళికొడుకు ఒక పురోహితుణ్ణీ, ఇద్దరు భట్రాజులనూ మాత్రం వెంటబెట్టుకుని, వెంట బాజాలేమీ లేకుండా, నిశ్శబ్దంగా, పల్లకిలో వధువు ఇంటికి వచ్చాడు. పెళ్ళికూతురు పక్షంవాళ్లు తక్కువ తిన్నారా? ఇదేమిటని కూడా అడగలేదు.

పెళ్ళికూతురు వేషంలో ఉన్న కుముదిని వివాహమంటపంలోకి వెళ్ళేముందు అన్న దగ్గిరికి వెళ్ళి, తన తల అతని పాదాలకు ఆనించి, వెక్కి వెక్కి ఏడవసాగింది. వేళ అవుతున్నదని ముత్తయిదువులు ఆమెను తొందర చేశారు. సుఖపడమని విప్రదాసు తన చెల్లెలిని దీవించాడు.

పెళ్ళి అవుతున్నంతసేపూ ఆమె కంట నీరు కారుతూనేఉన్నది. భర్త చేతిలో పెట్టినప్పు డామెచెయ్యి చల్లగా అయిపోయింది. ఆమె ఆ భర్తను సరిగా చూడనైనాలేదు.

మధుసూదనుడు కురూపి కాడు; నల్లని ముఖంలో కొట్టవచ్చినట్టు కనపడే గద్దముక్కూ, పొట్టిగా, నీగ్రోల జుట్టును పోలిన జుట్టూ, దృఢమైన శరీరమూనూ. కణతలవద్ద జుట్టు నెరుస్తున్నా, అతను ఉన్నవయసుకన్న చిన్నగా కనబడతాడు. పొట్టివాడు, ఇంచుమించు కుముదిని అంత ఎత్తే, కఠినుడులాగా కనిపిస్తాడు.

పెళ్ళిలో ఆనందం ఏమీ పొంగిపొరలలేదు. భగవంతుడు తనని మరిచాడని కుముదినికి అనిపించింది; తన మనస్సును దుర్బలం కానియ్యవద్దని దేవుడికి దణ్ణం పెట్టుకున్నది.

విప్రదాసు జ్వరమూ, దగ్గూ తగ్గలేదు. ఇనుఫ్లూయెంజా అనీ, న్యుమోనియాలోకి దించే ప్రమాదం ఉన్నదనీ డాక్టరు హెచ్చరించాడు.

పెళ్ళినాటి రాత్రి మధుసూదనుడు వెంటనే కలకత్తా వెళ్ళిపోవాలన్నాడు — తన అధికారాన్ని ప్రకటించటానికి కుముదిని సిగ్గు విడిచి భర్తను వేడుకున్నది, రెండురోజు లుండి తన అన్న జర్వం తగ్గాక పోదామని

"అన్ని ఏర్పాట్లూ అయాయి," అన్నాడు భర్త.

తన కోరికలకు ఆ ఏర్పాట్లలో తావు లేదని తెలుసుకుని ఆమె భర్తమాటలకు ఏ సమాధానమూ చెప్పక, అతనికి నీపుపెట్టి పడుకున్నది.

మంచంలో పడిఉండి విప్రదాసు పెళ్ళి ఎలా అవుతున్నదోనని సంకోచించాడు. అతని అనుమానా లన్నిటికీ ఉదాత్తమైన సమాధానాలు చెప్పి పరిచారకులు, పెళ్ళి చాలా బాగా జరిగిందన్న భ్రాంతి కలిగించారు. మేళాలు వినపడవేం? అతనికి జబ్బుగా ఉందని మానేశారు. పదార్థాలు చాలాయా? ఖర్చుయినన్ని మిగిలిపోయాయి. పెళ్ళివారు సంతోషించారా? వారి నోట పల్లెత్తు మాట రాలేదు; సాధారణంగా పెళ్ళిళ్ళలో మగపెళ్ళివారు ఎన్ని తగాదాలు పెడతారు!

"వాళ్ళు పట్నవాసం చేసేవాళ్ళు — నాగరికులు. అత్తవారిని రచ్చకెక్కిస్తే తమకే అవమానమని తలుస్తారు." అన్నాడు విప్రదాసు తృప్తిగా.

తెల్లవారకముందే కుముదిని పడకగదినుంచి వచ్చేసి, స్నానమూ, పూజా చేసి అన్నదగ్గిరికి వచ్చింది.

"నీ స్వభావానికి సూటిగా నడుచుకో, చెల్లీ. నిన్నెవరూ ఏమీ చెయ్యలేరు. ఎక్కువా, తక్కువా, పెద్దా, చిన్నా, ఇవన్నీ భ్రమలు," అని విప్రదాసు చెల్లెలికి బోధించాడు.

డాక్టరు ఆమెను ఎక్కువసేపు అన్నతో మాట్లాడనివ్వలేదు. "జ్వరం తగ్గగానే కలకత్తా రా, అన్నయ్యా," అని చెప్పి, అతని వద్ద ఆశీర్వాదం పొంది, కుముదిని ఇవతలికి వచ్చేసింది.

తరవాత వధూవరు లిద్దరూ కలిసివచ్చి విప్రదాసుకు ప్రణామం చేశారు. మధుసూదనుడు మర్యాదకు, "మీ ఆరోగ్యం బాగా చెడిందే!" అన్నాడు.

కొంగులు కట్టుకుని వెళ్ళిపోయే ఆ దంపతులను చూస్తుంటే విప్రదాసు మనస్సులో భయం కలిగించే భావాలే కలిగాయి.

వివాహనంతరం జరగవలసిన గర్భాధానం కలకత్తాలోనే జరగాలన్నాడు మధుసూదనుడు. పెళ్ళి అయిన మర్నాటి ఉదయం హోమంకూడా అతను అత్తవారింట చేసుకోలేదు, మధుపురిలో చేసుకుంటా నన్నాడు! ఉభయపక్షాలమధ్యా చెడామడా పోట్లాట జరిగింది. కొట్లాటదాకావచ్చింది. తన కారణంగా తన వంశానికి అవమానం జరుగుతున్నదని కుముదిని బాధపడింది.

వధూవరులు బండిలో విడిదికి వచ్చేశారు. అక్కడ బాండు మేళం వాయిస్తున్నారు. దొరలూ, దొరసానులూ చూస్తుండగా హోమం జరిగింది. తన భర్త ముఖం అన్నతో మాట్లాడినప్పు డెలా బిగుసుకుపోయిఉన్నదీ, తెల్లవాళ్ళతో మాట్లాడేటప్పు డెలా వికసించినదీ కుముదిని గమనించింది.

రైలులో అందరూ కలకత్తాకు వచ్చేటప్పుడు మధుసూదనుడు దొరలతోసహా సెలూన్ బండిలో ఎక్కాడు. కుముదిని ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కింది. కుముదినిని గురించి ఆడవాళ్ళు రకరకాల వ్యాఖ్యానించారు. కుముదినిపట్ల స్నేహభావం చూపినది ఆమె తోడికోడలు ఒక్కతె మాత్రమే. ఆమె అసలుపేరు "నిస్తారిణి"; కాని అందరూ "మోతీతల్లి"అని పిలుస్తారు. ఆమె లావుగా ఉంటుంది — కుముదిని వయసుదే. మధుసూదనుడి తమ్ముడైన నవీన్ భార్య. "వాళ్ళమాటలు పట్టించుకోకక్కా. రెండుమూడు రోజులు యిలాగే విషం కక్కి ఆ తరవాత ఊరుకుంటారు," అన్నది మోతీతల్లి.

నూర్‌నగరులో తాము దిగిననాడు స్టేషనులో విప్రదాసు కనిపించాడని మోతీతల్లిద్వారా విని కుముదిని నిర్ఘాంతపోయింది. తాను పెళ్ళివారికి స్వాగతం చెప్పటానికి వెళ్ళినట్టు విప్రదాసు ఎవరికీ చెప్పలేదు. "అభిమానం చంపుకుని నాకోసమే వెళ్ళి ఉంటాడు," అనుకున్నది కుముదిని.

వాళ్ళు కలకత్తా చేరేసరికి సాయంకాల మయింది. వధూవరులు ఒకబండిలో ఎక్కారు. తనపక్కన కూర్చున్నవాడు తన మనిషేనన్న భావం కలిగించుకుందా మని కుముదిని ఎంత ప్రయత్నించినా, అడుగడునా ఏదో ఒక అడ్డంకి వస్తూనే వచ్చింది. అతని వైఖరీ, ప్రవర్తనా, కాఠిన్యమూ అతన్ని ఆమెకు దూరంగా ఉంచుతున్నాయి.

మధుసూదనుణ్ని మాత్రం కుముదిని చాలా ఆకర్షించింది. అంతవరకూ అతను స్త్రీ పరిచయం ఎరగడు. అతని జీవితంలో తన యింటి ఆడబడుచులకూ, కోడళ్ళకూ తప్ప స్థానం లేకపోయింది.

అతనికి సానివాళ్ళ సంపర్కంకూడా లేదు. తన భార్యకూడా ఇతర స్త్రీలలాగే ఇంట్లో పనులు చూసుకుంటూ, ఇతర ఆడవాళ్ళతో పోట్లాడుతూ, అయినదానికీ, కానిదానికీ ఏడుస్తూ జీవిస్తుందని అతను అనుకున్నాడు. భార్యతో ఆప్యాయంగా ఉండటం ఒకకళ అని గాని, దాంపత్య జీవితం అమూల్యమైనదని గాని అతనికి తెలీదు.

బండిలో ఇంటికి పోయేటప్పుడు మధుసూదనుడు ఏవో సాకు పెట్టుకుని కుముదినిని పలకరించాడు. ఆమె బిగదీసుకొని మాట్లాడలేదు. అత నామెచేతిని నీలంరాయి తాపిన ఉంగరం గమనించి, “ఆ ఉంగరం పెట్టుకోకు, నాకు నీలం అంటే అసహ్యం,” అన్నాడు.

అది, చదరంగంలో తనను ఓడించినందుకు కుముదినికి అన్నగారిచ్చిన బహుమానం. కుముదిని తన భర్తమాటకు ఉలిక్కిపడి, “వద్దు, ఉండనీ,” అన్నది. మధుసూదనుడు మంకుపట్టు పట్టి ఆ ఉంగరాన్ని ఆమె చేతినుంచి తీయించాడు. అది ఆమె అన్న ఇచ్చినదని గ్రహించి, “అలా చెప్పు!” అన్నాడు. కుముదినికి తన అన్నపై ప్రేమ ఉండటం తనకు తీరని అవమానమైనట్టు.

మధుసూదనుడికి కుముదినిపైన కొంత ఆదరం ఉండటానికి కారణాలు. ఆమె అసాధారణ సౌందర్యవతి కావటం మాత్రమే కాదు. భార్యద్వారా ధనప్రాప్తి కలుగుతుందని జ్యోతిష్కులు చెప్పినదానికి దాఖలాగా, అవిసిగింజల ఎగుమతిలో ఇరవై లక్షలు లాభం వచ్చిందని పెళ్ళిరోజునే తంతివచ్చింది. ఆ ఆనందం ఒక పక్క లేకపోయినట్టయితే ఆ ఉంగరంమూలంగా భార్యా భర్తలకు ఆ బండిలోనే పెద్ద ఘర్షణ జరిగిఉండును.

## 5

మధుసూదనుడు “రాజా” బిరుదు పొందగానే అతని ఇల్లు “మధు ప్రాసాదం” అయింది. వధూవరులు వచ్చి దిగేసరికి గేటు దగ్గర నౌబత్ మేళమూ, లోపల ఉద్యానంలో బాండు మేళమూ మోగుతున్నాయి. ఇల్లు తోరణాలతో అలంకరించిఉన్నది.

బండి వరండా దగ్గిర ఆగగానే, మధుసూదనుడికి అమ్మమ్మ వరస అయిన ముసలిది వచ్చి, వధువుకు ఇనపగాజులు తొడిగి ఆమె నోటికి కొంచెం తేనెరాచి, “ఇన్నాళ్ళకు మా నీలాకాశంలో పూర్ణచంద్రుడు ఉదయించాడు; మా నీలసరోవరంలో సువర్ణ పద్మం వికసించింది;” అన్నది.

వేడుక చూసే యువకులు అసూయతో, “రాక్షసుడు అప్సరసను బంగారు గొలుసులతో కట్టి తెచ్చాడురా!” అని తమలో అనుకున్నారు.

కుముదిని పడకగది అంతఃపురం మూడో అంతస్తులో ఉన్నది. బాగా పొద్దుపోయి సందడి చల్లారాక కుముదినిని మోతీతల్లి ఆ గదిలోకి తీసుకువచ్చి, “నే నిప్పుడే వస్తాను, ఈలోపుగా హాయిగా ఏడ్చెయ్యి,” అంటూ బయటికి వెళ్ళింది.

Tel: NANDI Phone: 245

మా ఖాతాదార్లకు, శ్రేయోభిలాషులకు అభినందనలు




ప్రఖ్యాతి గాంచిన

“నంది”

ఆభరణములు

నిత్య అలంకారమునకు,

సంతోషమునకు తోడ్పడుచున్నవి

కాని కుముదినికి ఆ క్షణంలో కావలిసింది ఏడ్పు. హృదయ భారం తగ్గించుకోవటం కాదు. తనకు బలం ఇయ్యమని దేవుణ్ణి ప్రార్థించటం. ఆమె ఆప్రయత్నంలో ఉండగా శ్యామసుందరి అక్కడికి వచ్చింది. ఈమె కుముదినికి మరొక తోడికోడలు, వితంతువు. మంచి దేహసౌష్ఠవమూ, అందమూ, చామనఛాయా గల మనిషి. ఆమె తనపేరు చెప్పుకుని, "నీ భర్త నాకు మరిది. చిత్రా పుస్తకమే అతనికి భార్యగా ఉండిపోతుం దనుకున్నాం. ఈ వయస్సులో నీఅంత అందగత్తె దొరికిందంటే ఆ చిత్రాపుస్తకం మహిమే. నాతో నిజం చెప్పు చెల్లి. మా పెద్దమరిది నీకు నచ్చాడా ?" అన్నది.

కుముదినికి ఏమనాలో తెలియ లేదు.

"ఔను, నచ్చకపోతేమాత్రం ఇప్పుడు చేసే దేమిటీ? సప్తపది జరిగిపోయింది." అన్నది శ్యామా.

"అలా అంటావేం, అక్కా ?" అన్నది కుముదిని.

"నోటితో చెప్పాలా ? నీ ముఖం చూస్తే తెలియటంలేదూ ? నువు కర్కోటకుడిలాటివాడి చేతిలో పడ్డావు; ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి."

ఇంతలో మోతీతల్లి వచ్చి శ్యామాసుందరిని అక్కడినుంచి లాక్కుపోయింది. శ్యామా అన్నమాటలతో కుముదిని హృదయం చేదెక్కింది.

అంతలో కుముదినిని "పెద్దమ్మా" అని పిలుస్తూ ఒక ఏడేళ్ళ కుర్రవాడువచ్చి ఆమె నానుకుని నిలబడ్డాడు. కుముదిని తన ఇష్ట దైవమైన గోపాలవిష్ణుడే ఆరూపంలో తనకు చిత్తశాంతి కలిగించ వచ్చా డనుకున్నది. ఆమె అతన్ని, "నీ పేరేమిటి, బాబూ ?" అని అడిగితే, "శ్రీ మోతీలాల్ ఘోషాల్," అని చెప్పాడు. కాని వాణ్ణి ఆ పేరుతో ఎవరూ పిలవరు, "బ్లూ" అని పిలుస్తారు. కుముదిని వాణ్ణి తన గుండెకు హత్తుకుని, మెత్తని బుగ్గలు నొక్కుతూ, "పువ్వులు కావాలా, గోపాల్ ?" అన్నది.

వాడు తనపేరు మారినందుకు ఆశ్చర్యపడ్డాడుగాని, అభ్యంతరం చెప్పలేదు. ఇంతలో పక్కగదిలోనుంచి మోతీతల్లి వచ్చి, "కోతివెధవ వచ్చాడూ?" అంటూ వచ్చి వాణ్ని తీసుకుపోయింది.

మర్నాడే గర్భాధానం. ఆరోజు ఉదయమే విప్రదాసు తన చెల్లెలిని ఆశీర్వదిస్తూ పంపిన తంతి వచ్చింది. దాన్ని కుముదిని తన జాకెట్టులో భద్రంగా దాచింది.

భారీగా సారెతీసుకుని నవగోపాలుడు మాత్రమే కలకత్తా వచ్చాడు. విప్రదాసు ఇన్ఫ్లూయెంజా న్యుమోనియాలోకి దించిందట.

శోభనపు గదిలోకి వెళ్ళవలసిన సమయానికి కుముదినికి గుండెలో దడపుట్టింది. కాళ్ళూ, చేతులూ చల్లబడ్డాయి, ఒళ్ళంతా చెమటలుపట్టాయి. ముఖం పాలిపోయింది. ఆమె మోతీతల్లితో తనను పదినిమిషాలపాటు ఎక్కడన్నా ఒంటరిగా కూర్చోబెట్ట





మన్నది. మోతీతల్లి ఆమెను తన పడకగదిలోకి పంపి, తాను బయట కాపలా ఉన్నది

పెళ్ళికొడుకు శోభనపుగది ప్రవేశించాడు. పెళ్ళికూతు రేమయిందని ఆడవాళ్ళు తహతహ పడుతున్నారు. చివరకు మోతీతల్లి వారిని తన పడకగదిలోకి తీసుకుపోయేసరికి, కుముదిని స్పృహ తప్పి నేలపైన పడివున్నది. ఆమెను మంచంమీద పడుకోబెట్టి శైత్యోపచారాలు చేశారు.

శ్యామాసుందరి మధుసూదనుడి వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్ళి పెళ్ళికూతురు మూర్ఛపోయిందని చెప్పింది.

"ఏం వచ్చింది ?" అన్నా డతను కోపంగా.

''నా కేం తెలుసు ? అన్నయ్యా, అన్నయ్యా అని తపిస్తున్నదిట ! ఒక్కసారి వెళ్ళిచూడు.''

"చూసి ఏం లాభం ? నే నేమన్నా అన్నయ్యనా ?"

"అంతకోపం దేనికబ్బాయ్ ? పెద్దఇంటి పిల్లకద ! ఉపాయంగా దారికి తెచ్చుకోవాలి."

"అంటే ఆవిడ రోజూ మూర్ఛపోతుంటే, నేను నెత్తికి తైలమర్దనం చెయ్యాలా ? ఇందుకేనా ఏమిటి పెళ్ళాడింది ?"

"మా కాలంలో ఆడవాళ్ళ గర్వాన్ని రోజూ అణగ్గొట్టేవారు. ఈ కాలంలో మూర్ఛలు తేర్చాలి. నువ్వలా మనసును కష్టపెట్టుకుంటే నేను సహించలేను." అంటూ శ్యామా చనువుగా అతని చెయ్యి పట్టుకున్నది. మామూలుగా అతనంటే ఉండే భయం ఇప్పుడామెకు లేకపోయింది; ఎందుకంటే ఈ క్షణంలో అతను దుర్బలుడు

శ్యామ ఓదార్పు మధుసూదనుడికి కొంత ఆనందమిచ్చింది. ఆమెకూడా చక్కనిది, శరీరచ్ఛాయ తక్కువైతేనేం ? ఏం కళ్లు ! ఏం జుట్టు ! ఏం పెదవులు !

పెళ్ళికూతురు వస్తున్న అలికిడి విని శ్యామా, "ఇక నేను పోతాను. ఆ పిల్లమీద ఆగ్రహించకు. పాపం చిన్నది ?" అంటూ వెళ్ళిపోయింది.

కుముదిని గదిలోకి రాగానే మధుసూదనుడు కోపం ఆపుకోలేక, "పుట్టింటినుంచి మూర్ఛలుకూడా తెచ్చుకున్నట్లున్నావు. మీ నూర్‌వగరు వేషా లిక్కడ పనికిరావు !" అన్నాడు.

కుముదిని ఆశ్చర్యంతో అతన్ని తేరిపారచూసింది.

మధుసూదనుడు మరింత కోపంగా "నేను లక్ష పనులు గలవాణ్ణి. హిస్టీరియా రోగిని బుజ్జగిస్తూ కూర్చోవటానికి నాకు వ్యవధి ఉండదు. జ్ఞాపకం ఉంచుకో," అన్నాడు.

కుము శాంతంగా, "నన్ను అవమానించాలని చూస్తున్నావు; కాని అది నీవల్లకాదు. నీ అవమానాలను పట్టించుకోను," అన్నది.

ఆమెలో ఆగ్రహం కలగనందుకు అతను ఆశ్చర్యపోయాడు. అతను వెటకారంగా, "నువు మీ అన్నగారి శిష్యురాలివి. ఆ అన్నగారికి అప్పిచ్చిన వడ్డీ వ్యాపారస్తుణ్ణి. అతన్ని ఈ సంతలో కొని ఆ సంతలో అమ్మెయ్యగలను. నీకు తెలియదేమో !" అన్నాడు.

"కావాలంటే దౌర్జన్యం చెయ్యి; కాని హీనుడివైపోకు," అంటూ కుముదిని ఒక సోఫామీద కూర్చున్నది.

''నేను హీనుణ్ణి, మీ అన్న ఘనుడూనూ !''

"ఘనుడ పనుకునే మీ యింటికి వచ్చాను."

"డబ్బాశతో కాదా ?"

కుముదిని గదిలోనుంచి బయటికి వచ్చి డాబామీద చతికిలబడింది. చలికాలం - పొగమంచు దట్టంగా ఉన్నది. కుముదిని మనస్సు తిమ్మిరెక్కిపోయిన శరీరంలా గుంది. అందులో ఒక ఆలోచనగాని, విచారంగాని లేదు

మధుసూదనుడు కోపంతో ఉడికిపోతూ, కాస్సేపు చూసి, ఆమెను కేకపెట్టి "బయట చలిలో ఏం చేస్తున్నావు ? లోపలికి రా," అన్నాడు తరవాత తానే లేచి వెళ్ళి, చెయ్యి పట్టుకుని ఆమెను లోపలికి తీసుకువచ్చాడు. అతని అధికారాతిశయం చాలా వరకు తగ్గిపోయింది.



## 6

కుముదిని తెల్లవారగట్ట భర్తకన్న ముందే లేచి. తన మనసు కఠినమైపోతుందన్న భయంతో అతని ముఖం చూడకుండా, కాళ్ళకుమాత్రం నమస్కారంచేసి, స్నానాల గదిలోకి వెళ్ళి స్నానం చేసి, డాబామీద కొంతసేపు కూర్చుని, కొంచెం ఎండ ఎక్కాక తిరిగి గదిలోకి వచ్చేసరికి అక్కడ భర్తలేదు. కిందటి రోజు తాను చేతినుంచి తీసి, తన పూసలసంచీలో పెట్టుకున్న నీలంరాతి ఉంగరం ఇప్పుడు చూస్తే సంచీలో లేదు.

మోతీతల్లి ఫలహారానికి పిలవవస్తే కుముదిని ఈ సంగతి ఆమెకు చెప్పింది.

"కొంచెం ఓర్పుగా ఉండు. నీతో ఆడుకుంటున్నాడు. తిరిగి ఇస్తాడులే." అన్నది మోతీతల్లి.

"ఇవాళ నుంచీ నాది అనే వస్తువేదీ నాకుండదా?" అని కుముదిని అడిగింది.

"భర్త కనికరించి ఇస్తేనే వుంటుంది. ఉత్తరం రాసినా చివర 'నీ దాసి' అని రాయాలి".

భార్యను దాసిగా చేసినవాళ్ళు ఏజాతికి చెందిన వాళ్ళు?"

"అతని సంగతి నీకు తెలీదు. ఇతరులను బానిసలల్లే చూడటం కాదు, తానే ఒక బానిసలాగా ప్రవర్తిస్తాడు. ఒకరోజు ఆఫీసుకు పోకపోతే తన జీతం తెగ్గోసుకుంటాడు."

"నేను బానిసవృత్తే చేస్తాను. నా తిండి బట్టల ఖర్చు చాకిరీ చేసి సంపాదిస్తాను. నాకు పని చూపించు. అతనికి నన్ను నేను సమర్పించుకుందామని వచ్చాను. కాని అతనికి నేను దక్కను. దాసి మాత్రమే దక్కుతుంది."

కొంతసేపయాక కుముదిని తన గదికి తిరిగివచ్చేసరికి టీపాయ్ మీద పిప్పరమింట్ల సీసా ఉన్నది. అది హాబ్లూ కానుక. "ఈ ఇంట్లో రాళ్ళమధ్యకూడా పూలు పుట్టుతున్నాయి" అనుకున్నది కుముదిని.

తలుపుచాటున దాక్కున్న హాబ్లూను పట్టుకుని తెచ్చి కుముదిని తన ఒళ్ళో కూర్చోబెట్టుకున్నది. వాడి దృష్టి ఒక పేపర్‌వెయిట్ పైన ఉండటం చూసింది. అది, లోపల రంగుల పువ్వుల్లాటివి ఉండే గాజుదిమ్మ. కుముదిని దాన్ని హాబ్లూ కిచ్చేసింది. దాన్ని తీసుకుని వాడు పరమానందంతో గంతులు వేస్తూ వెళ్ళిపోయాడు.

దాన్ని వాడిచేతిలోనుంచి మధుసూదనుడు లాగేసుకుని, వాడికి దొంగతనం అంటగట్టి చావగొట్టాడు. వాడు దెబ్బలైనా తిన్నాడు గాని దొడ్డమ్మ దాన్ని తన కిచ్చినట్టు చెప్పలేదు. ఈ సమాచారం వాడి తల్లిద్వారా కుముదిని తెలుసుకున్నది.

మధుసూదనుడు గదికి తిరిగివచ్చి, పేపరు వెయిటు యథాస్థానంలో పెడుతూ, "హాబ్లూ దీన్ని నీ గదిలోనుంచి దొంగతనం చేశాడు. వస్తువులు కాస్త జాగ్రత్తగా ఉంచుకుంటూండు." అన్నాడు.

"వాడు దొంగిలించలేదు. నేనే వాడి కిచ్చాను."

"వాణ్ణి ఇలాగే పాడుచేస్తావా ఏం? నాతో చెప్పకుండా ఎప్పుడూ ఎవరికీ ఏదీ ఇవ్వకు. తెలిసిందా?"

"నువు నా నీలం ఉంగరం తీసుకోలేదూ?"

"తీశాను."

"అంతకంటే గాజుగుండు ఎక్కువా?"

"ఆ ఉంగరం నీదగ్గిర ఉండరాదని చెప్పలేదూ?"

"నీ వస్తువులు నువుంచుకోవచ్చు, నా వస్తువులు నేనుంచుకో కూడదా?"

"ఈ ఇంట్లో ప్రత్యేకించి నీవస్తువులంటూ ఏవీ ఉండవు."

"అయితే ఈ గదికూడా నీదే." అంటూ కుముదిని వెళ్ళిపోయింది.

శ్యామా ఆదరాబాదరా వచ్చి, "కోడ లేదీ?" అని అడిగింది.

"ఎందుకూ?' అని మధుసూదను డడిగాడు.

"పొద్దుటినుంచీ ఫలహారం పట్టుకు కూర్చున్నాను. ఈ ఇంట ఆవిడ భోజనంకూడా మానేస్తుందా?"

"మానేస్తే మానెయ్యనీ. మీరంతా ఆవిడగారి దాసీలా?"

"అదేమిటబ్బాయ్? చిన్నపిల్లమీద అలా కోపగించవచ్చా? భోజనం మాని మాడుతుంటే చూస్తూ ఊరుకుంటామా?"

"సరేలే. ను వ్వేమీ చెయ్యొద్దు. ఆకలివేస్తే తానే వచ్చి తింటుంది. నువెళ్ళు."

మధుసూదనుడి బుర్ర వేడెక్కింది. అతను వెళ్ళి షవర్‌బాత్ కింద నిలబడ్డాడు...

ఆ రోజల్లా కుముదిని ఆ ఇంట్లో ఎవరికీ కనబడలేదు. మోతీ తల్లి వెతకగా వెతకగా, లాంతర్లూ, దీపంబుడ్లూ ఉంచే చిన్న పంచలో చాపమీద కూచుని కనిపించింది.

"భలేదానివే. ఇక్కా? ఏమిటిది?" అని మోతీతల్లి అడిగింది.

"ఈ లాంతర్లూ, బుడ్లూ బాగుచెయ్యటమే నా పని. ఉండటం కూడా ఇక్కడే ఉంటాను," అన్నది కుముదిని. ఆమెను అక్కడి నుంచి కదిలించటం తనవల్ల కాక, మోతీతల్లి వెళ్ళిపోయింది.

రాత్రి పడుకోవటానికి వచ్చిన మధుసూదనుడు తన భార్య విషయము తెలుసుకుని, "ఎన్నాళ్ళుంటుందో అక్కడే ఉండనీ. బతిమాలితే మరింత బిర్రబిగుస్తుంది." అనుకున్నాడు

అతను దీపం ఆర్పేసి నిద్రపోదామని చూశాడు గాని నిద్ర రాలేదు. ఏ అలికిడయినా కుముదిని వస్తున్నదనుకుని, గది బయటికి వచ్చి చూశాడు. రాత్రిగడుస్తున్నకొద్దీ అతని మనస్సు మరింత ఆరాటపడసాగింది. చివరకతను లాంతరు తీసుకుని దీపాలగదికి వెళ్ళాడు. కుముదిని ఆ గదిలో చాపమీద పడుకుని నిద్రపోతున్నది. తాను నిద్రరాక కొట్టుకుంటూంటే ఆమె నిశ్చింతగా నిద్రపోవటం అన్యాయ మనిపించిం దతనికి.

అంతలో కుముదిని అటునుంచి ఇటు పొర్లింది. ఆమె కంటపడ్తే తాను హాస్యాస్పదుడై పోతానని భయపడి అతను వెనక్కు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

దారిలో శ్యామ దీపంతీసుకుని ఎదురై అతన్ని ఎక్కడ్నుంచి వస్తున్నావని అడిగింది. నువ్వెక్కడికని అతను ఎదురుప్రశ్న వేశాడు.

"రేపే నా వ్రతం. బ్రాహ్మణులకు విందుచేస్తున్నాను, నువుకూడా విందుకు రావాలి. నీకు తగినదక్షిణ ఇచ్చుకోలేను." అన్నది శ్యామ.

ఆ దీపం వెలుతురులో శ్యామ చాలా అందంగా కనబడింది. అతని జవాబు నాలుకచివరదాకావచ్చి ఆగిపోయింది.

"నిద్రలేచి నీవంటి భాగ్యవంతుడి ముఖం చూశాను. వ్రతం సఫలమవుతుంది." అంటూ శ్యామ వెళ్ళిపోయింది.

అతను తిరిగి గదికివచ్చి పడుకున్నాడు. నిద్రపోతున్న కుముదినిముఖం అతని కళ్ళఎదుట కట్టినట్టే వున్నది. అతను నిద్ర ఆశ వదులుకుని, దీపం వెలిగించి, కుముదిని సొరుగునుంచి ఆమె పూసలసంచి తీశాడు. అందులో విప్రదాసు పంపిన తంతీ, విప్రదాసూ


ఆంధ్రపాఠకలోకాన్ని
ఉఱ్ఱూతలూగిస్తున్న
యద్దనపూడి
సులోచనా
రాణి
రచనలు
సెక్రటరి
సీరియల్ నవల 6-00
బహుమతి
కథలు 5-00
జ్యోతి
కథలు 5-00
మనియార్డర్లు
పంపిన వారికి
పోస్టు ఖర్చులు
ఉచితం
నవభారత్
బుక్ హౌస్
విజయవాడ 2

అతని తమ్ముడూ ఉన్న చిన్నఫొటో, ఒకచిన్న కాగితంమీద విప్రదాసు రాసిన భగవద్గీత శ్లోకమూ కనిపించాయి.

అతను విప్రదాసును తిట్టుకున్నాడు. కుముదినిని అతని ప్రభావం నుంచి తొలగించి తనదాన్ని చేసుకోవటానికి మార్గమేమిటి? అఘాయిత్యం తప్ప మధుసూదనుడు మరే మార్గమూ ఎరగడు. కుముదిని అందరుస్త్రీలలాగే తేలికగా తన అధీనంలోకి వస్తుందని అతననుకున్నాడు గాని. ఆమె సాధారణ స్త్రీ కాదని స్పష్టమయింది. ఆమె ఇది చెయ్యదు అని తానిప్పుడు అనుకోలేని స్థితిలో పడ్డాడు. సంతాన బంధంతో ఆమెను కట్టేసుకోవచ్చునన్న ఆలోచన అతనికి కొంత మనశ్శాంతి నిచ్చింది.

గడియారం అయిదుకొట్టింది. కాని ఇంకా బాగా చీకటిగా ఉన్నది. అతను తిరిగి దీపాలగదికి వెళ్లితే కుముదిని అక్కడ లేదు. వెతకగా కొళాయిదగ్గిర పాతసెమ్మెలన్నిటినీ పోగేసుకుని. వాటిని చింతపడుపెట్టి తోముతున్నది. ఇంట్లోవాళ్ళు నిద్రలేచి చూసి ఏమనుకుంటారు? అట్లుతోమేది చూస్తే ఏమనుకుంటుంది? తనను నవ్వులపాలు చెయ్యటానికే ఆమె ఇలా చేస్తున్నదని అతనికి తోచింది. ఆమెవద్దకు వెళ్లి వాదన పెట్టుకోవచ్చు, కాని అది ఇంట్లో అందరికీ మంచి ప్రహసన మవుతుంది.

మధుసూదనుడు తన తమ్ముడు నవీనుణ్ణి పిలిచి, "ఇంట్లో ఏం జరుగుతున్నదీ ఏమైనా చూస్తున్నావా?" అని అడిగాడు. నవీన్‌కు ఏమీ అర్థం కాలేదు.

"మీ వదినెను నీ భార్యే మరింత పిచ్చిదాన్ని చేస్తున్నది," అన్నాడు మధుసూదనుడు.

నవీనుడు తన భార్యవద్దకు వెళ్ళి తాను చిక్కులోపడ్డట్టు చెప్పుకున్నాడు. ఏమయిందంటే "దేవుడికి తెలియాలి. మా అన్నయ్యకు తెలియాలి" అన్నాడు.

కుముదినిని సరిఅయిన దారిలో పెట్టవలసినది తానని, తనను సరిఅయినదారిలో పెట్టమని తన భర్తను అన్నగారు ఆదేశించాడనీ, లేకపోతే తన భర్తను రజబ్‌పూర్ పింపించేస్తానంటున్నాడనీ, మోతీతల్లి తెలుసుకున్నది.

"ఎంతగొప్ప రాజైనా రాణిగారి గర్వాన్ని అణచాలంటే తానే స్వయంగా పూనుకోవాలి. శోభనపు గదిలోకి కూలివాళ్ళను పంపరాదని మీ అన్నతో చెప్పు" అన్న దామె.

ఈలోపల కుము సెమ్మెలుతోమటం పూర్తిచేసి, స్నానం చేసి, తడిజుట్టు విరబోసుకుని, తూర్పు ముఖమై, పాడుకుంటూ డాబామీద కూర్చున్నది. తనను వెతుక్కుంటూ వచ్చిన మోతీ తల్లిని చూసి ఆమె, "ఇవాళకూడా అన్నయ్యదగ్గిరనుంచి ఉత్తరం రాలేదు. ఆయనకు ఒంట్లో ఎలా ఉందో? నేను బయలుదేరేటప్పుడు చాలా జబ్బుగా వున్నాడు. తన విషయం నేను ఆదుర్దాగా ఉంటానని ఆయనకు తెలుసు." అన్నది.


# THE INDIAN OVERSEAS BANK LIMITED

**ANNOUNCES**

***REVISED INTEREST RATES ON TERM DEPOSITS***


| | | |
|---|---|---|
| Of 91 days and over but less than 6 months | ... | 5 1/8% |
| Of 6 months and over but less than 1 year | ... | 5 5/8% |
| Of 1 year and over but less than 2 years | ... | 6 1/8% |
| Of 2 years and over but less than 3 years | ... | 6 3/8% |
| Of 3 years and over but less than 5 years | ... | 6 5/8% |
| Of 5 years and over but less than 7 years | ... | 7 1/8% |
| Of 7 years and over but less than 9 years | ... | 7 3/8% |
| Of 9 years and over | ... | 7 5/8% |

**THE INDIAN OVERSEAS BANK LIMITED**
CENTRAL OFFICE: 151, MOUNT ROAD, MADRAS-2.

**M. CT. MUTHIAH**
Chairman

**K. M. NANJAPPA**
General Manager.

-IOB




"విచారించకు అక్కా. నీకు నేను కబురు తెప్పించిపెడతాను." అన్నది మోతీతల్లి.

"నా పేరను అన్నయ్యకు టెలిగ్రాం పంపగలవా ?"

మోతీతల్లి సరేనని వెళ్ళిపోయి, తన భర్త నవీనుడితో, "బావ గారి గదిలో టేబిలుమీద పెద్దతోడికోడలు పేర వచ్చిన ఉత్తర మేదన్నా ఉంటే తీసుకురావాలి. టేబిలుమీద లేకపోతే సొరుగులో చూడాలి." అన్నది.

నవీన్ భయపడ్డాడు. అన్నగదిలోకి వెళ్ళటమంటే పులిబోనులోకి వెళ్ళటమే. గదిలో అన్న లేకపోయినా పట్టపగలు ఇతరు లెవ రైనా చూస్తారు. రాత్రికి చూస్తా నన్నాడు.

చివరకు మోతీతల్లి తన భర్తచేత కుముదిని అన్నగారికి టెలిగ్రాం ఇప్పించటానికి ఒప్పించిది. అదీ సాహసంతో కూడిన పనే.

## 7

ఆరోజు సాయకాలం మధుసూదనుడు ఇంటికివచ్చి డిస్పాచి రిజిష్టరులో విప్రదాసు పేర ఒక టెలిగ్రాం వెళ్ళినట్టు చూశాడు. దాన్ని పంపినది 'తమ్ముడుగారు' అని దర్వాన్ చెప్పాడు.

మధుసూదనుడు నవీనుణ్ని పిలిచి, "నాకు తెలియకుండా ఈ టెలిగ్రాం పంపమని నీ కెవరు చెప్పారు ?" అని అడిగాడు.

నవీన్ తెల్లముఖం వేసి జవాబు చెప్పలేదు.

"చిన్నకోడలేనా ?"

నవీన్ అవు నన్నట్టు తలడించుకున్నాడు.

మధుసూదనుడు క్రోధావేశంలో నోటమాట రాక, చెయ్యి ఊపి, తమ్ముణ్ని గదిలోనుంచి పంపేశాడు.

నవీన్ తన భార్యవద్దకు వెళ్ళి, "మూటాముల్లే సర్దు. ప్రయాణం రావచ్చు." అన్నాడు.

"వస్తే పోదాం. ఇక్కణ్ణుంచి పోతే చచ్చిపోతామా ?"

"నన్ను కలుపుకోకు. నిన్నే పంపెయ్యమంటాడు ఈసారి."

"నువు నన్ను వదిలి ఒక్కక్షణం ఉండలేవు. ఆ సంగతి ఈ యింట్లో అందరికీ తెలుసు. ఈ రోగం మీ వంశంలోనే ఉంది. మీ అన్నయ్యకూ అదేగతి పట్టబోతూంది. ఇన్నాళ్ళూ డబ్బుసంచులు కరచుకు కూర్చున్నాడు. ఇక భార్యను కరుచుకు కూర్చుంటాడు." అన్నది మోతీతల్లి.

"అన్నయ్యగారు భార్యను కరుచుకు కూర్చోనీ. మరి తమ్ముడి గతేమిటి?"

"వెంటనే అన్నయ్యగారి గదిలోకి వెళ్ళి బల్లా, సొరుగూ వెతికిరా. అక్కపేర ఉత్తరం వచ్చిఉండాలి."

"వచ్చే ఉంటుంది. కాని దాన్ని తాకానంటే నాకు ఏడు సంత్స రాల కఠిన ఉరిశిక్షే !"

"ఉత్తరం వచ్చిందేమో చూసిరా, చాలు."

ఆరాత్రి నవీన్ అన్నగారి గదికి వెళ్ళివచ్చి, కుముదిని పేర ఒక టెలిగ్రాము వచ్చిఉన్నట్టు చెప్పాడు...

కుముదిని దీపాలు తుడిచేపని అయితే మీదవేసుకున్నది గాని, ఆ పని తనకు చేతకాదని త్వరలోనే తెలిసిపోయింది. తను తల పెట్టిన పని చేతగాక, ఇంకేపనీ చెయ్యక ఎలా జరుగుతుందో ఆమెకు బోధపడలేదు. మోతీతల్లి వచ్చి, తనకు చెయ్యి విడిగా ఉన్నదని చెప్పి, లాంతర్లు తుడవడానికి సాయం వస్తే కుముదిని వద్దనలేక పోయింది. అప్పటికీ బుడ్లలో వత్తులు ఎక్కించేపని దిగబడి పోయింది. "బంకూ"ను పిలుస్తానని మోతీతల్లి అంటే కుముదిని ఒప్పుకోవలసివచ్చింది.

"రేపటినుంచీ మామూలు గృహిణిగా ఉంటాను." అనుకున్నది కుముదిని. ఆమె ఆ రాత్రి భోజనం మాని దైవధ్యానం చేసింది.

మధుసూదనుడిలో కలిగిన మార్పు అందరూ గమనించారు. అతనికి జీవితంలో మొట్టమొదటిసారిగా తన వ్యాపారంపట్ల అశ్రద్ధ ఏర్పడింది. అంతకన్న ముఖ్యమైనది అతని జీవితంలో ప్రవేశించింది; కాని అది అతని అదుపులోకి రాకుండా ఉన్నది.

ఆరాత్రి అతను పడకగదికి వెళ్ళి, మంచంమీద పడుకోలేదు. కుముదిని రాదని తెలుసుగాని, వస్తుందేమోనన్న ఆశ అతన్ని వదలలేదు. మంచంమీద పడుకుంటే తనకు నిద్ర పట్టుతుందేమో నని నిద్రలోఉన్న తనని చూచి కుముదిని వెళ్ళిపోతుందేమోనని అతను మేలుకుని కూర్చున్నాడు.

గోడగడియారం పదకొండు కొట్టటం విని అతను ఉలిక్కిపడి లేచి, నవీన్ సహాయం తీసుకుందామనుకున్నాడు. ఆఫీసుగదిలో అన్నదగ్గిరికి వచ్చి బోనులో ముద్దాయిలా నిలబడ్డాడు.

“మీ వదినె కెవరో నూరిపోస్తున్నారు. నా భార్య నాయిష్ట ప్రకారం నడవాలిగాని, ఇతరులు చెప్పినట్టు నడవరాదు. అందుచేత నీ భార్యను పుట్టింటికి పంపెయ్యి.” అన్నాడు మధుసూదనుడు.

“అవును. నేనూ అదే అనుకుంటున్నాను. నీతో చెబితే నువు ఒప్పుకోవేమోనని భయపడ్డాను.” అన్నాడు నవీనుడు.

“ఆమాట కర్థమేమిటి?” అన్నాడు మధుసూదనుడు ఆశ్చర్యంగా.

షట్టింటికి పోతానని చాలాకాలంగా తొందరపడుతున్నది. మూటా ముల్లె సర్దుకునికూడా సిద్ధంగా ఉంది. మంచిరోజు చూసి పంపేస్తాను.” అని నవీనుడు బొంకాడు.

“పుట్టింటికి వెళ్ళాలని నీ భార్య కేమంత తొందర?”

“నే నేంచేసేది, అన్నయ్యా? నువే ఎప్పుడో ఒకనాడు ఆమెను వెళ్ళమంటావనీ, ఆమాట అనిపించుకోకుండానే పోవాలనీ నిశ్చయించింది, వచ్చే త్రయోదశి మంచిరోజుట. ఆలోపున పనులన్నీ చక్కబెట్టి, లెక్కకూడా అప్పజెబుతా నన్నది.”

“చూడు, నవీన్. నువే నీపెళ్ళాన్ని ముద్దుచేసి మొండితనం నేర్పావు. వెళ్ళటానికి వీల్లేదని గట్టిగా చెప్పు. మగవాడివి. నీమాట చెల్లకపోవటం నేను సహించను.”

“చెప్పిచూస్తాను. కాని –”

“నేనే చెప్పానని చెప్పు. ఇప్పుడు వెళ్ళగూడదు, సమయం వస్తే మంచిరోజుచూసి నేనే చెబుతాను.”

“పుట్టింటికి పంపమని ఇప్పుడు నువే అంటివే?”

“వెంటనే పంపమనా నే నన్నది?” అని అన్నగారు గర్జించారు. నవీన్ వెళ్ళాడు.

దేవిడీలో రెండుగంటలు కొట్టారు. మధుసూదనుడు లేచి, సొరుగులోనుంచి కుముదినికి వచ్చిన తంతి తీసి జేబులోపెట్టుకుని, మూడోఅంతస్తుకువెళ్ళే మెట్ల ఎదట కాస్సేపు నిలబడ్డాడు. ఆ అపరాత్రివేళ తాను ఓడినట్టు ఒప్పుకోవటం అతనికి సాధ్యమయింది.

అతను మెట్లముందునుంచి కదిలి, ఒక చిన్న కిరసనాయిలు బుడ్డిదీపం తీసుకుని, దడదడలాడే హృదయంతో లాంతర్ల గదికి వెళ్ళి, తలుపు తోశాడు.

కుముదిని దుప్పటి కప్పుకుని, ఒకచెయ్యి రొమ్ముమీద పెట్టుకుని గాఢనిద్రలో ఉన్నది. మధుసూదనుడు ఆమె సమీపంలో కూర్చుని ఆమె ముఖం దగ్గరగా తన ముఖంపెట్టి ఆమెను పరీక్షించాడు. తాను కుముదినిని స్వాధీనపరచుకోలేక పోవటానికి గొప్ప కారణమేదో ఉండాలని అతనికి అనిపించింది.

అతను మనసు అణుచుకోలేక ఆమెచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆమె నిద్రలోనే ఏదో గొణిగి, తనచెయ్యి లాగేసుకుని పక్కకు పొర్లింది. అతను ఆమె చెవిదగ్గర నోరు పెట్టి, “మీ అన్నయ టెలిగ్రాం ఇదుగో,” అన్నాడు.


PHONE: 991 GRAMS: AUTO

*With the compliments:*

## AUTO INDIA GARAGE

**AUTOMOBILE ENGINEERS, RAJAH'S GARDEN, GUNTUR**

(GOVERNMENT RECOGNISED WORKSHOP)

Specialists in all kinds of Job work & Painting

Sole Distributors for "ATALANTA" 120 Scooters for the states of

ANDHRA PRADESH - MADRAS - MYSORE & KERALA

Sub-Agencies at:

HYDERABAD, BANGALORE, MYSORE, VIJAYAWADA,
COIMBATORE, TADEPALLIGUDEM

*A trial will convince you.*



హఠాత్తుగా కుముదిని నిద్రలేచి కూర్చున్నది. భర్తను చూసి నిర్ఘాంతపోయింది.

మధుసూదనుడు మూలనున్న లాంతరుతెచ్చి దగ్గిర బెట్టి. ఆమెచేతికి టెలిగ్రాం ఇచ్చాడు. తనకు జబ్బు నయమవుతున్నదని విప్రదాసు అందులో చెల్లెలికి తెలియజేస్తూ, తన ఆశీర్వాదాలు పంపాడు.

కుముదిని దాన్ని చదువుకుని, "అన్నయ్యదగ్గిరనుంచి ఉత్తరం ఏదీ రాలేదూ?" అన్నది.

"నామీద ఆగ్రహించకు." అన్నా డతను. అది అధికారి అజ్ఞ కాదు, ప్రియుడి విన్నపం.

"నాకేమీ కోపంలేదు" అన్నది కుముదిని.

"అలా అయితే ఇక్క డెందుకు? నీ గదికి వచ్చెయ్యి.''

ఇద్దరూ మేడ ఎక్కారు. మధుసూదనుడు గదిలోకి ప్రవేశించాడు. "నే నిప్పుడే వస్తాను" అని చెప్పి కుముదిని డాబా మూలకు వెళ్ళి కూర్చున్నది.

కొంచెం సేపయాక మధుసూదనుడు ఆమె దగ్గిరికి వచ్చి, "బయట చాలా చలి, గదిలోకి వచ్చెయ్యి" అన్నాడు. ఆ కంఠం ఆమె వినగోరిన కంఠం కాదు. ఆమె ఉలికిపడి లేచింది.

## 8

కుముదిని స్నానం చేసి, ఒంటికి గంధంనీరు పూసుకుని. తనకు సహనశక్తిని ప్రసాదించమని దేవుణ్ని ప్రార్థించి, మోతీతల్లి దగ్గరికి వెళ్ళి. తన కేదన్నా పని ఇయ్యమన్నది. ఇద్దరూ కలిసి కూరలు తరిగేచోటికి వెళ్ళారు. అక్కడ అనేకమంది స్త్రీలు పది, పన్నెండు కత్తిపీటలతో కూరలు తరిగి కుప్పలు వేస్తున్నారు.

కుముదినికూడా కూరలు తరుగుతూ, తన అన్న ఇచ్చిన టెలిగ్రాము అందిందనీ. అర్ధరాత్రివేళ తన భర్త తెచ్చిఇచ్చాడనీ మోతీతల్లితో అన్నది.

"ఉత్తరంకూడా ఇచ్చిఉంటారు. మీ అన్నయ్య రాసిన ఉత్తరం".

"లేదే! అన్నయ్య ఉత్తరం రాశాడా? నాకు తెచ్చియ్యవూ?" అన్నది కుముదిని.

"నావల్ల కాదు. అది బావగారి ఆఫీసుగదిలో టేబిలు సొరుగులో ఉన్నది. ఆ సొరుగు తీశానంటే కొంప లంటుకుంటాయి. దాన్ని నువే తీసి చదివి, మళ్ళా అక్కడే ఉంచెయ్యి."

"నా ఉత్తరం నేనే దొంగతనంగా చదవాలా?" అన్నది కుముదిని, అణచుకోలేని కోపంతో. సహనం సాధ్యం కాలేదు.

ఆమె లేచి డాబామీదికి వెళ్ళి ఒంటరిగా కూర్చుని మళ్ళీ భగవధ్యానంలో పడింది. తరవాత మోతీతల్లి వచ్చి ఆమెను ఫలహారానికి తీసుకుపోయింది.

ఫలహారం అయాక కుముదిని. "ఆగది ఎక్కడో చెప్పు, అన్నయ్య ఉత్తరం చదువుతాను." అన్నది.

"మరికొంచెంసేపాగు. నౌకర్లందరూ భోజనాలకు పోయాక వెళ్ళవచ్చు:" అన్నది మోతీతల్లి.

"దొంగచాటు నాకిష్టంలేదు. అందరూ చూస్తూండగానే వెళతాను"

మోతీతల్లిద్వారా తనభర్త ఆఫీసుగది ఎక్కడఉన్నదీ తెలుసుకుని అక్కడికి వెళ్ళింది. నౌకర్లు లేచి ఆమెకు నమస్కారం చేశారు.

కుముదిని సొరుగులోనుంచి ఉత్తరం తీసింది. కవరు చించి ఉన్నది. తాను పుట్టిపెరిగినచోట ఇటువంటి నీచమైన పని జరగటం. ఆమె ఎరగదు. కలతపడిన మనస్సును శాంతపరచుకోవటానికి ఆమె ఒకశ్లోకం చదువుకున్నది. రాణిగారు కళ్ళు మూసుకుని ఏదో మంత్రం చదువుతూ ఉండటం చూసి బయట నిలబడిఉన్న ఆర్డర్లీ ఆశ్చర్యపోయాడు...

ఆరోజు మధుసూదనుడు కుముకోసం ప్రత్యేకంగా ముస్తాబయాడు. ఎన్నడూలేనిది, తలకు సువాసననూనె రాశాడు, ఎసెన్సు పూసుకున్నాడు.

అతను కుముదినిని భోజనం అయాక రమ్మని కబురుచేద్దామనుకుంటుండగా శ్యామ వచ్చి. "నువు ఇక్కడ కూర్చున్నావు. నిన్ను వెతుక్కుంటూ తోడికోడలు నీ ఆఫీసుగదికి వెళ్ళింది," అన్నది.

మధుసూదనుడు ఆదరాబాదరా ఆఫీసుగదికి వచ్చేసరికి కుముదిని కనిపించింది.

"ఇక్కడి కెందుకు వచ్చావు?" అన్నా డతను.

"అన్నయ్య దగ్గిరనుంచి ఉత్తరం వచ్చిందేమో చూద్దామని," అన్నది కుముదిని.

"ఆ మాట నన్నెందుకు అడగలేదూ?" అని అడిగే శక్తిని అతను కిందటిరాత్రి పోగొట్టుకున్నాడు. అందుచేత, "దాన్ని నేనే తెచ్చి ఇద్దామనుకుంటున్నాను," అన్నాడు.

కుముదిని ప్రయత్నంమీద మనస్సును శాంతపరుచుకొని. "నేనీ ఉత్తరం చదవటం నీ కిష్టంలేదు. అందుచేత చదవను. చించేస్తున్నాను. కాని ఇకముందు నన్నిలా కష్టపెట్టవద్దు. నాకింతకు మించిన కష్టం మరేదీ ఉండదు." అంటూ ఉత్తరం చించేసి పైట చెంగు నోట కుక్కుకుని. గబగబా బయటికి వెళ్ళిపోయింది.

మధుసూదనుడు హతాశుడై పోయాడు. ఆ రోజు అతను ఆఫీసుకు చాలా ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాడు. అక్కడకూడా ఉండలేక, తలనొప్పి వంకపెట్టి, మామూలుకంటె చాలా ముందుగా ఇంటికి వచ్చేశాడు.

అతను గదిలో కూర్చుని నవీన్‌ను "ఉత్తరం మాట వదినెతో ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"నేనే చెప్పాను."

"ఉన్నట్టుండి అంత సాహసం నీ కెలా వచ్చింది?"

"వాళ్ళ అన్నయ్య దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చిందా అని వదిన అడిగితే డెస్కులో చూశాను"

"వదిన ఆత్రంగా ఉండటంచేతా—"

"నన్ను నిర్లక్ష్యపెట్టావు."

"ఆమెతో. నీ అధికారం ఇక్కడ చెల్లదని ఎలా చెప్పను? నీమాట నాకు లక్ష్యంలేదనేటంత పొగరు నాలో లేదు. ఆమె అంటే నాకు చాలా భక్తి."

"ఈ బుద్ధులన్నీ నీ కెవరు మప్పుతున్నారో నాకు తెలుసు. రేపు ఉదయమే నువు రైల్లో మన వూరికి వెళ్ళిపో."

"అలాగే."

నవీన్ శిక్షపడ్డవాడిలాగా కాక. సిద్ధపడ్డవాడిలాగ 'అలాగే' అనటం మధుసూదనుడికి నచ్చలేదు.

"నీకు రావలసిన జీతం పుచ్చుకుని వెళ్ళిపో. పై నెలనుంచీ నీ ఖర్చు ఒక్క దమ్మిడీకూడా నేను భరించను.

"ఆ సంగతి తెలుసు. నా పంతు భూమి దున్నుకుని బతుకుతాను."

నవీన్ తన అన్న ఇంకేమైనా అనటానికి అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు.

చిత్రమేమిటంటే, మధుసూదనుడికి నవీనుడిపైన ప్రత్యేకమైన ప్రేమ ఉన్నది. అతని సోదరులు మరి యిద్దరు తమ ఆస్తులు చూసు


Please Visit:

Head Office

**Ashok DRESSES**

Sultan Bazar

Branch Office

**Dress Centre**

Sultan Bazar

**HYDERABAD**

*Manufacturers of:*

QUALITY

FANCY

GARMENTS

**Manadal APPARELS**

STATION ROAD HYDERABAD-A.P.

Phone: 46047

*Stockists:*

WOOLLEN

HOSIERIES

HANDLOOM

&

BANIANS

Phone: 43077

Residence Phone: 35515



మహాప్రకృతి



హిమనగ ధీరులు

కుంటూ రజబ్‌పూర్‌లో ఉన్నారు: వాళ్ళ నత నెన్నడూ తలవడు. తండ్రి పోయాక నవీన్‌ను తెచ్చి తనవద్ద కలకత్తాలో ఉంచుకుని చదువు చెప్పించాడు, అదీకాక నవీన్ ఇంటియాజమాన్యంలో దక్షతగలవాడు. అతను ఒకేసారి అందరిపక్షానా ఉన్నట్టు కనబడుతూ తగాదాలు అవలీలగా పరిష్కరించేవాడు. మధుసూదనుడికి నవీనంటే ఇష్టం గనకనే మోతీతల్లి అంటే కోపం. ఆమెకుకూడా నవీన్‌పై అధికారం ఉండటం మధుసూదనుడు సహించలేకపోయేవాడు. ఆమె అతని మనస్సును విరుస్తున్నదని మధుసూదనుడికి అనుమానం.

కుముదిని ఉత్తరం చించిపారేసి వెళ్ళిపోయిన దృశ్యం అతనికి మరుపురాకుండా ఉన్నది. ఆమెపైన అధికారం ప్రయోగించే శక్తి అతని కిప్పుడు లేదు. తన కున్నదల్లా డబ్బు. అతను నగల వర్తకుణ్ణి పిలిపించి, మూడు ఉంగరాలు కొని, మూటినీ మూడు జేబులలో పెట్టుకుని పడకగదిలోకి వచ్చాడు. ఒకదానిలో కెంపూ, రెండోదానిలో పచ్చా, మూడోదానిలో వజ్రమూ ఉన్నాయి.

అతను వచ్చేసరికి కుముదిని తన బట్టలూ, వస్తువులూ పెట్టెలో సర్దుతున్నది.

"ఇదేమిటీ ? ప్రయాణమా ?'' అన్నా డతను.

"ఔను."

"ఎక్కడికి ?"

"రజబ్‌పూర్‌కు."

"అంటే ?"

"సొరుగు తెరచినందుకు మరదికి శిక్ష విధించావు, ఆ శిక్ష నాది."

ఆమెను వెళ్ళవద్దనటానికి అభిమానం వచ్చి, 'వెళ్ళ నీ. అక్కడ ఎన్నాళ్ళుంటుందో నేనూ చూస్తాను,' అనుకుంటూ మధుసూదనుడు గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

అతను నవీన్‌ను పిలిచి, "వదినకు మీరు పిచ్చెత్తించేస్తున్నారు," అన్నాడు.

"వదినకు పిచ్చెత్తించడానికి నువ్వొక్కడివి చాలు. ఇంకెవరూ అక్కర్లేదు. మే ముంటే ఆమెకు కొంచెం మనశ్శాంతి కలిగించి ఉందుము. అదికూడా నువు సహించలేకపోయావు."

"రజబ్‌పూర్ వెళ్ళుదామని ఆమెను మీరే రేపెట్టారు. ఇందువల్ల మీకు మేలుకలగదు, జ్ఞాపకం ఉంచుకో." అని మధుసూదనుడు గర్జించాడు.

"ఎవరితో చెబుతున్నా వీ మాటలు? చెప్పవలిసినచోట చెప్పు. ఆవిడ రజబ్‌పూరు రావాలని కలలోకూడా అనుకోలేదు."

"ఆవిడ మీవెంట వస్తానని పట్టుబట్టితే ఏం చేస్తారు ?"

"నీకు చెబుతాను. నీ పరివారాన్ని పంపి అడ్డు తగిలించు. తరవాత నీ శత్రువు లీ వార్త పత్రికలలో వేయిస్తే ఆమెను తప్పు పట్టరు."


Phones : 33268
32384

Grams : Amoluck

అన్ని రకముల పేపర్ మరియు స్టేషనరీకి

కుషాల్‌చంద్ ప్రైవేట్ లిమిటెడ్

- డిస్ట్రిబ్యూటర్లు:

★ సిరిపూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్

★ స్వాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

★ మూన్‌లైట్ పెన్సిల్ ఫ్యాక్టరీ

సింగాపీ భవన్

తిలక్ రోడ్, హైదరాబాదు.

"నోరు ముయ్! వదిన వెళతానంటే నే నాపను."

"ఆమెను మే మెలా పోషిస్తాం?"

"నీ భార్యా నగలు అమ్మి! పో ఇక్కణ్ణుంచి!"

మధుసూదనుడు కుముదిని వద్దకు వెళ్ళి, "నువు వెళ్ళడానికి వీల్లేదు," అన్నాడు.

"ఎంచేతా?"

"నా ఆజ్ఞ గనకా."

"అయితే వెళ్ళను. ఇంకేమిటి ఆజ్ఞ?"

"సామాను సర్దటం ఆపు."

"ఆపేశాను," అంటూ కుముదిని బయటికి వెళ్ళబోయింది.

"చూడు! ఇదుగో!"

"ఏమిటి? చెప్పు."

"నీకోసం ఉంగరం ఒకటి తెచ్చాను."

"నాకు కావలసిన ఉంగరం పెట్టుకోరాదన్నావు. నాకు మరొకటి అవసరం లేదు."

"చూడరాదా?" అంటూ అతను మూడు ఉంగరాలూ ఒకటొకటిగా తీసి, "ఇందులో నీ కేది ఇష్టమైతే అది పెట్టుకోవచ్చు," అన్నాడు.

"ఏది పెట్టుకోమని ఆజ్ఞ అయితే అది పెట్టుకుంటాను."

"మూడూ పెట్టుకుంటే బాగుంటుంది."

"ఆజ్ఞ అయితే మూడూ పెట్టుకుంటాను."

"నన్ను పెట్టనీ," అంటూ అతను ఆ ఉంగరాలను ఆమె వేళ్ళకు పెట్టాడు.

"ఇంకేమైనా ఆజ్ఞ ఉన్నదా?"

"నా మీద కోపం దేనికి, రాణీ?"

"కోపమేమీలేదు." అంటూ కుముదిని మళ్ళీ బయటికి వెళ్ళింది.

"ఎక్కడికి పోతున్నావు, ఇదిగో, విను," అన్నా డతను చిరాకుగా.

కుముదిని తిరిగి వచ్చి, "ఏమిటో చెప్పు," అన్నది.

చెప్పటాని కేమీ తోచలేదు. మధుసూదనుడు ముఖం ఎర్రగా చేసుకుని, "వెళ్ళు, నా ఉంగరాలు నా కిచ్చేసి వెళ్ళు," అన్నాడు.

కుముదిని ఉంగరాలు తీసి టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిపోయింది.

## 9

ఇంతకాలమూ సాఫీగా నడిచిన మధుసూదనుడి జీవితం ఇప్పుడు తారుమారయింది. రాత్రిఅయితే ఏం జరుగుతుందో అతను ఊహించలేకుండా ఉన్నాడు. అతను ఆఫీసునుంచి భయటపడుతూ ఇంటికివచ్చి, భోజనం చేశాడు. వెంటనే పడకగదికి వెళ్ళటానికి సాహసం లేక, తొమ్మిది కొట్టినదాకా వరండాలో పచార్లు చేశాడు. ఏమైనా సరే ఇవాళ తనమామూలు టైముకు నిద్రపోవాలనుకుని, గదిలోకి వచ్చి మంచంమీద పడుకున్నాడు. పడకగదిలో కుముదిని లేదు. అతనికి నిద్ర రాలేదు.

అర్ధరాత్రి అయింది. కుముదిని లాంతర్ల గదిలో ఉండదు—దానికి హమేషా తాళం వేసిఉంచాలని తానే ఉత్తరు విచ్చిఉన్నాడు. డాబా మీద ఎవరూ లేరు. మోతీతల్లి గదికి వెళ్ళాడు. లోపల ఇద్దరు స్త్రీలు మాట్లాడుకుంటున్నట్టు వినిపించింది. అంటే నవీన్ గదిలో లేడన్నమాట. తన ఆఫీసు గదికి వెళ్ళిచూస్తే, అక్కడ నవీనుడు పెద్దసోఫాపైన పడుకుని నిద్రపోతూ కనిపించాడు.

మధుసూదనుడు అతన్ని లేపి, "వెంటనే పడకగదికి రమ్మన్నానని చెప్పి వదినను పంపు," అన్నాడు.

కొంచెం సేపటికి కుముదిని పడకగదికి వచ్చి, సోఫామీద కూర్చున్నది. అతను నేలపైన ఆమె కాళ్ళవద్ద కూర్చుని, లేవబోతుంటే ఆమెను ఆపి "నువ్వు నన్ను క్షమించాలి, అపరాధం చేశాను" అన్నాడు.

తాను ఊహించని ఈ పరిణామం చూసి కుముదిని ఆశ్చర్యపోయింది.

"నవీన్‌నూ నీ తోడికోడళ్ళీ రజబ్‌పూర్ వెళ్ళవద్దని చెబుతాను. వాళ్ళు నీకు సేవచేస్తూ ఇక్కడే వుంటారు" అన్నా డతను. మళ్ళీ, అతను తన పౌరుషాన్ని దిగమింగి భార్య పౌరుషాన్ని పోగొట్ట నిశ్చయించాడు. ఇప్పుడే వస్తాను, వెళ్ళిపోవద్దని చెప్పి అతను మేడ దిగి కిందికి వెళ్ళాడు. అతను నవీనుణ్ణీ, మోతీతల్లినీ తీసుకువచ్చి, కుముదిని వింటూండగా వారితో "రేపు మిమ్మల్ని రజబ్‌పూర్ వెళ్ళమన్నాను, కాని అవసరం లేదు. రేపటినుంచీ మీరు కుముకు సేవచేస్తూ ఇక్కడే ఉండండి" అన్నాడు.


ఇదంతా చూసి వాళ్ళు నిశ్చేష్టు లయారు. ఈ నాటకమంతా ఏమిటంటే, మధుసూదనుడి భాషలో తాను కుముదినికి ఓడానని చెప్పటం!

కుముదినికి దిక్కు తోచలేదు. ఆమె తన భర్తను ప్రతిఘటించే వైనం అలవరుచుకున్నది గాని, అతని ఈ లొంగుబాటును ఎదుర్కొనటానికి బొత్తిగా అశక్తురాలైపోయింది. ఆమెను భర్తయొక్క ఆదరణనుంచి కాపాడే శక్తి ఏదీ కనిపించలేదు.

"చీర మార్చుకుని పడుకోవటానికి రావా, రాణీ?" అన్నాడు మధుసూదనుడు.

కుముదిని స్నానాలగదిలోకి వెళ్ళి, గోడచెంత ఉన్న ఒకకుర్చీ మీద కూర్చున్నది. ఆమెకు ఎక్కడన్నా దాక్కోవా లనిపిస్తున్నది.

పదిహేను నిమిషాలయింది, స్నానాలగది తలుపుకు చెవిపెట్టి వింటే లోపలినుంచి మధుసూదనుడికి ఏశబ్దమూ వినిపించలేదు. ముస్తాబు చేసుకుంటున్నది కాబోలనుకున్నాడు. అరగంట గడిచింది. "ఇంకా కాలేదా, రాణీ?" అని తలుపుదగ్గిర పిలిచాడు.



నిద్రలో నడుస్తున్న దానిలాగా కుముదిని బయటికి వచ్చింది. ఇంకా అమె చీర మార్చలేదు. ఏంచెయ్యాలో తెలియనిస్థితిలో ఉన్నట్టు కనబడింది. మధుసూదను డామెను సమీపించి. "పడుకోవటానికి రావా, రాణీ ?" అని అడిగాడు.

కుముదిని అతని కాళ్ళదగ్గిర కూర్చుని. ''నన్ను క్షమించండి." అన్నది.

''ఏం చేశావు. క్షమించటానికి ?'' అంటూ అత నామెను లేపి కుర్చీమీద కూర్చోబెట్టాడు.

''నా మన స్సింకా కుదటపడలేదు. కొంచెం వ్యవధి ఇయ్యి." అన్నది కుముదిని.

''వ్యవధి దేనికో నాకు తేలిసేటట్టు చెప్పు." అన్నాడతను. అతని మనస్సు కఠినమైపోతున్నది.

"చెప్పటం తేలికకాదు."

తనంత తాను సుముఖురాలు కాగలిగినదాకా అతను తనను తొందర చెయ్యకుండా ఉంటే అంతా సవ్యంగా సాగిపోతుందని ఆమె ఉద్దేశం.

"వ్యవధి ఇస్తే మీ అన్నయ్య సలహా తీసుకుని సంసారం మెదలుపెడతా నంటావు. అంతేనా ?"

విప్రదాసు అనుమతి లభించనందువల్ల ఆమె తనది కావడానికి జంకుతున్నదని అతని అనుమానం. "మీ అన్న ఆజ్ఞ లేనిదే నువు చీర మార్చవు. పడుకోవటానికిరావు. అంతే కాదూ?" అన్నాడతను మళ్ళీ.

కుముదిని పిడికిళ్ళు బిగబట్టి, కొయ్యబారిపోయినట్టు అయిపోయింది. ఆమె డాబామీదికి వెళ్ళబోతుంటే అతను. ''వెళ్ళకు." అన్నాడు.

''ఏం చెయ్యమంటావు ?" అన్న దామె ఆగి. వెనక్కు తిరిగి.

''వెళ్ళి. బట్ట మార్చుకురా. అయిదు నిమిషాలు టైమిచ్చాను."

కుముదిని స్నానాలగదికి వెళ్ళి, చీర మార్చుకుని, మందమైన తెల్లదుప్పటి నిలువునా కప్పుకుని వచ్చింది. ఆతని కంటికి అది కూడా ఏదో యుద్ధవేషంలాగా కనబడింది.

"ఏం చేద్దా మనుకుంటున్నావు ?" అని అత నడిగాడు.

"ఏం చెయ్యమంటే అది చేస్తాను."

తనకూ ఆమెకూ మధ్య ఉన్న అగాధం ఆతనికి తెలిసివచ్చింది. దాన్ని దాటేశక్తి అతనికి లేదు. అతని జీవనయంత్రంలో ఉండే చక్రాలన్నీ నిలిచిపోయాయి. కొపంతో పిచ్చికేకలు వెయ్యవచ్చు. కాని అందువల్ల ప్రయోజనం ఉండదు. కాలమే ఆగిపోయినట్టుంది. రేపు అతనికి అతి ముఖ్యమైన పని బోలెడున్నది. కాని ఇప్పుడతనికి అదంతా అవాస్తవంగా కనబడుతున్నది. అన్నిటినీ మించిన వాస్తవం ఈ దుప్పటి కప్పుకుని నిలబడిన ఆడది; ఆమెను అర్థం చేసుకోవటమే అన్నిటినీ మించిన కఠినసమస్య.

మధుసూదనుడు పెద్ద నిట్టూర్పు విడిచి, కుముదినిని సమీపించి. అతి కష్టంతో మాట్లాడుతూ, "నీకు తగిన యోగ్యత నాలో లేదు. నామీద దయ ఉంచవా?" అన్నాడు.

కుముదిని, "ఛీ. ఛీ. అలా అనరాదు." అంటూ చతికిలబడి అతని పాదధూళి తీసుకుని, "నీ దాసిని. నన్ను ఆజ్ఞాపించాలి," అన్నది.

మధుసూదను డామెను లేవనెత్తి తన గుండెకేసి అదిమి పట్టుకుని. "నిన్నాజ్ఞాపించను. నీఅంతట నువే నా దగ్గిరికిరా." అని ఆమెను వదిలేశాడు.

కుముదిని తలవంచుకుని. "నీ ఆజ్ఞలు పాలించటం తేలిక. నా అంతట నేను ఏదీ చెయ్యలేను." అన్నది.

"అయితే ముందా దుప్పటి తీసెయ్యి. దాన్ని సహించటం కష్టంగా ఉంది."

కుముదిని దుప్పటి తీసెయ్యగానే దాని అడుగున ఆమె ధరించిన చీర కనిపించింది. అది ఆమెకు పుట్టింటివారిచ్చిన చీర. అంత కంటె విలువయిన చీరలు బోలెడు, బీరువాల నిండా ఉన్నాయి. కాని ఆమె కక్కర్లేదు. తాను ఖరీదయిన ఉంగరాలు మూడు కొంటే అందులో ఒక్కటీ ఆమె కక్కర్లేదు. పనికిమాలిన సీలపు టుంగరమే. తన అన్నగారిచ్చినదే కావాలి! ఆమెకు తమవైపు వాళ్ళపైనగల ప్రేమకూ, తనపైన ఉన్న ప్రేమకూ వ్యత్యాసం కొట్టవచ్చినట్టు కనబడుతున్నది. ఆమెకు అపురూపమైన సౌంద ర్యంతోబాటు, ఐశ్వర్యాన్ని అవమానపరచే శక్తికూడా ఉన్నది! ఆమెను మధుసూదనుడు ఏం చూపి ఆకర్షించగలడు.

"వెళ్ళు. వెళ్ళి పడుకో" అన్నాడతను.

కుముదిని అనుమానిస్తూ వెళ్ళి మంచంమీద కూర్చున్నది. మధుసూదనుడు సోఫామీద కూర్చుని, "నువు రమ్మంటే తప్ప రాను. ఎన్ని సంవత్సరాలయినా ఇక్కడే వుంటాను" అన్నాడు.

కుముదినికి తల తిరిగిపోతున్నది. ఆమెను ఎవరో తీవ్రంగా పరీక్షిస్తున్నారు! కాలం బరువెక్కి కదలలేకుండా పోయింది. ఈ రాత్రి గడవటం అసంభవం.

తన శక్తులన్నీ కూడగట్టుకుని మంచం దిగివచ్చి, "నన్ను చెడ్డదాన్ని చెయ్యకు" అన్నది.

"ఏం కావాలి? ఏం చెయ్యమంటావో చెప్పు!" అన్నాడు మధుసూదనుడు గంభీరంగా.

"పడుకోవటానికి రా."

కాని ఇది అతనికి విజయమేనా?

## 10

మర్నాడు ఉదయం మోతీతల్లి కుముదినికోసం పాలు తీసుకుని వెతుక్కుంటూ వచ్చేసరికి, ఆమె ఎప్పటిలాగా డాబామీద ధ్యానం చేస్తూ ఉండటానికి బదులుగా, జేగురించిన కళ్ళతోనూ, పాలి పోయిన ముఖంతోనూ, నీరసంగా మెట్లపక్కన గోడకు చేరగిల బడి కూర్చుని ఉన్నది. ఆమె స్నానం చెయ్యలేదు; పూజచెయ్యలేదు. దేవుడిపైన అలిగినట్టు కనబడింది. దేవుడామెను బానిసల సంతలో మాంసం ధరకు అమ్మేశాడు!

మోతీతల్లి పాలివ్వబోతే కుముదినివద్దని, ఆమె ప్రేరణతో స్నానం చేసి మళ్ళీ ఆచోటనే కూర్చున్నది. ఆమెకు అన్నవద్దనుంచి ఉత్తర మేదైనా వచ్చిందేమోనని మోతీతల్లి ఉదయమే బావగారిగదికి వెళ్ళింది. కాని సొరుగుకు తాళం వేసిఉన్నది.

శ్యామ కుముదిని ఉన్నచోటికి వచ్చి, "అలా ఉన్నావేం? ఒంట్లో బాగాలేదా? పుట్టింటి బెంగకాబోలు. పాపం. మీ అన్నయ్యగారు వస్తున్నారుగా!" అన్నది.

With Compliments from

LIBERTY PHARMA INDUSTRIES
200, BEGUMPET,
HYDERABAD.

విప్రదాసు గుమాస్తా ఒకడు వచ్చి, డాక్టరుచేత పరీక్షచేయించుకోవటానికి వస్తున్నాడనీ, కలకత్తాలో రెండుమూడు రోజు లుంటాడనీ చెప్పినట్టు పనిమనిషిద్వారా శ్యామకు తెలిసింది. మధుసూదనుడు ఈ విషయం కుముదినికి చెప్పలేదని శ్యామ గ్రహించింది.

శ్యామకు వంటసామాగ్రి ఇయ్యటానికి మోతీతల్లి వెళ్ళుతుంటే, కుముదిని గోపాలుణ్ణి తనదగ్గిరికి పంపమని అడిగింది.

హాబ్లూ వచ్చి సంకోచిస్తూ నిలబడ్డాడు. కుముదిని వాణ్ణి ఎత్తుకుని, "రెండురోజులుగా రావటంలేదేం?" అని అడిగింది.

"నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో — నా జేబులో ఉంది," అన్నాడు కుర్రాడు. వాడు జేబులోనుంచి ఒక బ్రౌను కాగితం పొట్లం తీసి. "ఇప్పుడు చూడకు," అన్నాడు.

కుముదిని వాడు చెప్పే కట్టుకథలన్నీ విని వాడితో సమంగా కబుర్లు చెప్పుతూండగా మధుసూదనుడు వేళగాని వేళ వచ్చాడు. అతన్ని చూడగానే హాబ్లూ ముఖం వాడిపోయింది. వాడు లేచి వెళ్ళిపోబోతే కుముదిని రోదించింది.

"వెళ్ళి చదువుకోక, ఎంచేస్తున్నా విక్కడ?" అని మధుసూదనుడు గద్దించేసరికి, మాస్టరు వచ్చేవేళ ఇంకా కాలేదనయినా చెప్పకుండా హాబ్లూ తల వంచుకుని, మెల్లిగా వెళ్ళిపోయాడు.

కుముదిని వాణ్ణి వెనక్కు పిలిచి. ఈ పూలు తీసుకోవూ?" అని అడిగింది.

మధుసూదనుడు వాణ్ణి పొమ్మని, కుముదినితో, వాడుపూలు ఏం చేసుకుంటాడు?" అన్నాడు. అతనికి ఆమె చేతిలో కాగితం పొట్లం కనిపించింది. అందులో ఏమున్న దని ఆత నడిగితే, ఆమె తనకు తెలియ దన్నది.

"నా కియ్యి, నేను విప్పి చూస్తాను."

"నువు చూడకూడదు. అందులో రహస్యం ఉన్నది." అన్నది కుముదిని.

ఆతను ఆగ్రహంతో, "ఏం సాహసం!" అంటూ చప్పున పొట్లం లాగేసుకుని విప్పి చూసేసరికి, అందులో నాలుగు పనస అప్పాలు తప్ప ఇంకేమీ లేవు. అవి చాలా చవుక తినుబండారాలు. హాబ్లూకు అవి చాలా ఇష్టం. అందుకని అవి నాలుగు పొట్లం కట్టి దొడ్డమ్మకు కానుకగా తెచ్చి ఇచ్చాడు.

వాటిలో రహస్య మేమిటో మధుసూదనుడికి అర్థం కాలేదు. కుముదినికి పుట్టింట ఇలాటి ఫలహారాలు అలవాటే మో ననుకున్నాడు. అందుకే రహస్యంగా తెప్పించుకుని ఉంటుం దనుకుంటూ అతను కిందికి వెళ్ళాడు.

హాబ్లూ ఇచ్చిన అప్పాలను కుముదిని సొరుగులో ఉన్న చందనంపెట్టెలో ఉంచేసింది. తరవాత ఆమె తన అన్నకు ఉత్తరం రాసుకుంటూండగా మధుసూదనుడొక గిల్టుగిన్నెమీద సిల్కు


THE FOLLOWING COMPETITIVE RATES OF INTEREST ARE NOW OFFERED

**ON FIXED DEPOSITS FOR:**

| | | |
|---|---|---|
| 91 Days and over but less than 6 months | ... | 5-1/8% P.A. |
| 6 Months and over but less than 1 year | ... | 5-5/8% ,, |
| 1 Year and over but less than 2 years | ... | 6-1/8% ,, |
| 2 Years and over but less than 3 years | ... | 6-3/8% ,, |
| 3 Years and over but less than 5 years | ... | 6-5/8% ,, |
| 5 Years and over but less than 7 years | ... | 7-1/8% ,, |
| 7 Years and over but less than 9 years | ... | 7-3/8% ,, |
| 9 Years and over. | ... | 7-5/8% ,, |
| ON SAVINGS BANK DEPOSITS. | ... | 4% ,, |

ALL KINDS OF BANKING BUSINESS INCLUDING
FOREIGN EXCHANGE TRANSACTED.

**A net work of 100 Branches throughout the States of Andhra Pradesh, Madras, Mysore, Maharashtra, Orissa, and West Bengal.**

For further particulars, please contact our branch nearest to you.

THE ANDHRA BANK LTD.

(REGD. OFFICE: MACHILIPATNAM)
CENTRAL OFFICE: HYDERABAD.

రుమాలు కప్పితెచ్చి బల్లమీద పెట్టి, "చూడు, ఇందులో ఏమున్నాయో!" అన్నాడు.

కుముదిని రుమాలు తీసిచూస్తే గిన్నెనిండా పనస అప్పాలున్నాయి! కుముదిని ఒంటరిగా ఉన్నట్టయితే విరగబడి నవ్వి ఉండును. ఇప్పు డామెకు నవ్వుకూడా రాలేదు.

"అప్పాలు దొంగతనంగా తినవలిసిన అవసర మేమిటి? సిగ్గెందుకు? నాతో చెబితే, రోజూ కావలసినన్ని తెప్పిద్దునే!" అన్నాడు మధుసూదనుడు.

"నీకు సాధ్యం కాదు," అన్నది కుముదిని.

"సాధ్యం కాదా? వింతగా చెబుతున్నావే! అని అంత విలవైనవా? మీ అన్నయ్య పార్సెల్ పంపాడా ఏం?"

ఆ మాటకు జవాబు చెప్పబుద్ధిపుట్టక, కుముదిని అప్పాలగిన్నెను అవతలికి నెట్టి, లేవపోయింది. కాని మధుసూదను డామెను బలవంతాన కూర్చోబెట్టాడు. అత నేదైనా అడిగేలోపునే ఆమె, "అన్నయ్య దగ్గిరనుంచి మనిషి ఎవరైనా వచ్చాడా?" అని అడిగింది.

"ఆమాట చెబుదామనే వచ్చాను," అన్నా డతను, బొంకుతూ.

"అన్నయ్య ఎప్పుడు వస్తాడు?"

"ఏడెనిమిది రోజుల్లో;" విప్రదాసు మర్నాడే వస్తున్నాడని అతనికి తెలుసు.

"అన్నయ్య దగ్గిరనుంచి ఉత్తర మేమీ రాలేదా?"

"ఉత్తరాల పెట్టె ఇంకా చూడలేదు. చూసి, ఉంటే నీకు పంపిస్తా."

ఆరోజు మధ్యాన్నం భోజనంచేసి పడకగదికి వచ్చి, మధుసూదనుడు కుముదినిని పిలిపించి, ఆమెకొక ఉత్తరం ఇచ్చాడు.

విప్రదాసు రాసిన ఉత్తరం; తాను వైద్యంకోసం కలకత్తా వస్తున్నాననీ, కుముదినిని చూస్తాననీ; అప్పుడప్పుడూ ఆమె తన క్షేమ సమాచారాలు తెలపాలనీ అందులో ఉన్నది.

కుముదిని, తనను అన్న పరాయిదానిలాగా చూస్తున్నాడని చిన్నబుచ్చుకుని, తన సంకుచితత్వానికి తిరిగి నొచ్చుకున్నది. ఆమె వెళ్ళిపోబోతోంటే మధుసూదనుడు ఆపి, కూర్చోమని, "పనస అప్పాలనుగురించి అంత గొడవ చేశా వెందుకు?" అని అడిగాడు.

"అది రహస్యం," అన్నది కుముదిని.

"నాతోకూడా చెప్పకూడదా?"

"చెప్పకూడదు."

"ఇవే నూర్‌నగర్ వేషాలు! మీ అన్న తర్ఫీదు. ఈ వేషాలు వదలగొట్టకపోతే నా పేరు మధుసూదన్ కాదు!" అన్నా డతను జీరపోయిన గొంతుతో.

"నీ అజ్ఞ ఏమిటో చెప్పరాదా?"

"ఆ పొట్లం నీ కెవరిచ్చారు?"

"హాబ్లూ."

"అయితే అంత దాపుదెందుకు? దాన్ని మరెవరైనా వాడిద్వారా పంపారా?"

"లేదు."

"అయితే దాని కింత దొంగతనం దేనికో?"

"నీ కర్థంకాదు."

మధుసూదను డామెచెయ్యి పట్టుకుని గుంజుతూ, "ప్రతిదానికీ పేచీపెడతావేం?" అన్నాడు.

కుముదిని ముఖం జేవురించింది.

"నీ కేం కావాలో చెప్పు. మీపద్ధతులకు నే నింకా అలవాటు పడనిమాట నిజమే."

ఆమెను తన్నాలన్నంత కోపంవచ్చింది. మధుసూదనుడికి. కాని ఆక్షణంలోనే. ఆఫీసు దొరగారు అతనికోసం చూస్తున్నట్టు కబురు వచ్చింది.

మధుసూదనుడు వెళ్ళాక కుముదిని మోతీతల్లి దగ్గిరికి బయలుదేరింది. దారిలో శ్యామ ఎదురై "అబ్బాయి మనసు బాగున్నటు లేదు. మీ యిద్దరిమధ్యా ఏదయినా అడ్డుపుల్ల తగిలిందేమో నని భయంగావుంది. అతని విషయంలో ఎలా ప్రవర్తించాలో నీకు తెలీకపోతే మమ్మల్నడిగితే చెబుతాం, మరచిపోకు. చిన్న తోడికోడలిదగ్గిరికి పోతున్నట్టున్నావు; వెళ్ళు, మనసు విప్పి మాట్లాడుకో వచ్చు" అన్నది.

మధుసూదనుడూ, శ్యామా – ఇద్దరిప్రవర్తనకూ పోలికలేదు. అయినా ఆ ఇద్దరూ ఒక్కమట్టితో తయారైనవాళ్ళేనని కుముదినికి ఆకస్మికంగా తట్టింది. శ్యామ తనపట్ల ఎంత స్నేహంగా ఉంటే ఆమెకంత దూరంగా ఉండాలనిపిస్తుంది కుముదినికి.

ఆమె మోతీతల్లి గదిలోకి వెళ్ళేటప్పటికి నవీనుడూ, భార్యా చిన్న తగాదా పడుతున్నారు. మోతీతల్లి నవీనుడు చదివే పుస్తకం దాచేసింది. ఆమె తాళపుచెవులు అతను దాచేశాడు. ఇద్దరూ ఒకరి నొకరు సాధించుకుంటూ కుముదినిని తీర్పుచెప్పమన్నారు. వాళ్ళ కీచులాట చూసి కుముదిని నవ్వేసింది. ఆ ఇంట ఆమె నవ్వటం అదే మొదటిసారి. ఆ నవ్వు చూసి నవీనుడు చాలా ఆనందించాడు.

కుముదిని తాను వచ్చినపని చెబుతూ, "అన్నయ్య వస్తున్నాడట. ఆయనను ఎలా చూడటం?" అని నవీను నడిగింది.

"బావగారి నడిగి చూడకూడదా?" అన్నది మోతీతల్లి

కుముదిని ముఖాన బాధ కనిపించింది. మధుసూదనుడు తన ఎదట కుముదిని తన అన్నపే రెత్తటానికే సంకోచించేలా చేశాడు.

"అన్నయ్యతో చెప్పక్కర్లేదులే, వదినా. అంతా మేం చూస్తాం లే." అన్నాడు నవీనుడు.

కుముదిని వెళ్ళాక మోతీతల్లి నవీనుడితో, "ఏం ఉపాయం ఆలోచించావు?" అన్నది



"ఏదో యుక్తి పన్ని అన్నయ్యను మోసగించాలి." అన్నాడు నవీనుడు.

# 11

మధుసూదనుడు వ్యాపారరీత్యా ఏం చేసినా డైరెక్టర్లు అతని పైన గల విశ్వాసంతో ఆమోదిస్తూఉండేవాళ్ళు. అటువంటివాడికి మొట్టమొదటిసారిగా ఈరోజు ప్రతిఘటన కలిగింది. డైరెక్టర్లు ఒప్పుకుంటారనే దృఢనమ్మకంతో అతను ఒక నీలిమందు కార్ఖానాతోబాటు అది ఉన్న గ్రామంకూడా కొననిశ్చయించి, బేరంకూడా జరిపి, డబ్బుకూడా చాలాభాగం చెల్లించాడు. రిజిస్టరు చేసేటప్పుడు మిగతాది చెల్లించాలి. కార్ఖానాలో పని చెయ్యవలిసినవాళ్ళు కూడా నిర్ణయమయారు. అయితే కాషియరు పని ఒకటి ఖాళీగా ఉంది. అది తన బంధువు కియ్యమని కంపెనీ పెద్దలలో ఒకడు కోరాడు. శిఫార్సు చెయ్యబడ్డ మనిషి అయోగ్యుడని తెలిసి మధుసూదను డా శిఫార్సును తోసిపుచ్చాడు.

ఈ స్వల్పకారణంనుంచి ప్రతిఘటన పుట్టుకొచ్చి, మహా వృక్షమై కూర్చున్నది. ఇందుకు దోహదం చేసిన అంశం ఒకటి లేకపోలేదు. గ్రామం అమ్ముతున్నవాడు మధుసూదనుడికి దూరపు బంధువు. అతని తరఫున ఒకామె వచ్చి ఆ ఎస్టేటు కొనమని కాళ్ళా, గడ్డమూ పట్టుకుని బతిమాలింది. ఎస్టేటు చౌకగా వస్తున్నదనీ, బంధువులకు సహాయం చేశాడన్న కీర్తి దక్కుతుందనీకూడా ఆలోచించి కొనటానికి నిశ్చయించాడు. ఇంకేముందీ? కాషియరు పనికి తన బంధువును శిఫార్సుచేసిన పెద్దమనిషి పదిమందిలోనూ పెద్దపుకారు వదిలాడు. మధుసూదనుడు కంపెనీ ధనంతో బంధువులకు సహాయం చేస్తున్నాడు, చాటుగా కమిషనులు పుచ్చుకుంటున్నాడు. క్రయవిక్రయా లన్నిటిలోనూ అతనికి కమిషను ముట్టుతున్నది.

ఇలాటి పుకార్లు చెవిని పడ్డప్పుడు ప్రజలు సాక్ష్యం కోరరు. నిజాయితీ గలవాడని పేరుపడ్డవాడిపైన చాలామందికి సహజంగానే శత్రుత్వం ఉంటుంది. అటువంటి వానిపైన వచ్చే అపనిందలను వాళ్ళు తేలికగా నమ్ముతారు... డైరెక్టర్లు ఈ క్రయాన్ని ఆమోదించలేదు.

కొంటానన్న మాట నిలబెట్టుకోవటానికీ, కంపెనీవాళ్ళు తాము పొరబడ్డట్టు తెలుసుకోగలందులకూ మధుసూదనుడు ఆ ఎస్టేటును తానే సొంతాన కొనటానికి నిశ్చయించాడు.

కాని మొట్టమొదటిసారిగా ఎదురుదెబ్బ తినటంవల్ల అతని మనస్సు కలతచెందింది. ఇంతకాలమూ తనవెంట ఉన్న అదృష్ట దేవత తనను విడనాడిపోయి, తనభాగ్యం తారుమారవుతుందేమోనని శంకిస్తూ అతను ఇంటికి వచ్చి, వాలుకుర్చీలో పడుకుని, గుడుగుడు పీల్చసాగాడు.

నవీనుడు వచ్చి విప్రదాసుగారింటినుంచి మనిషి చూడవచ్చాడని చెప్పాడు.

"పొమ్మను. నాకు తీరికలేదు," అని మధుసూదనుడు చీదరించుకున్నాడు.

నవీనుడు బయటకు వెళ్ళి మళ్ళా వచ్చి, "రేపు ఉదయం నాకు రెండు గంటలసేపు సెలవు కావా లన్నయ్యా." అన్నాడు.

"ఎందుకూ?"

"కుంభకోణంనుంచి జ్యోతిష్కుడు వచ్చాడు; వెళ్ళి చూడాలి."

"అట్లాంటివి నమ్ముతావా?"

"మామూలుగా నమ్మనుగాని, భయం వేసినప్పుడు నమ్ముతాను. ఆ జ్యోతిష్కుడి దగ్గిర భృగునాడి ఉన్నదిట. అందులో పుట్టినవాళ్ళవీ, పుట్టబోయేవాళ్ళవీ అందరి జాతకాలూ ఉన్నాయిట. ఒకసారి వెళ్ళి చూస్తే నిజమో కాదో తేలేపోతుంది."

"మోసం చేసి పొట్టపోసుకునేవాళ్ళకోసం నీవంటి మూర్ఖులను దేవుడు సృష్టించిఉంచాడు."

"భృగునాడిమీద నీ తెలివి ప్రయోగించి చూడరాదా?"

"సరే, రేపు ఉదయం నన్నక్కడికి తీసుకువెళ్ళు." అన్నాడు మధుసూదనుడు. నిజాని కతను జ్యోతిష్కుల సహాయం కావలిసిన స్థితిలోనే ఉన్నాడు.

మర్నాడు పొద్దున ఏడు కొట్టకముందే అన్నదమ్ము లిద్దరూ బండి ఎక్కి. ఇ౨కు సందులకుండా వెంకటశాస్త్రి ఉంటున్న గదికి వెళ్లారు. "శాస్త్రీజీ"ని చూస్తే మధుసూదనుడి కేమాత్రమూ గురి కుదరలేదు. నవీనుడు తన అన్న జాతకం చూపించబోతే, శాస్త్రి చూడక, మధుసూదనుడి చెయ్యి చూశాడు; కాగితంమీద తానే ఒక చక్రం వేశాడు. మధుసూదనుడి ముఖంకేసి చూసి. "పంచమవర్గం-పంచమ వర్ణం-పంచాక్షరం." అన్నాడు.

ఈ మాటలకు నవీన్ ఉలిక్కిపడి, "అర్థమయిందా, అన్నయ్యా?" అన్నాడు.

మధుసూదనుడి కేమీ అర్థం కాలేదు. నవీనుడు వివరించాడు. కచటతప వర్గాలలో పవర్గం అయిదోది; పఫబభమలలో మ అయిదోది. మ-ధు-సూ-ద-న అనేది అయిదక్షరాల మాట. జన్మతార ప్రభావంచేత మూడు అయిదులు ఒకచోట ఒనగూడాయి!

మధుసూదనుడు నిర్ఘాంత పోయాడు. తా నింకా ఎన్ని వేల సంవత్సరాలకో పుట్టుతాడనగా భృగు మహాముని తనకు నామకరణం చేసేశాడా? ఎంత అద్భుతం!

శాస్త్రి అర్థమయీ కాని సంస్కృతంలో మధుసూదనుడి జాతకం చదువుకుపోవుతున్నాడు. వింటున్న కొద్దీ మధుసూదనుడికి గురి మరింత బాగా కుదురుతున్నది. అంతా చదివి చివరకు శాస్త్రి ఇలా తేల్చాడు: మధుసూదనుడి కొత్త భార్యను లక్ష్మి ఆశ్రయించిఉన్నది; ఆమె కేమాత్రం మానసికవేదన కలిగినా దేవి ఆగ్రహిస్తుంది! ఇప్పటికే ఆగ్రహలక్షణాలు కనిపిస్తున్నాయి; మధుసూదనుడు జాగ్రత్త పడకపోతే ప్రమాదం జరగవచ్చు.

మధుసూదనుడీ జోస్యం విని కొయ్యబారిపోయాడు. పెళ్ళినాడే తనకు లాభం వచ్చిన సంగతీ, సరికొత్తగా తనకు జరిగిన అపజయమూ తలుచుకుంటే అతనికి జోస్యం అక్షరాలా నిజమనిపించింది.

అన్నదమ్ములు బండిలో తిరిగివచ్చేటప్పుడు నవీనుడు ఇలాటి జోస్యాలలో మోసం ఉంటుందనీ, వాటిని నమ్మరాదనీ అని చూశాడు. కాని మధుసూదనుడు అతనితో ఏమాత్రమూ ఏకీభవించలేదు. అన్నను మోసం చేస్తున్నందుకు నవీనుడు చాలా నొచ్చుకున్నాడు. అతని మోసం మధుసూదనుడిపైన బాగా పారింది.

ఇన్నాళ్ళూ మధుసూదనుడిలో అతని అహంకారానికీ, కుముదిని పైగల కాంక్షకూ పోరాటం సాగింది. ఆమెకు తాను లొంగిపోవాలని గ్రహాలే ఇప్పు డాదేశించాయి గనుక ఆ పోరాటం అంతమయింది. అహంకారం అణగారిపోయింది. అతను వెళ్ళి కుముదిని కాళ్ళా, వేళ్ళా పడి క్షమాపణ కోరటమే తరువాయి. అందు కా రోజు అతనికి వవ్యధి చిక్కలేదు. ఆఫీసులో తరగని పని వుండిపోయింది.

ఆ రోజల్లా కుముదిని భరించరాని ఆవేదనలతో బాధపడింది: మర్నాడు అన్నయ్య వస్తున్నాడు. ఆయనకు ఒంట్లో బాగాలేదు.


అందరికీ దీపావళి శుభాకాంక్షలు

★ ఆంధ్ర రాజధానిలో

★ ఆంధ్ర ప్రజల ఆదరంతో

★ ప్రఖ్యాతిగాంచిన

రవీంద్ర హోటల్

బోర్డింగ్ అండ్ లాడ్జింగ్

అబిద్ రోడ్ — హైదరాబాద్

మాంసాహార శాఖాహార భోజనమునకు, చక్కటి విశ్రాంతికి, అన్ని ఆఫీసులకు

వ్యాపార సంస్థలకు అందుబాటులో వున్నది

మర్యాదకు మన్ననలకు ప్రసిద్ధిగాంచిన హోటల్

ఎలాగైనా ఆయనను చూడాలి. నవీన్‌కూడా కనిపించలేదు. ఎటో వెళ్ళివుండాలి. జీవితమనే పాము తనను కబళించి తన పేగులలో పెట్టి నొక్కి జీర్ణించుకున్నట్లు తోచిం దామెకు. దేవుడు తనను పూర్తిగా విడనాడా డనుకున్న దామె.

డాబామీద కూర్చోనటానికి వీల్లేదు. శీతాకాలపు జల్లులు పడుతున్నాయి. కుముదిని తన గదిలోకి వెళ్ళి, చప్పున సొరుగులో నుంచి దేవుడి పటం తీసి దాన్ని పగలగొట్టుదా మనుకుంది. కాని దాన్ని చూడగానే గట్టిగా గుండెకు అదుముకోబుద్ధి పుట్టింది, ఆమె ఏడవసాగింది

ముసలి నౌకరు మురళి పడకగదిలోకి వచ్చి, చలికి వణికే చేతులతో పక్కలు వెయ్యసాగాడు వాడు. చిరుగులు పట్టిన మురికి దుప్పటి కప్పుకుని ఉన్నాడు. కొత్తగా మలేరియాపడి లేచాడు.

"చలివేస్తున్నదా, మురళీ?" అన్నదామె.

"ఔనమ్మా; వర్షం, చలి!" అన్నాడు ముసలాడు.

"నీకు కంబలి లేదా?"

"బిరుదు వచ్చిననాడు మహారాజుగారిచ్చారు. మనమడికి దగ్గు జ్వరం. వాణి ఎప్పుడూ కంబళి కప్పిఉంచా లన్నాడు డాక్టరు."

కుముదిని పక్కగదిలో నుంచి ఒక పాత శాలువ తెచ్చి మురళి కివ్వబోయింది. మురళి దణ్ణంపెట్టి, "మన్నించండమ్మా. మహారాజుగారు కోప్పడతారు," అన్నాడు. తాను దర్వాన్ గదిలో ఉంటున్నాననీ, అక్కడ కుంపటి ఉందనీ, వెచ్చగా ఉంటుందనీ మురళి చెప్పాడు.

నవీన్ వచ్చిఉంటే తనవద్దకు పంపించమని కుముదిని మురళితో చెప్పింది. నవీన్ వచ్చాడు. కుముదిని తన చేతి బంగారు గాజులు తీసి నవీన్ కిస్తూ, "వీటిని అమ్మి అన్నయ్యకోసం స్వస్తివచనం చెప్పిస్తావా?" అన్నది.

"నీకు అతనిపైన ఉన్న భక్తినిమించి స్వస్తివచన మేముంటుంది?" అన్నాడు నవీనుడు.

"భగవంతుడి పూజతప్ప అన్నయ్యకు నే నింకేమీ చెయ్యలేను."

"అందుకు నీ సేవకులం మేమంతా లేమా?"

దేవుణ్ణిగురించి నవీనుడు నిర్లక్ష్యంగా మాట్లాడినందుకు కుముదిని ఆగ్రహించలేదు. తన అన్నకూడా భగవంతు డంటే లక్ష్యం లేనివాడే.

చీకటిపడింది. మెట్లమీద మధుసూదనుడి కాలిజోళ్ళ చప్పుడు వినిపించింది. కాని నవీనుడు రోజూలాగ పారిపోలేదు. కుముదిని మనస్సుమాత్రం చటుక్కున ముడుచుకుపోయి, అందులో తిరుగుబాటు తల ఎత్తింది.

"నా మనస్సుస్వాధీనంలోకి రాకుండాఉంది. ఉపదేశం చెయ్యగల గురువు నెవరినైనా చూస్తావా?" అని ఆమె నవీను నడిగింది.


**Look into your HEART—**

What you wish is SECURITY
SECURITY for yourself, your family,
Your property ...
NEW INDIA offers
All these and much more.

*For all your General Insurance Needs*

**THE NEW INDIA ASSURANCE CO., LIMITED**

***Divisional Office:***
**Nizam Shahi Road,**
**Hyderabad-1 (Tel: 43545)**

***Head Office:***
**New India Assurance Building,**
**Mahatma Gandhi Road,**
**Fort, Bombay-1**

**A. D. SHROFF** *Chairman*
**J. R. D. TATA** *Vice-Chairman*
**B. K. SHAH** *Managing Director*

"భయపడకు, వదినా. మీ అన్నయ్యే నీకు ఉపదేశం చేస్తాడు," అన్నాడు నవీనుడు.

మధుసూదనుడు రాగానే నవీన్ లేచి, కుముదిని పాదధూళి తీసుకుని, "గురువుమాట కనుక్కొని చెబుతాను, వదినా.'' అని బయటికి వెళ్ళిపోయాడు.

మధుసూదనుడు కుముదినిని చూస్తూనే, "నువు మా ఇంటికి వెలుగు తీసుకొచ్చావు.' అందా మనుకుంటూ, వచ్చాడు. నవీన్ కనిపించటమూ, గురువు అనేమాట వినిపించటముతో తాను అనదలచుకున్న మాట ఇగిరిపోయింది. కుముదినిలో భయసంకోచాలు కనిపించాయి. ఇవాళ అతనిచూపు సూక్ష్మమయింది; ఇంతకుముందు తన భార్యతో అత నిలాటి భావా లేవీ గమనించిఎరగడు.

''బయటికి పోతున్నావా బడాబౌ ?" అని అత నడిగాడు.

అతని మాటలూ, కంఠమూ కుముదినికి కొత్తగా ఉన్నాయి. వెళ్ళటం లేదన్న దామె.

"నీ కోసం తెచ్చాను, చూడు," అంటూ అత నామె చేతిలో బంగారు భరిణ ఒకటి పెట్టాడు. మూత తీసి చూస్తే, తన అన్న ఇచ్చిన నీలంఉంగరం ఉన్నది. ఆమె హృదయం దబదబా కొట్టుకున్నది. ఆమె అనుమతితో మాధుసూదనుడు స్వయంగా ఆ ఉంగరాన్ని ఆమె వేలికి పెట్టి, చెయ్యి ముద్దుపెట్టుకుని, "నీ ఉంగరం తీసుకోవటం పొరపాటే ; నీ చేతికి ఏ రాయి ఉన్నా అందంగానే ఉంటుంది," అన్నాడు.

ఆశ్చర్యంతో పసిపిల్ల ముఖంలాగా అయిపోయిన కుముదిని ముఖం అతనికి ఆనందం కలిగించింది.

"మీవాళ్ళ ఇంటినుంచి కాలూముఖర్జీ వచ్చాడు. అతన్ని పంపిస్తాను. మాట్లాడ తూ ఉండు; ఈలోపుగా నేను భోజనం చేసి వస్తాను.'' అన్నా డతను.

కుముదిని కళ్ళు కృతజ్ఞతతో చెమ్మగిల్లాయి.

## 12

చాటర్జీలకూ, ముఖర్జీలకూ అనాదిగా సంబంధం ఉంటున్నది. కాలూ పూర్వీకులు చాటర్జీలకోసం జైళ్లకు వెళ్ళారట. విప్రదాసుకు నమ్మకంమీద పనులు చేయవలసివస్తే కాలూయే చేస్తాడు. మధుసూదనుడికి విప్రదాసు తరపున పద్దీకిస్తీ చెల్లించటానికి వచ్చాడు.

కాలూ తివాసీమీద కూర్చుంటూ, "చిన్నమ్మా, నిన్ను చూసి ఏళ్ళయినట్టుంది," అన్నాడు.

"అన్నయ్య ఒంట్లో ఎలాఉంది, కాలూదా ?"

"చాలా గాభరాపెట్టాడు. నువు వచ్చేసిన మర్నాడు చాలా ప్రమాదం చేసింది. తరవాత మెల్లిగా కోలుకున్నాడు. డాక్టర్లాశ్చర్య పోయారు."

"అన్నయ్య రేపు వస్తున్నాడా ?"

"రెండురోజు లాగి వస్తాడు. నీ వెలా ఉన్నావు ?"

"హాయిగా ఉన్నాను."

కాలూదా ఏమీ అనలేదుగాని, కుముదిని ముఖం వాడిఉండటమూ, శరీర లావణ్యం తరిగి ఉండటమూ గమనించాడు.

"పెద్దన్నయ్య నాతో ఏమీ చెప్పమనలేదా ?" అన్నది కుముదిని.

"నీకోసం ఒక వస్తువు పంపాడు."

"ఏం పంపాడు ? ఏదీ ?"

"మహారాజాగారు స్వయంగా తెచ్చి నీ కిస్తారుట."

"అదేమిటో చెప్పవూ ?"

"చెప్పవద్దన్నారు...మహారాజాగారు నిన్ను చాలా సుఖపెడుతున్నారని అన్నయ్యతో చెబుతాను; సంతోషిస్తాడు."

కాలూదానూ భోజనానికి ఉండమనే ధైర్యం లేక, కుముదిని, "నువ్వింకా భోంచెయ్యలేదు కదూ ?" అన్నది.

"చీకటి పడ్డాక భోంచేస్తే అరగటంలేదు. మకరధ్వజం తీసుకున్నా ఏమంత ఫలితం కనిపించలేదు," అన్నాడు కాలూదా, కొత్త కోడలికి స్వతంత్రం ఉండదని గ్రహించి.

అంతలో మోతీతల్లి వాకిలివద్దనుంచి కుముదినిని పిలిచి, "మీ పుట్టింటినుంచి కాలూముఖర్జీగారు వచ్చారుట. ఆయనకు భోజనం ఏర్పాటు చేశాను. కిందికి తీసుకురా అక్కా." అన్నది.

కుముదిని కాలూదావద్దకు తిరిగి వచ్చి, "ఇవాళ నీ పథ్యం సాగదు. నువు భోజనం చెయ్యకుండా వెళ్ళటానికి వీల్లేదు," అన్నది.

"చంపేశావు. ఇవాళ్టికి విడిచిపెట్టుదూ. ఇంకోసారి వస్తాలే," అన్నాడు కాలూదా.

"వల్లకాదు. లే భోజనానికి."

భోజనం దగ్గిర కాలూదా ఏమీ లోటు చెయ్యలేదు. మకరధ్వజం పనిచేసినట్టే కనబడింది.

కుముదిని తన గదిలోకి వెళ్ళి తన పుట్టింటి విషయాలూ, నూర్నగరు విశేషాలూ నెమరువేయసాగింది. మధుసూదను డామెకు తెలియకుండా వెనకనుంచి వచ్చి, గోడమీది అద్దంలో ఆమె ముఖాన్ని చూశాడు. ఆమె పరధ్యానంగా ఉండటం అతని కివాళ ఆగ్రహం కలిగించలేదు. అతను శాంతంగా వచ్చి ఆమె పక్కన కూర్చుని, "ఏమి టాలోచిస్తున్నావు, బడాబౌ?" అని దీనంగా అడిగాడు.

కుముదిని ఉలిక్కిపడి, తెల్లబోయింది. అత నామె చెయ్యి పట్టుకుని అడించి, "నువు నా కెప్పటికీ దొరకవా?" అన్నాడు.

కుముదిని ఆ ప్రశ్నకు జవా బెరగదు. తాను తన భర్తకు మనస్సూ, ప్రాణాలూ ఎందు కర్పించుకోలేకుండా ఉన్నది ? సావిత్రిలాటి పతివ్రత కావాలన్న లక్ష్యం ఎందుకు అందటం లేదు ?

"నామీద దయ ఉంచు. నన్ను నీదాన్ని చేసుకుని ఆజ్ఞాపించు, శిక్షించు. నేను నీకు తగినదాన్ని కానేమో ననుకుంటాను." అన్న దామె.



ఈ మాటకు మధుసూధనుడు ఏడుపువచ్చి నవ్వాడు. కుముదిని పతివ్రతాధర్మం కోరుతున్నది. సామాన్యస్త్రీ అంతకంటె చేయగల దేదీ ఉండదు. కాని కుముదినిలో సామాన్యస్త్రీకి ఉండేదానికన్న అధికమైన దేదో ఉన్నది. దాన్ని పొందటానికి అతను ఎంత త్యాగమైనా చెయ్య సిద్ధంగా ఉన్నాడు. కాని అతని అల్పత్వం మరింత బయటపడి, ఆందోళన కిలుగుతున్నది.

"నీ కో మంచి వస్తువు ఇస్తాను, ఏమిస్తావు ? దాని విలవ పుచ్చుకుంటాను సుమా !" అంటూ మంచంకిందినుంచి ఇస్రాజ్ పైకి తీశాడు. కుముదిని చిన్నతనంనుంచీ దాన్ని వాయిస్తున్నది, కాని కాపరానికి వచ్చేటప్పుడు వెంట తీసుకురాలేదు.

"నీ ఇస్రాజ్ మీద ఒక పాట వాయించి, వినిపించు." అన్నాడతను. అతనికి సంగీతంలో ఆసక్తి లేదని ఆమెకు తెలుసు. అందుచేత ఆమెకు వాయించటం కష్ట మనిపించింది. దాన్ని శ్రుతిచేసి మర్నాడు వినిపిస్తానన్నది.

మధుసూదనుడు శాలువులోనుంచి తోలుపెట్టె ఒకటి తీసి, "నీకోసం ముత్యాలహారం ఒకటి తెచ్చాను. అది నీ కంత ప్రీతి కలిగించదేమో !" అన్నాడు.

కుముదిని మాట్లాడలేదు.

"నా దరఖాస్తు మంజూరు కాలేదన్నమాట!" అన్నాడతను.

ఉన్నట్టుండి చైతన్యం పొంది, కుముదిని ఆ హారాన్ని తీసుకుని మెడలో వేసుకుని, మధుసూదనుడికి ప్రణామం చేసి, "నా పాట వినాలని ఉన్నదా ?" అని అడిగింది.

"ఆహా, వింటాను"

కుముదిని శ్రుతిచేసి ఇస్రాజ్ వాయించ నారంభించింది. త్వరలోనే ఆమె తన పరిసరాలను మరిచిపోయి ఒక రాగంనుంచి మరొక రాగానికి మారుస్తూ తన అభిమాన కీర్తనలను పాడింది. కొంతసేపయాక ఆమె తల ఎత్తి చూసేసరికి మధుసూదనుడు తనకేసి తదేకధ్యానంతో చూస్తూ ఉండటం కంటపడింది. వెంటనే ఆమె సిగ్గుపడి వాయించటం మానేసి, ఇస్రాజ్‌ను కింద పెట్టేసింది.

"నీ కేం కావాలో చెప్పు బాబో, నువ్వేం కోరితే అది ఇస్తాను.

మురళికి ఒక కంబళి ఇయ్యమని కోరింది. తాను కిరీటం ఇయ్యబోతే, కుముదిని కాలిజోడు తాళ్ళు అడిగినట్టయింది మధుసూదనుడికి.

"మురళిపెధవ నిన్ను వేధిస్తున్నాడల్లే ఉంది." అన్నాడతను వాడిమీద కోపంతో.

"లేదు, నేనే వాడికివ్వబోతే, వాడు నీ ఆజ్ఞలేక భయపడ్డాడు."

"అయితే నీ శాలువ ఇయ్యి" అన్నాడతను.


కుముదిని ఎంతకాలంగానో తాను ధరించె బూడిరంగు శాలువ తెచ్చి ఇచ్చింది. మధుసూదనుడు ఆ శాలువను తాను కప్పుకుని నౌకరుని పిలిచి మురళిని పైకి రప్పించాడు. వాడు రాగానే అతను తన పర్సులోనుంచి ఒక నూరురూపాయల నోటు తీసి కుముదినికిచ్చి "మీరాణీ అమ్మగారు నీకు ఇనాం ఇస్తున్నారు. అది తీసుకుని నీకు కావలసిన ఉన్నిబట్టలన్నీ కొనుక్కో!" అన్నాడు.

## 13

ఎస్టేటు కొవటం విషయం మాట్లాడటానికి ఎవరో వచ్చి ఉన్నారన్నది జ్ఞాపకంవచ్చి, మధుసూదనుడు కిందికి దిగివెళ్ళాడు. వెంటనే హాల్లో గదిలో జొరబడ్డాడు.

వాణ్ణి వాళ్ళమ్మ పడుకోబెట్టి వంటపనిమీద వెళ్ళింది, ఇంతలో వాడికి ఇస్రాజ్ వాయింపు వినిపించింది. అది పెదనాన్నగారి గదినుంచి రావటం తెలుసుకుని, పెదనాన్న గదిలో ఉంటే ఇస్రాజ్ వాయించటానికి ఎవరికీ గుండె లుండవనుకుని, ధైర్యంగా వెళ్ళాడు. గదిబయట పెదనాన్న జోళ్ళు కనిపించి తారెత్తి తిరిగి పోదామనుకుంటుండగా, తలుపు సందునుంచి దొడ్డమ్మ వాయిస్తూండటం కనిపించింది. తలుపు మూల దాక్కొని వాడు పాట వింటూ పెదనాన్న వెళ్ళిపోగానే లోపలికి దూరాడు.

కుముదిని వాణ్ని తన గుండెకు అదుముకుని "ఇదేమిటి చేతు లింత చల్లగా ఉన్నాయి. వర్షపుగాలిలో తిరుగుతున్నావా ?" అన్నది.



ఆమె తనమీది శాలువును వాడిమీదకూడా కప్పి, వాడి ఒళ్ళు వేడెక్కటానికి మరింత గట్టిగా కౌగలించుకుని, "ఇంకా పడుకో లేదా, గోపాల్ ?" అని అడిగింది.

"నీపాట విందామని వచ్చాను, దొడ్డమ్మా," అన్నాడు హాబ్లూ.

ఇంతలో మోతీతల్లి వచ్చి, వాణ్ణి కేకలువేసి తీసుకుపోయి పడుకోబెట్టి, నవీనడి కుట్రకుఫలితం ఏమయిందీ తెలుసుకుందామని మళ్ళీ వచ్చింది. ఆమెకు కుముదిని వేలిన నీలం ఉంగరం కనిపించి, కొంతఫలితం కలిగిందనిపించింది.

"ఎల్లుండి మీఅన్నయ్యగారు వస్తున్నారు. ఆయనను చూడబోవటంమాట వచ్చిందా ? బావగారిని అడిగావా ?" అన్నది మోతీతల్లి.

"ఇం కేదైనా అడుగుతానుగాని అది అడగను." అన్నది కుముదిని.

"అడక్కుండానే వెళ్ళొచ్చు. బావగా రేమీ అనరు. ఆయనకు నీపైన చాలా ప్రసన్నత కలిగింది."

"దానికి కారణం తెలీదు. భయంగా ఉంది."

"కారణ మేముంది ? ఇంతకాలమూ వర్తకంలో మునిగి తేలారు. నీలాటి ఆడదాన్ని ఎన్నడూ చూడలేదు. నిన్ను చూస్తున్న కొద్దీ ఆకర్షణ పెరుగుతున్నది."

"ఆకర్షించేది నాలో ఏముంది ? శూన్యం ! నాకు తెలియదా ? ఆయన భ్రమపడుతున్నారని నా భయం."

మోతీతల్లి కుముదినిని మనసులో ఉన్నదంతా దాచకుండా తనకు చెప్పమని అడిగింది.

"నిజం చెప్పాలంటే నన్ను చూసి నేనే భయపడుతున్నాను. నన్నుగురించి నే నింతకాలము అనుకున్నది నిజంకాదు. అన్నయ్య భయపడుతున్నా, నామనసులో ఏవో ఆశలు నింపుకుని, నిశ్చింతగా బయలుదేరి వచ్చాను. ఆ ఆశలు ఈనాడు నాలోలేవు. ఆనాడు అంధకారంలో ఉండి అది అంధకారమని తెలుసుకోలేదు. ఈనాడు కళ్ళువిప్పి చూసేసరికి బయట ఉన్నదే లోపలా ఉన్నది. ఒకొక్క గడియా లెక్కిస్తూ సంవత్సరాలు గడపడం ఎలాగ ?" అన్నది కుముదిని.

"బావగారిని ప్రేమించలేకుండా ఉన్నావు, అవునా ?"

"ఏది దొరికితే దానితోనే తృప్తిచెందే శక్తి నాలో ఉండేది. దాన్ని మీ బావగారు మొదట్లోనే అణగదొక్కేశారు. ఇప్పు డేం చేతామన్నా చాలా కష్టంగా ఉంది. చర్మంకింది నాజూకుపొర బయటపడిపోయి, ఒంటికి ఏం తగిలినా బాధగా ఉంది. భ్రమలన్నీ పోయి, నా జీవితమంతా కళ్ళ ఎదట కనబడుతున్నది. భక్తితో భర్తకు ఆత్మార్పణ కాలేకపోవటం మహాపాపం. కాని భక్తిలేకుండా ఆత్మార్పణ కావటంకన్న అసహ్యం మరేదీ ఉండదు."

"ప్రేమించకపోయినా ఆడది ఇల్లాలితనం నెరపాలి. సంసారం నడవొద్దూ ?" అన్నది మోతీతల్లి.

"అది నాకు సాధ్యమయేటట్టు దీవించు. దేవుణ్ణి ప్రార్థించినా నాకు బలం రాకుండా ఉన్నది," అన్నది కుముదిని.

"బావగారికి నీమీద ఎంత ప్రేమో మరిచిపోకు."

"అదే నాకు ఆశ్చర్యంగా ఉంది. ఆయనకు తగిన యోగ్యత నాలో లేదు. నిన్న రాత్రెల్లా కూర్చుని ఆలోచిస్తే ఏం తట్టిందో తెలుసా ? నే నొక బేరింగు కవరును. రెట్టింపు చార్జీ ఇచ్చి కవరు చించి చూస్తే లోపల ఉత్తరమైనా ఉండదు."

"యోగ్యత ఉండటానికి నువ్వాయన వర్తకానికి మేనేజరుపని చేయవచ్చానా ? ఆయన మనసు విప్పి మాట్టాడిఉంటే తానే నీకు తగనని ఉండేవారు."

"ఆమాటే అన్నారు. తరవాత తనపొరపాటు తెలుసుకుంటారని నాకు భయంవేసింది, నేను ఎటువంటి మూర్ఖురాలనో చెబుతానువిను. నాపెళ్ళి హఠాత్తుగా జరిగింది. నేను మాయకల్పించుకుని కుర్రతనంగా ప్రవర్తించకపోతే, ఈ పెళ్ళి జరక్కపోను. అన్నయ్య కంగారు పడ్డాడు. ఆయన భయం గుర్తించికూడా నేను, ఆత్మవిశ్వాసంతోనూ,

పట్టుదలతోనూ పెళ్ళిచేసుకున్నాను. అడ్డుపెట్టటం వృధాఅని తెలిసి అన్నయ్య చూస్తూ ఊరుకున్నాడు ఇది స్వయంకృతాపరాధమన్నది మరిచిపోలేను. ఇక నావల్ల అందరికీ కష్టాలే, నాకూ కష్టాలే," అన్నది కుముదిని.

## 14

మధుసూదనుడి వ్యాపారంలో ఒడుదుడుకు లేర్పడ్డాయి. ఆ వ్యాపారంతో దగ్గరసంబంధంగల మద్రాసుబాంకు దివాలా ఎత్తింది. మధుసూదనుడి మీద మిగతావాళ్ళకు లోగడ ఉంటూవచ్చిన అచంచల విశ్వాసం సడలింది. బండి వడవగలందులకు క్లిష్ట సమయాలలో అతనుచేసిన పొల్లుపమలు బయటపడి తప్పిదాలరూపం దాల్చాయి. తన సొంత చిత్తాపుస్తకంలోని రహస్యవివరాలు పైవా శ్చెవరో చాటుగా చూస్తున్నారని మధుసూదనుడికి అనుమానం. ఈ పరిస్థితిలో కుముదిని అతని మనస్సులోనుంచి మాయమయింది. అతను పూర్తిగా తన వ్యాపార వ్యావహారాలలో మణిగిపోయాడు.

కుముదినికి అన్న ఒక ఉత్తరం రాశాడు. అతను ఆ రోజే కలకత్తా చేరాడట. చెల్లెలిని చూడటానికి వస్తానన్నాడు. ఆ మాటలో కుముదినికి 'నీవు మా యింటికి రావద్దు' అన్న అర్థం స్ఫురించింది. ఏడవబుద్ధయింది.

ఆమె కా వుత్తరాన్ని అన్నవద్దనుంచి తెచ్చి ఇచ్చిన నవీనుడు ఆమె ముఖం చూసి, అందులో ఏదో దుర్వార్త ఉన్నదనుకుని, "రేపే వెళ్ళి మీ అన్నయ్యను చూడు వదినా," అన్నాడు.

"నేను వెళ్ళను," అంటూ కుముదిని ఆపుకోలేకుండా ఏడ్చేసింది.

నవీనుడు దుఃఖకారణం తెలుసుకుని ఓదార్పుగా "మీ అన్నయ్య నిన్ను రావద్దనలేదు. మా అన్నయ్య నిన్ను రానివ్వడని భయపడి అలా రాశారు." అన్నాడు. దానితో ఆమె స్థిమితపడింది.

ఆ రాత్రి మధుసూదనుడు తన ఆఫీసుగదిలోనే పక్క వెయ్యమని ఉత్తరు విచ్చాడు. అతను ఆఫీసునుంచి మోపెడు కాగితాలు వెంట తెచ్చుకుని, ఆ రాత్రి వాటిని ముందు వేసుకుని పనిచేస్తూ కూర్చున్నాడు.

నవీన్ వచ్చి ఏదో మిషమీద అన్నను పలకరించి "వదినె రేపు తన అన్నగారిని చూడబోతుందట" అన్నాడు.

మధుసూదనుడు మొదట "వెళ్ళనీ, వెళ్ళనీ." అని చేతులూపి నవీన్‌ను బయటికి పంపి, మళ్ళీ అతన్ని పిలిచి, "ఆమెను నాన్నగారింటికి వెళ్ళి, పదిరోజు లుండిరమ్మను. ఆ ఏర్పాటు నువే చూడు." అన్నాడు.

నవీనుడు వెళ్ళిపోతూ, "వెళ్ళి పడుకోవా, అన్నయ్యా ? వదిన నీకోసం మేలుకుని ఉంటుందేమో." అన్నాడు.

మధుసూదనుడు తాను చేస్తున్నపని ఆరాత్రి పూర్తి చెయ్యాలనుకుని కుముదినిని తన మనస్సునుంచి పక్కకు నెట్టేసి, చాలా సేపు పని చేశాడు. కాని అది పూర్తి కాకపూర్వమే కుముదిని రహస్యంగా


శ్రేష్ఠతకు మరియొక పేరు

పద్మా



కాఫీ

పద్మా కాఫీ యిండస్ట్రీస్

గుంటూరు - 2.

(ఫోన్: 1273)

అతని మనసులో జొరబడి అతని తీర్మానాన్ని దెబ్బకొట్టింది. ఆమె తనకోసం మేలుకుంటుందేమో అని నవీను దన్నమాటలు అతన్ని పూర్తిగా ఓడించాయి.

మధుసూదనుడు చేతిలో ఉన్న నీలం పెనసలు జారవిడిచి, ఎక్కడికాగితా లక్కడే విడిచి, దీపమైనా ఆర్పకుండా, పడక గదికి బయలుదేరాడు. అతను మెట్లెక్కటానికి వరండాలోకి వచ్చే సరికి, శ్యామ కటకటాలను పట్టుకుని కింద కూర్చుని కనబడింది. వెన్నెలకాంతిలో ఆమె బొమ్మలా గున్నది. ఆ వరండాలోనుంచి అతను వెళ్ళి, పడకగదికి మెట్లెక్కుతా డని ఆమెకు తెలుసు. అతన్ని అలా పోతూ చూసినప్పుడల్లా ఆమెకు దుర్భరమైన బాధకల్గుతూంటూంది. అతని దారిలో కూర్చోవటంలో ఆమెకు ఆశకూడా లేకపోలేదు. ఏ క్షణాన ఏదిజరిగినా జరగవచ్చు. ఆమె అతన్ని చాలా కాలంగా కాంక్షిస్తున్నది.

అత నామెను ఒక్కసారి చూసి మెట్లెక్కి మూడో అంతస్థుకు వెళ్ళిపోయాడు. శ్యామ కటకటాలకేసి తల కొట్టుకున్నది.

మధుసూదనుడు పడకగదిలోకి వచ్చేసరికి కుముదిని శాలువ కప్పుకుని, పరుపుపైన గాఢనిద్ర పోతున్నది. అతను తిరిగి వెళ్ళి పోదా మనుకున్నాడు గాని వెళ్ళ బుద్ధిపుట్టలేదు. గస్‌లైట్ వెలిగించినా ఆమెకు నిద్రాభంగం కలగలేదు. దభాలున అతను మంచం అదిరేటట్టు కూలబడ్డాడు.

కుము బెదిరి లేచికూర్చున్నది. ఈరోజు అతను వస్తాడని ఆమె అనుకోలేదు. ఆమెను చూడగానే అతనికి బల్లెంతో పొడిచిన ట్టయింది. "నన్ను చూసి అసహ్యపడకుండా ఉండలేవు కదూ ?'' అని అత నామె నడిగాడు.

అతన్ని చూడగానే కలిగిన భయంచేతా, నిద్రనుంచి ఆకస్మికంగా లేవటంవల్లా మనస్సు వికలంగా ఉండటంచేతా ఆమె ఏమీ అనలేకపోయింది.

"మీ అన్నయ్య దగ్గిరికి వెళ్ళాలిసిన అవసరం ఉందా ?" అని అత నడిగాడు.

''లేదు." అన్న దామె.

"నీకు వెళ్ళాలనిలేదూ !"

"లేదు."

"నన్ను అడగమని నువు నవీనును పంపలేదూ ?"

"పంపలేదు." అన్నయ్యను చూడటానికి వెళ్ళనని అతనితో అన్నాను.''

"ఏం ? ఎందుకు వెళ్ళవు ?"

"ఎందుకో చెప్పలేను."

"ఇదో నూర్‌నగరు వేషమా ?"

"నూర్‌నగరుదాన్నే నేనూ."


Phone : 74386

Resi: 74383

Grams: 'FANCYPAPER'

*With best compliments from*

# GOLI ESHWARIAH

GENERAL BAZAR, SECUNDERABAD (A. P.)

*Distributors & Stockists*

THE TITAGARH PAPER MILLS CO., LTD.

STRAW PRODUCTS LTD., BHOPAL

BALLARPUR PAPER & STRAW BOARD MILLS LTD.

SESHASAYEE PAPER & BOARD LTD.,

HOOGHLY INK CO., LTD.

"అయితే అక్కడికే వెళ్ళు. ఇక్కడ వుండతగవు. నీ పైన దయతలిచాను. నీకు మర్యాద అర్థం కాదు. ఇక పశ్చాత్తాప పడుదువుగాని, వెళ్ళు."

కుముదిని కొయ్యబారిపోయి మాట్లాడక కూర్చున్నది. అతనామె చెయ్యి పట్టుకుని గుంజి, "క్షమాపణ చెప్పుకోవటంకూడా తెలీదా?" అన్నాడు.

"ఎందుకు క్షమాపణ?"

"నా పరుపుమీద పడుకున్నందుకు."

కుముదిని వెంటనే లేచి అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

మధుసూదనుడు తన గదికి వెళ్ళిపోతూ, వరండాలో బోర్ల పడుకుని ఉన్న శ్యామను చూసి, వంగి లేవదీస్తూ, "ఏం చేస్తున్నావు, శ్యామా?" అన్నాడు. ఆమె అతని కాళ్ళకు గుండె అదుముకుని, "నన్ను చంపెయ్యి!" అన్నది.

"పద, నిన్ను పడుకోబెట్టి వస్తాను," అంటూ మధుసూదనుడామెను మంచోబెట్టి, తనమీది శాలువు ఆమెకుకూడా వచ్చేటట్టు కప్పి, కుడిచేత్తో ఆమెను గట్టిగా పట్టుకుని, పడకగదిలో ఆమెను పడుకోబెట్టాడు.

"కొంచెంసేపు కూర్చోవా?" అన్న దామె.

"పని ఉన్నది," అన్నా డతను.

కుముదిని అతనిని పని చేసుకోకుండా చేసి, ఆ మీదట అవమానించింది. తనకు కొరతలేని భాండాగారం ఇప్పు డందుబాటులో ఉన్నది — శ్యామ యావజ్జీవమూ తనకోసమే వేచిఉన్నది గనక అత నిప్పుడు నిశ్చింతగా పని చేసుకోవచ్చు.

కుముదిని దెబ్బతినికూడా కొంత తృప్తిపొందింది. ఇంత కాలంగా తనపైన వాంఛతో బాధపడిన తనభర్త ఇప్పటికి తమ యిద్దరిమధ్యా ఉన్న వైరుధ్యం గ్రహించగలిగాడు. ఇకముందు ఇద్దరూ తమ సహజ మనస్తత్వాలను స్వేచ్ఛగా ప్రదర్శించవచ్చు. అతనికి కోపం రావటంకూడా సబబే. అతని పక్కమీద తాను పడుకోరాదు. అది అతన్ని గేలి చేయడమూ, మోసగించడమూ అవుతుంది. ఒక్కటే ఆమె కర్థం కాలేదు. చీటికీ మాటికీ తనవి నూర్నగరు వేషాలని ఎత్తిపొడుస్తాడే. అంటే తమ తమ స్వభావాలు వేరనేకద; అతనిది నిజమైన ప్రేమ ఎలా అవుతుంది? తా నతని మనసులో ఎలా పీఠం వేసుకుంటుంది? అది సాధ్యం కాదని అతనికి ఎంతత్వరగా తెలిస్తే అంత మంచిది.

మధుసూదనుడు రాత్రి రెండున్నర గంటలప్పుడు తన పని ముగించుకుని, నవీనుణ్ణి పిలిపించి, కుముదినిని ఉదయమే విప్రదాసు ఇంటికి పంపమనీ, తాను తిరిగి కబురుచేసేదాకా ఆమె రానవసరం లేదనీ ఆజ్ఞ జారీచేశాడు. భార్యా భర్తలమధ్య అద్భుతంగా సంధి కుదిర్చాననుకున్న నవీనుడు, ఇంతలోనే కుముదినికి పడిన ఈ ప్రవాసశిక్ష తెలుసుకుని నీరసపడిపోయాడు.

అతను తన పడకగదిలో మోతీతల్లితో కుముదినిని గురించి మాట్లాడుతుండగా, బయట మాటలువినిపించినయి. మోతీతల్లి కుముదిని గదితలుపు తెరచి, శ్యామనూ మధుసూదనుణ్ణీ చూసింది. ఇటువంటి సమయంలో కుముదిని లేకుండా వెళ్ళిపోవటం మంచిది కాదేమోనని ఆమె భర్తతో అన్నది:

"ఇన్నాళ్ళూ వదినె లేకపోవటంచేత కథ ఇంత దూరం రాలేదు. వదిన వచ్చి అన్నయ్యలో ఆకలి రేపిందిగాని, తీర్చలేక పోయింది. అందుకే ఆయన ఇంతకు పాల్పడుతున్నాడు. వదినె దూరంగా ఉంటమే మంచిది — ఆమెకు క్షేమం," అన్నాడు నవీన్.

కుముదిని అన్నగారింటికి వెళ్ళిపోయేటప్పుడు పంజరంనుంచి తప్పించుకుపోతున్న పక్షిలాగా అందరికీ కనబడింది.

"నీకు ఎక్కడ ఆదరణ లభిస్తే అక్కడే ఉండు. వదినా. అవసరం వచ్చినప్పుడు నన్ను మరచి పోకు," అన్నాడు నవీనుడు.

మోతీతల్లి ఏమీ అనకుండా కుండెడు ఆవకాయ తెచ్చి పల్లకీలో పెట్టింది. నిజానికి కుముదిని భర్తను వదిలి వెళ్ళిపోవటం ఆమెకు సమ్మతం కాలేదు. కుముదిని కష్టాలలో ఆమె సానుభూతి చూపగలిగిందిగాని, ఆడది కష్టాలు సంహించి ఊరుకోవటం ఆత్మగౌరవం కాదనుకోవటం ఆమెకు నచ్చదు. ఆమె కుముదినిని క్షమించలేకపోయింది

కుముదిని అన్నఇంటిదగ్గిర పల్లకీ దిగుతూనే పైకెక్కి అన్న ఉన్నచోటికి వెళ్ళింది. పాలిపోయి, చప్పి దవడలు పడి, విప్రదాసు ఎన్నో ఏళ్ళు పెరిగినట్టున్నాడు.

"ఏమిటన్నయ్యా, ఇలాగయిపోయావు?" అన్న దామె.

"ఎలా బాగుంటాను? కాని నువ్వెందు కిలా తెల్లబారిఉన్నావు?" అన్నాడు విప్రదాసు.

క్షేమఅత్తా, నౌకర్లూ, దాసీలూ అంతా వచ్చి కుమును చూడటానికి వాకిలి దగ్గిర నిలబడ్డారు. కుము వెంట వచ్చిన పల్లకీ వాళ్ళనూ, నౌకర్లనూ, భోజనానికి కూర్చోబెట్టి వచ్చానని క్షేమ అత్త అన్నది. విప్రదాసు ఆమెను దగ్గిరకి పిలిచి, కుముదినికి వివరపడకుండా, వచ్చిన మనుషులకు ఏమేమి మర్యాదలు చెయ్యాలో చెప్పాడు.

తన అన్న తనను ఇలా వేరు చేసినందుకు కుముదినికి మండిపోయింది. ఆమె పూర్వంలాగా తన అన్న ఇంటి పెత్తనం చేపట్టి ఇల్లంతా సర్ద నారంభించింది. ఆమె ఇల్లంతా శుభ్రం చేస్తూంటే ఇంటినౌకరు సహాయం వచ్చాడు. కుముదిని తన అన్న అనుమతి లేకుండా అతని ముఖమూ, చేతులూ తడి చేసి తుడిచి, తల దువ్వింది.

తనకు అన్న సేవ చేయటం తప్ప జీవితంలో మరే బాధ్యతా లేనట్టుగా కుము ప్రవర్తించటం చూసి విప్రదాసు, దాని అర్థమేమిటా అనుకున్నాడు. అత్తవారింట తన పరిస్థితి ఏమిటో ఆమె

చెబుతుం దనుకున్నాడు. కాని ఆమె ఆ విషయం ఎత్తనేలేదు. చివరకు విప్రదాసు, "ఇవాళ నువు తిరిగి వెళ్ళిపోనవసరం లేదా?" అన్నాడు.

"ఇవాళ వెళ్ళనవసరంలేదు. నాభర్త ఒప్పుకున్నారు," అన్నది కుముదిని.

"రేపు వెళ్ళాలా?"

"లేదు, కొన్నాళ్ళుంటాను."

"నా దగ్గిర దాచకు, చెల్లీ! మీ ఇద్దరిమధ్యా ఎలా ఉంటున్నది?"

కుముదిని అన్న గుండెమీద ముఖంపెట్టి, "నేను చాలా భ్రమపడ్డా నన్నయ్యా. ఏమీ ఊహించలేకపోయాను," అని ఏడ్చింది. ఆమె తన పుట్టింటిపద్ధతులే ఎరుగును. అన్నిఇళ్ళూ అలాగే ఉంటాయనుకుని గోతిలో పడింది.

విప్రదాసేమీ అనలేదు. తనచెల్లెలు కబంధహస్తాలలో చిక్కిపోయింది. తన ఆస్తి అంతా మధుసూదనుడికి తాకట్టు ఉండటం కుముదిని బాధ మరింత అయింది. ఈ అప్పు ఎలా రద్దుచెయ్యటమా అని అతను మహా బాధపడుతున్నాడు. మరొకచోట ఎక్కడైనా అప్పుపుట్టించి, మధుసూదనుడినుంచి ఋణవిముక్తుడు కావటానికే అత నిప్పుడు కలకత్తా వచ్చాడు.

"భర్త అంటే నాలో ఏమాత్రమూ సుముఖత లేకుండా ఉన్నది. ఇది పాపమేనా?" అని కుముదిని అన్న నడిగింది.

పాప పుణ్యాలను గురించి నా అభిప్రాయాలువేరు, నియమాలు వేరు, ధర్మంవేరు. పరిస్థితులనుబట్టి ఈ రెంటికీ పొంతనలేకుండాపోయింది. నియమం తప్పినప్పుడల్లా ధర్మం తప్పినట్టుకాదు... నువు ఇక్కడ ఎన్నాళ్ళుండగలవు, కుమూ?" అన్నాడు విప్రదాసు.

"రమ్మని కబురు వచ్చేవరకూ."

కాలూదా గదిలోకి వచ్చాడు. కుముదిని అతనికి ప్రణామం చేసింది.

"వచ్చావా, చిన్నమ్మాయీ? ఇక అన్నయ్యకు కాస్త తెరిపి కావచ్చు." అన్నాడు కాలూ.

కుముదిని లోపలికి వెళ్ళిపోయాక విప్రదాసు ఆత్రంగా, "ఏమి అయింది, కాలూదా?" అని అడిగాడు.

"నీ ఒక్కడి సంతకం మీద అప్పు పుట్టదు. సుబోధ్ సంతకం కూడా కావాలంటున్నారు. మార్వాడీలైతే ఇస్తారుగాని, వడ్డీ భరించలేం."

"సుబోధును వెంటనే రమ్మని టెలిగ్రాం పంపించు. ఉంగరం అమ్మిన డబ్బు అసలులో చెల్లువేద్దామని ప్రయత్నిస్తే మధుసూదనుడు తీసుకోలేదు. వాలకం చూస్తే ఎప్పుడో మెడకు ఉచ్చు బిగించేటట్టు కనబడుతుంది."

"అతనితో ఎంత జాగ్రత్తగా మసులుకోవాలో ఏం చెప్పను; ఒళ్ళు మండిపోతున్నా సహించి ఊరుకున్నాను. అతను మనకు


FEEL FRESH

A-1 DYERS & DRY-CLEANERS
(Estd. 1939)

LOOK SMART

KEEP UP YOUR PERSONALITY
and
BE SURE THAT YOU ARE WELL DRESSED
SEND YOUR CLOTHES TO A-1

**Head Office: Rashtrapathi Road, Secunderabad** Phone: 74840

*Branches:–* NAMPALLY, CHIKKADPALLY, MARREDPALLY and AMEERPET
Phone: 34216 Phone: 74715

**OPENING VERY SHORTLY OUR BRANCH AT HANAMKONDA**

"అప్పులవాడేగాక, చెల్లెలి మొగుడై కూర్చున్నాడు. వ్యవహరించటం మహాకష్టం." అన్నాడు కాలూదా.

ఇంతలో కుముదిని తన అన్నకు బార్లీజావ తెచ్చి, వారి సంభాషణకు అంతరాయం కలిగించింది. వాళ్ళమాటలు ఆమె వినకపోయినా, దాని సారాంశం ఆమెకు బోధపడిపోయింది. తన భర్త తన అన్నకు అప్పుఇచ్చిన సంగతి ఆమెకు ఒకసారి జ్ఞాపకం చేశాడు. ఆ అప్పు తీరితేనేగాని తన అన్న మర్యాద దక్కదని ఆమె ఆనాడే అనుకున్నది. ఆ అప్పు తీరితేనేగాని విప్రదాసు కోలుకోడు కూడా. వేరే అప్పు పుట్టించటానికే తన అన్న కలకత్తా వచ్చాడనీ, అప్పు పుట్టటం కష్టంగా ఉన్నదనీ ఆమె కాలూదా నోట చెప్పించింది. కాలూదాకూడా ఆమె ఏ పరిస్థితులలో అన్నవద్దకు వచ్చినదీ ఆమె ద్వారా తెలుసుకుని. "నీ భర్త కబురుపంపేదాకా ఉండరాదు, నీ అంతట నీవే వెళ్ళిపోవాలి, చిన్నమ్మాయి." అన్నాడు.

తన పెద్దన్నయ్య కష్టాలన్నిటికీ తానే మూలకారణమన్న భావం కుముదుని మనస్సులోనుంచి పోకుండా ఉన్నది. కాని తాను అడ్డైపోయింది. ఏమీ చెయ్యలేదు. చిన్నన్న హాయిగా ఇంగ్లండులో ఉన్నాడు. బరువంతా పెద్దన్నయపైన పడింది.

## 15

శ్యామాసుందరికూడా అందరిలాగే మధుసూదనుడంటే తగని భయం. అయితే అప్పుడప్పుడూ అతను తనపట్ల మెత్తబడ్డట్టు కనిపించటంచేత ఎటునుంచి దాడి చేస్తే అతడు తనకు లొంగుతాడో చూడటానికి చాలాసార్లు ప్రయత్నించింది. కాని ఆమె ప్రయత్నాలు సఫలం కాలేదు. మధుసూదనుడికి స్త్రీలంటే చాలా హీనభావం. అందుకే అతనంటే ఆడవాళ్ళకు భయం. శ్యామకు బలంతోపాటు అతనివైపు బలమైన ఆకర్షణకూడా ఉన్నది. ఆ ఆకర్షణను ఆమె చాలాకాలంగా అణచిఉంచింది.

అయితే మధుసూదనుడు కుముదినిని పెళ్ళాడి ఇంటికి తెచ్చాక, శ్యామలకు వెర్రెత్తిపోయింది. అతను ఇతర స్త్రీలను ఈసడింపుగా చూసినట్టు చూడక, కుముదినిపై గుడ్డిప్రేమలో పడ్డాడు. ఆ దౌర్బల్యం అతనిలో చూశాక శ్యామకు సాహసం వచ్చింది. కుముదినిని అన్నగారింటికి పంపేముందురాత్రి మధుసూదనుడు శ్యామను చేరదీశాడు. శ్యామ అంతకు ముందెన్నడు అతని కంత దగ్గర కాలేదు.

కుముదిని వెళ్ళిపోయిననాడు మధుసూదనుడు తన దౌర్బల్యాన్ని తాను బాగా గ్రహించాడు. స్త్రీ ద్వారా శాంతి పొందటం తప్ప అతనికి మార్గం దొరకలేదు. ఆరోజు మధ్యాన్నం అతను భోజనంచేసి గదికి వెళ్ళి శ్యామను పిలిపించాడు. ఆమె వచ్చి అతని పక్కమీద కూర్చుని, మీదికి వంగి, "చాలా నీరసంగా ఉన్నావే?" అంటూ తల నిమిరింది.


Telegrams: BIOSYNTH

Telephone: 39013 39139

**Biochemical & Synthetic Products Ltd.,**

SANATNAGAR, HYDERABAD-A. P.

***MANUFACTURERS OF***

Para - Amino Salicylic Acid and its Salts
Para - Hydroxy - Benzoic Acid and its esters in technical collaboration with

M/s Cilag Hind Ltd., Licencees of
M/s Cilag Chemie Schaffhausen, Switzerland

Standardised Concentrated CRUDE DRUG EXTRACTS
like Belladonna, Hyoscyamus, Glycyrrhiza, Valerian, Vasaka, Ipecac etc.

Oleoresins of Ginger, Capsicum etc.
Resin of Podophyllum and jalap.
Standardised Liver Extracts., Bacterological Peptone and Aromatic Chemicals.

***MANAGING AGENTS***

HYDERABAD SYNDICATE PRIVATE LTD.



ఆ రాత్రి ఆమె తనంతట తానే అతని గదికి అందరికీ తెలిసేలాగా వచ్చేసింది. కుముదిని ఏ క్షణానఅయినా తిరిగి రావచ్చు. ఈ లోపుగా తన అధికారాన్ని ఇంట్లో అందరికీ అర్థమయేలాగా దిట్టంచేసుకోవా లని ఆమె తహతహ. మధుసూదనుడుకూడా తన ప్రవర్తనను రహస్యంగా ఉంచాలని ప్రయత్నించలేదు. ఇంటి నౌకర్లందరూ ఈ విషయమే మాట్లాడుకోసాగారు.

కుముదిని తిరిగి వస్తే తప్ప ఈ ప్రవాహం ఆగదని మోతీ తల్లీ, నవీనుడూ నిశ్చయించుకున్నారు. అయితే మధుసూదనుడి అనుమతి ఏదోవిధంగా పొందితేతప్ప కుముదినిని తీసుకురావటానికిలేదు. అందుకు ప్రయత్నం చేశామని నవీనుడు అన్నగదికి ఒకనాడు ఉదయం వెళ్ళేసరికి, అతను బయలుదేరబోతున్నాడు. బండి సిద్ధంగా ఉన్నది.

ప్రయాణం ఎక్కడికని అడిగితే, జ్యోతిష్కుడు వెంకటశాస్త్రి దగ్గరకని మధుసూదనుడు చెప్పాడు. నవీనుణ్ణికూడా తన వెంట రమ్మన్నాడు. నవీనుడు ముందుగా వెళ్ళి జ్యోతిష్కుణ్ణి హెచ్చరించే అవకాశంలేదు. ఇద్దరూ కలిసి బండిలో వెళ్ళారు. జ్యోతిష్కుడి ఇంటిదగ్గిర నవీనుడు ముందుగా బండి దిగి, జ్యోతిష్కుడు కనిపించగానే, జవాబులు కాస్త జాగ్రత్తగా చెప్పమని చిన్నగా హెచ్చరించాడు.

అందరూ కూర్చున్నాక నవీనుడు "శాస్త్రీజీ, మహారాజాగారికి రోజు లంతగా కలిసిరావడంలేదు ఇలా ఎంతకాలం వుంటుందో చెప్పాలి" అన్నాడు.

అతను అలా అందించటంచూసి మధుసూదనుడు చిరాకు పడ్డాడు. వెంకటశాస్త్రి చక్రంవేసి, ధనస్థానానికి శనివీక్షణ తగిలిందని చూపించాడు.

గ్రహాలతో రాజీపడలేమనీ, తన శత్రువు వర్గమేమిటో తెలుసుకోవాలని ఉన్నదనీ మధుసూదను డన్నాడు.

శాస్త్రికి దిక్కు తోచలేదు, నవీనుడుకూడా అతనికి సహాయపడే స్థితిలోలేడు. అందుచేత అతను ఆకస్మికంగా "ఇప్పుడు మీకు శత్రువుగాఉన్నది ఒక స్త్రీ" అన్నాడు. ఆ స్త్రీ శ్యామ అని చెప్పించగలిగితే బాగుండు ననుకున్నాడు నవీనుడు.

"పేరు తెలియాలి." అన్నాడు మధుసూదనుడు,

శాస్త్రి వర్గాలు ఏకరువుపెడుతూ "క" అన్నాడు. మధుసూదనుడు ఉలిక్కిపడ్డాడు. నవీనుడు కాదన్నట్టు తల ఆడించాడు. తల అలా ఆడిస్తే మద్రాసీలకు ఔనని అర్థం. అందుచేత శాస్త్రి గట్టిగా, "కవర్గం. మొదటివర్గమే. కీడంతా దానివల్లనే కలుగుతున్నది." అన్నాడు.

దానికి ప్రతీకారం ఏమిటని మధుసూదను డడిగాడు.

"కంటకేనైవ కంటకం, ఇంకో స్త్రీయే మిమల్ని కాపాడుతుంది."

వెంకటశాస్త్రి జ్ఞానానికి మధుసూదనుడు తన్మయుడైపోవటం చూసి, నవీనుడు గాబరాపడుతూ, "పందాలలో మహారాజాగారి గుర్రం గెలిచిందా, శాస్త్రీజీ?" అన్నాడు.

శాస్త్రి ఏదో గుణించినట్టు నటించి, సాధారణంగా గుర్రాలకు గెలుపు అరుదుగనక, "నష్టమే కనబడుతున్నది" అన్నాడు నాలుగు రోజులక్రితం మధుసూదనుడి గుర్రం గొప్ప పందెంలో గెలిచింది.

నవీనుడు శాస్త్రిని గుక్క తిప్పుకోనీకుండా, "నాకుపూర్తైనతి ఏమవుతుంది, శాస్త్రీజీ?" అన్నాడు. అతనికి కూతురేలేదు.

"వరుడు త్వరలో చిక్కడు. డబ్బు చాలా ఖర్చుచెయ్యాలి," అన్నాడు శాస్త్రి.

"ఇంకెందు కన్నయ్యా, పోదాం." అని నవీనుడు మధుసూధనుణ్ణి బయలుదేరదీశాడు.

దారిలో నవీనుడు జ్యోతిష్యుణ్ణి నమ్మటానికి ఏమాత్రమూ ఆధారం లేదన్నాడు. మధుసూధనుడికి తాను అడిగిన మొదటి ప్రశ్నకు జ్యోతిష్యు డిచ్చిన సమాధానంలో నమ్మకంపోలేదు. కుముదినే తనకు శత్రువు. ఆమెను పెళ్ళాడటంతోనే తన కష్టాలారంభమైనట్టు అతనికి తోచింది.

ఇటువంటి మాటలసందున, "వదినె వెళ్ళి రెండువారా లయిం దన్నయ్యా. వెళ్ళి తీసుకొస్తాను." అన్నాడు.

"తొందరేమిటి ? నాకు బుద్ధిపుట్టినప్పుడు నేనే చెప్తాను. ఇక ఈ విషయం ఎన్నడూ ఎత్తకు." అన్నాడు మధుసూదనుడు...

నవీనుడు విప్రదాసును చూడవచ్చాడు. విప్రదాసు అతనికి ఎంతోమర్యాదచేశాడు. కుముదిని అతనికి ఫలహారం పెట్టింది. నవీనుడు విప్రదాసుగదిలో కుముదిని ఫొటో ఒకటి గోడకుఉంచటం చూసి ఆ ఫొటో తనకు కావాలని అర్థించాడు. ఆ ఫొటో కుముదిని పెళ్ళి ఇంకా నాలుగురోజు లున్నదనగా తీసినది – చాలా అందంగా కూడా కుదిరింది. విప్రదాసు అతనికి తన తోలుపెట్టెలోఉన్న ఆ ఫొటోకాపీ తీయించిఇచ్చాడు.

నవీనుడి మాటలనుబట్టి అతనికి తన చెల్లెలిపట్ల ఎంత భక్తి గౌరవా లున్నదీ విప్రదాసు తెలుసుకున్నాడు. అతను నవీనుణ్ణి కుముదిని సంసారంగురించి ఏమీ అడగక, "కుము ఇవాళే మీ యింటికి వచ్చేస్తే చిక్కా ?" అని అడిగాడు.

"నిజం చెప్పాలంటే. ఆమెను ఇంటికి రమ్మనే సాహసం నాకు లేదు." అన్నాడు నవీనుడు.

కుముదిని ఎంత ప్రయత్నించినా అన్న ఇల్లు తనదే ననుకోలేక పోయింది. ఇంట్లో అందరూ, "ఈమె అత్తవారింటికింకా ఎందుకు తిరిగిపోదు ?" అని ఆశ్చర్య పడుతున్నట్టామెకు తోచింది. ఆలోచించగా తనకు చావే ముక్తిమార్గంగా తోస్తున్నది.

అకస్మాత్తుగా ఆమె అన్నవద్దకు వెళ్ళి, "ఇంక వెళ్ళిపోదా మనుకుంటున్నా నన్నయ్యా." అన్నది. విప్రదాసేమీ అనలేదు. అంతలో కాలూముఖర్జీ వచ్చాడు, కుముదిని వెళ్ళిపోయింది.

మరో అరగంటకు ఆమె తిరిగి వచ్చేసరికి విప్రదాసు చాలా విచారంలో ఉన్నట్టు కనబడ్డాడు. కాలూముఖర్జీ అప్పుడప్పుడూ మధుసూదనుడి ఇంటికి వస్తూ పోతూ ఉంటాడు. ఇవాళ అతను మధుసూదనుడి ఇంటి భోగట్టా యావత్తూ విప్రదాసుకు తెలిపాడు.

"ఏం జరిగింది అన్నయ్యా, చెప్పవూ ?" అని కుముదిని అడిగింది.

"ఇదే నీ యిల్లనుకుని ఇక్కడ ఉండిపోగలవా, కుమూ ? ఇక ఆ ఇంటికి వెళ్ళకూడదు," అన్నాడు విప్రదాసు.

అతను శ్యామా మధుసూదనులను గురించి సవిస్తరంగా విన్నాడు. వాళ్ళు చాటూమాటూ లేకుండా యథేచ్ఛగా వర్తిస్తున్నారు. వాళ్ళ సంబంధంలో సూక్ష్మమూ, సున్నితమూ అయిన దేమీలేదు. అప్పుడప్పుడూ ఇద్దరూ కీచులాడుకుంటారు. శ్యామ గట్టిగా అరిచి పోట్లాడుతుంది. తన్నులు తింటుంది. "నీతి జాతీ లేనిదానా ! పో ఇంట్లోనుంచి." అంటూంటాడు మధుసూదనుడు. ఇంత సన్నిహిత సంబంధం పెట్టుకున్నా శ్యామకు హోదా ఏమీ


ఝాన్సీ

## గరల్స్ ట్యుటోరియల్ కాలేజి

**కొరిటెపాడు రోడ్డు, గుంటూరు-2.**

**( Hostel attached )**

జూనియర్ మెట్రిక్, మెట్రిక్ ( ఇంగ్లీషు & తెలుగు మీడియమ్స్ ), S. S. L. C., B. A. & B. Sc., తరగతులకు అన్ని సబ్జక్టులందు శిక్షణ యివ్వబడును.

**బాలికలకు స్త్రీలచే నడుపబడు ఏకైక సంస్థ**

1965 మార్చి మెట్రిక్ రిజల్ట్సు 90%. ఇందు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు 50%. ఇంతేగాక G.K. సూర్యావతి యను విద్యార్థిని (Regd. No. 2893) యూనివర్సిటీ ప్రథమ స్థానాన్నలంకరించినదంటే – ఈ కాలేజీ శిక్షణ !

**నిశ్చయ విజయ సాధని !!**

బాలురకు ప్రత్యేక శాఖ గలదు.

వివరములకు :

**T. Sarojini Devi, B. A., B. Ed.,**
*Principal.*

పెరగలేదు. మధుసూదనుడు తానై ఇస్తేతప్ప, ఏ వస్తువుమీదా ఆమెకు అధికారం లేదు. ఆమెనుగురించి అతనికి ఎలాటి స్వప్నాలూ లేవు. ఆమె అతని ప్రాణానికి చలికప్పుకునే మురికి రజాయి; అవసరం ఉన్నప్పుడు కప్పుకుంటాడు, లేకపోతే దుమ్ములో దొర్లుతూ ఉంటుంది. దాన్నిగురించి జాగ్రత్తపడ నవసరంలేదు. అయితే శ్యామ ఎంతైనా సహించగలదు. అది మధుసూదనుడి ఆత్మగౌరవానికిరక్ష అయింది. ఈ విషయంలో శ్యామ కుముదినికి విరుద్ధం.

స్త్రీకి సంఘం ఎంతగా అన్యాయం చేస్తున్నదో, భార్యలు ఎంత పనికిమాలిన, విలువలేని వస్తువులుగా ఉంటున్నారో విప్రదాసుకు తెలిసివచ్చింది.

అన్నా చెల్లెలూ మాట్లాడుకుంటుండగానే మోతీతల్లి వచ్చింది. కుముదిని పడకగదిలో కూర్చుని ఆమెతో మాట్లాడింది.

"మన యింటికి దయ్యం పట్టిందక్కా, నువు రావా ?" అన్నది మోతీతల్లి.

"శూన్యహస్తాలతో వచ్చి ఏంచెయ్యను ? నే నియ్యగలిగినది ఆయనకు అవసరంలేదు"

"సంసారమంతా నీదికాదా ? దాన్ని ఎలా వదులుకుంటావు ?"

"సంసారమంటే ఇల్లూ, వాకిలీ, సామాన్లూ, మనుషులూనూ, వాటిపైన నాకేమీ అధికారంలేదు. లోపలి అధికారం లేకపోయాక పైవాటికి కక్కుర్తిపడి ఏంలాభం ?"

"అయితే ఇంటికి మరి రానేరావా ?"

"రానని చెప్పలేనుగాని వస్తానని చెప్పటంకూడా కష్టమే."

మోతీతల్లి విప్రదాసును చూసి మాట్లాడగోరింది. ఇద్దరూ విప్రదాసు గదిలోకి ప్రవేశించారు. నవమోహనుడిలాగా ఉండే విప్రదాసు ఎలా అయిపోయాడో చూసి మోతీతల్లి కళ్ళు చెమ్మగిల్లాయి.

కుముదిని తన అన్నకు మోతీతల్లి వచ్చినపని చెప్పింది.

"అది పరాయి యిల్లు. కుముఅక్కడ ఎలాఉంటుంది ?" అని విప్రదా సడిగాడు.

"తన వస్తువును పరాయిదిగా ఎవరూ చేయలేరు," అన్నది మోతీతల్లి.

"పొరపాటు. కుముకు అక్కడ ఎలాటి అధికారమూలేదు. అతనామెను వెళ్ళగొట్టితే ఎవరూ అడ్డురాలేకపోయారు," అన్నాడు విప్రదాసు.

విప్రదాసు అన్నదానికి జవాబు లేదు. కాని మోతీతల్లికి అతనన్నది విడ్డూరంగా తోచింది. లోకంలో ఎక్కడన్నా భర్త భార్యను వెళ్ళగొడితే భార్యతరఫువాళ్ళు, వెళ్ళి ఆ భర్త కాళ్ళు పట్టుకుంటారు. ఇదే ఆమెకు తెలిసిన లోకాచారం.

"మగవాళ్ళలాగా ఆడవాళ్ళు తన ఇల్లూ, తన సంసారమూ లేకుండా ఎలా బతుకుతారు?" అని ఆమె అడిగింది.


ది స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్

మీ అమూల్యములను వస్తువులను భద్రపర్చండి

సేఫ్ డిపాజిట్ లాకర్స్‌లో వాటిని ఉంచండి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వారి

సేఫ్ డిపాజిట్ లాకర్ లో భద్రపర్చి, నిస్సంశయంగా నిశ్చింతగా వుండండి.

ఇది ప్రత్యేక సదుపాయం.

ఈ లాకర్లు మా అనేక బ్యాంకులలో సరసమైన అద్దెకు లభించును.

SBH-65/6.

"అవమానంతో బతకవలసిన అవసరం కుముదకు లేదు. ఆమెను అవమానించే యోగ్యత రాజాధిరాజులకుకూడా లేదు."

మోతీతల్లి ఉద్దేశంలో ఆడది భర్తచేత అవమానం పొందడం కంటెకూడా హీనమైంది తన కాళ్ళపైన తాను నిలబడతాననటం. ఆడదానికి గర్వం పనికిరాదు. భర్తను విమర్శించే హక్కు భార్యకు లేదు.

"ఎప్పుడో ఒకప్పుడు అక్కడికి వెళ్ళితీరాలి కద." అన్నదామె.

"అది బానిస అనవలసిన మాట." అన్నాడు విప్రదాసు.

"ఆడజన్మ ఎత్తాక ఆడరాత తప్పుతుందా?" అన్నది మోతీతల్లి

స్త్రీలను అందరికన్న హీనంగా చూసేది స్త్రీ లేనని విప్రదాసు గ్రహించాడు.

వాళ్ళు మాట్లాడుతూ ఉండగా నవీనుడు వచ్చి. విప్రదాసుతో. "మీ కలవైతే. వదినను తీసుకుపోయ్యే ఏర్పాటు చేస్తాను." అన్నాడు.

"వెళ్ళాలనుంటే వెళ్ళు. కుమూ." అన్నాడు విప్రదాసు.


"లేదన్నయ్యా. వెళ్ళను." అన్నది కుముదిని.

## 16

మధుసూదనుడి బల్లసొరుగులో ఒక గిల్టు ఆష్ట్రే ఉండేది. బంగారంతో చేసినదని భ్రమపడి శ్యామ దాన్ని తస్కరించింది. మధుసూదనుడు మండిపడి. శ్యామను గ్రామానికి పంపించెయ్యమని ఉదయం ఆఫీసుకు పోతూ నవీనుడితో చెప్పాడు. నవీనుడు ఎంతో ఉత్సాహంతో ఆ ప్రయత్నంలో ఉండగా ఒంటిగంటన్నర వేళ మధుసూదనుడు అతని గదలోకి వచ్చి. "పోనీ ఈసారికి వద్దులే." అన్నాడు. పోతూపోతూ అతను నవీనుడి టేబిలుమీద ఉన్న కుముదిని ఫొటోచూసి, ఉలిక్కిపడి ఆగిపోయి. ఆ ఫొటోను తీసుకుపోయాడు.

శ్యామ కిప్పుడు ఇంటిమీద పూర్తి అధికారం దొరికిందన్న నమ్మకం కుదిరింది. కాని నౌకర్లూ చాకర్లూ, బహిరంగంగానే ఆమెను ధిక్కరిస్తున్నారు. శ్యామ కసికొద్దీ వాళ్ళకు లేనిపనులు చెప్పి. వాళ్ళ అమ్మలనూ, అయ్యలనూ వంకపెట్టి తిట్టుతున్నది. కొద్ది రోజులక్రితం తానూ ఇంటినౌకరేనన్న సంగతి ఆమె మరిచింది. నౌకర్లు – ముఖ్యంగా మధుసూదనుడి దృష్టిలో "అచ్చి" వచ్చిన వాళ్ళు – వెళ్ళిపోతామన్నారు. మధుసూదనుడిచేత శ్యామ తిట్లు తిన్నది. నౌకర్ల జీతాలు పెరిగాయి. వాళ్ళు శ్యామను చూసి నవ్వారు. మధుసూదనుడిపై ప్రేమకొద్దీ ఇవన్నీ శ్యామ సహిస్తున్నది. ఆమెకు ఎంత అవమానమైనా సహించేశక్తి ఉన్నదిగనుక మధుసూదను డామెను అంటిపెట్టుకున్నాడు.

అయితే కుముదిని ఎప్పుడు వచ్చి సింహాసనం ఎక్కుతుంతో నన్న భయం శ్యామకు లే పోలేదు. మోతీతల్లితో మనసు విప్పి



మాట్లాడాలని ప్రయత్నిస్తే ఆమె ఒక్క జాడింపు జాడించి వెళ్ళిపోయింది. అప్పటినుంచీ ఇద్దరికీ మాటలు లేవు.

ఈ పరిస్థితిలో ఒక సాయంత్రం శ్యామ మధుసూదనుడి పడక గదికి వచ్చి. అక్కడ కుముదిని ఫోటో చూసింది. నెత్తిమీద పడబోయే పిడుగు తాలూకు మెరుపు కంటపడ్డట్టయింది. ఆ రాత్రి ఆమె అలకబూని, మధుసూదనుడికి జుగుప్స తెప్పించింది. అతను ఆమెపైన కేకలు వేశాడు.

ఉదయం బల్లమీద ఫోటోలేదు. శ్యామను పిలిచి ఫోటోగురించి అడిగితే, దాన్ని తాను చూడనైనా చూడలేదన్నది, తియ్యలేదంటే తియ్యలేదన్నది.

మధుసూదనుడు నవీన్‌ను పిలిపించి, "పెద్దకోడలిని తీసుకురా" అన్నాడు.

"నువే వెళ్ళి పిలిస్తే వదిన సంతోషిస్తుంది, అన్నయ్యా." అన్నాడు నవీనుడు.

మధుసూదనుడు కొంచెం ఆలోచించి, "రేపు ఆదివారం. ఉదయం నేనే వెళతాను." అన్నాడు.

మధుసూదనుడు వచ్చేసరికి గదిలో విప్రదాసూ, కుముదినీ మాట్లాడుకుంటున్నారు. మధుసూదనుడు ముందుగా కబురుచెయ్యకుండా వచ్చాడు – అతను వచ్చినది విప్రదాసును దర్శనం చేసుకోవటానికికాదు, విప్రదాసుకు దర్శన మివ్వటానికి !

అతను వచ్చాడని కబురు రాగానే విప్రదాసు కుముదినిని గదిలోనుంచి అవతలికి పంపేశాడు.

మధుసూదనుడు లోపలికి వచ్చి, చేసీ చెయ్యకుండా ఒక నమస్కారం చేసి కూర్చుంటూ, "ఒంట్లో ఎలా ఉన్నది విప్రదాసు బాబూ ? అట్టే బాగున్నట్టు కనబడటంలేదే !" అన్నాడు.

"మీరు ఆరోగ్యంగా ఉన్నట్టు కనబడుతున్నారు. కులాసాయే గదా ?" అన్నాడు విప్రదాసు.

"అంత కులాసాలేదు. సాయంకాలం అయేసరికి తల నాదుగా ఉంటుంది. ఆకలి అంత బాగాలేదు. భోజనం అటూఇటూ అయితే ఏదో అవుతుంది. అంతబాగా నిద్రపట్టదు."

శుశ్రూష చేసేటందు కెవరైనా ఉండాలని చెప్పటానికే ఈ ఉపోద్ఘాతం.

ఫలహారం సిద్ధంగా ఉందని లోపలినుంచి కబురు వచ్చింది.

"తినలేను. చెప్పాను గదా, భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని !" అన్నాడు మధుసూదనుడు.

విప్రదాసు రెండోసారి అడిగి బలవంతం చెయ్యక, "ఒంట్లో బాగా లేదట, భోజనం చెయ్యరట. పిన్నితో చెప్పు." అని నౌకరుతో అన్నాడు.

కుముదినిని పంపటం గురించి విప్రదాసే ప్రస్తావిస్తాడని మధుసూదను డనుకున్నాడు. కాని విప్రదాసు కుముదిని పేరైనా ఎత్తలేదు


*For your requirements*

*in*

POLYTHENE TUBES, BAGS, LINERS, NURSARY BAGS,
SHEETS, COLOUR BAGS ETC.,

CONTACT:

R. K. INDUSTRIES

16, STRINGERS STREET,
MADRAS-1.

PHONE:
CARE: 23526.

మధుసూదనుడికి కోపం వచ్చింది, రావటం పొరపాటయిందని పించింది. ఇదంతా నవీనుడు చేసిన పనేననీ, ఇంటికి వెళ్ళి అతన్ని శిక్షించాలనీ అనుకున్నాడు.

ఇంతలో కుముదిని గదిలోకి వచ్చి, ర్త పాదధూళి తీసుకుని, "అన్నయ్య ఒంట్లో బాగాలేదు. ఎక్కువగా ాట్లాడకూడదని డాక్టరు చెప్పాడు. మనం పక్కగదిలోకి పోదాం." అన్నది.

మధుసూదనుడు ముఖం ఎర్రగా చేసుకుని, "సరే వస్తాను" అని చెప్పి బయటికి వచ్చేశాడు. అతను వెంటనే బండెక్కి వెళ్ళి పోదామనుకున్నాడు గాని కుముదిని అతని కంటికి ఎప్పటికన్నా కూ అందంగా కనబడింది. ఆమెను చూస్తుంటే ఇంటికి తీసుకుపోవా లనిపిస్తున్నది. ఆమె తనది, తనది!

కుముదిని పక్కగదిలో అతని కొక సోఫా చూపింది. ఆమెను పట్టుకుని తన పక్కన కూర్చోపెట్టుకుందా మనిపించింది గాని, బయటిగది అయిపోయింది.

"నాతో ఏమైనా చెబుతారా?" అన్న దామె.

"ఇంటికి రావా?"

"రాను."

మధుసూదనుడు ఉలిక్కిపడి, "అదేంమాట!" అన్నాడు.

"నాతో నీకవసరం లేదే!"

"అవసరం లేకపోవట మేమిటి? శూన్య గృహం బాగుంటుందా?"

అతనితో వాదించటం ఇష్టంలేక కుముదిని, "నేను రాను," అన్నది.

అతను సోఫామీదినుంచి లేచి. "వచ్చితీరాలి! రాకపోతే పోలీసులను తెచ్చి, మెడపట్టి లాగించి తీసుకుపోగలను, తెలుసా?... అన్నగారి నూర్‌నగరు పద్ధతులు మళ్ళీ మొదలు!" అన్నాడు.

కుముదిని అన్న గదికేసి చూసి, "ఊరుకో! అలా గట్టిగ మాట్లాడకు!" అన్నది.

"మీ అన్నయ్యకు వినబడకుండా మెల్లిగా మాట్లాడాలేం! అన్నయ్యను ఈ క్షణం ఈ ఇంట్లోనుంచి వెళ్ళగొట్టగల తెలుసా?"

విప్రదాసు వాకిలి దగ్గిరికి వచ్చి, "రా చెల్లీ, నా గదిలోకి." అని పిలిచాడు.

"నీ నూర్‌నగరు నోరు మూయించకపోతే నా ను మధుసూదన్ కాదు," అంటూ మధుసూదనుడు గట్టిగా క్రేం వేశాడు.

అతను తిరిగివెళ్ళి కోర్టు భాషలో విప్రదాసు కి ఉత్తరం రాశాడు: కుముదిని తన ఇంటికి రాని పక్షంలో తగుచర్య తీసుకో బడుతుంది.

కుముదిని భర్త దగ్గిరికి పోకూడదని నిశ్చయించే పక్షంలో తీవ్రమైన ప్రతిఘటనకు సిద్ధపడాలి. సమాజాన్నే ఎదిరించాలి. ఆలోచించుకోమని విప్రదాసు ఆమెకు సలహా ఇచ్చాడు. కుముదిని వెళ్ళకుండా ఉండటానికే నిశ్చయించుకున్నది. కాని తాను తన అన్నకు భారమవుతానని భయపడింది. అలాటిదేమీ ఉండదనీ, త్వరలోనే తనకు ఉన్నదంతా పోయి, దారిద్ర్యం సంప్రాప్తించ నున్నదనీ, తనకు కుముదినే లక్ష్మిగా ఉంటుందనీ విప్రదాసన్నాడు.

రెండురోజు లయాక నవీనుడూ, మోతీతల్లీ వచ్చి, తాము యిక్కడ కాపరం ముగించి రాజబ్‌పూరు వెళ్ళిపోతున్నామని చెప్పారు.

"నేను వచ్చి మిమల్నికూడా వెళ్ళగొట్టేస్తున్నాను." అన్నది కుముదిని.

వెళ్ళిపోదామని బుద్ధి ఏనాడో పుట్టింది. మూటాముల్లే కూడా సర్దునే ఉన్నాం," అన్నాడు నవీనుడు.

మోతీతల్లి మాత్రం తప్పంతా కుముదినిదే నని భావించింది. భర్త వచ్చి, రమ్మని పిలిచినా రాకపోవటం కుముదిని తప్పు, మోతీ తకి వెళ్ళాలని లేదు. బావగారు ఇవాళ పొమ్మంటే రేపు ఉండనటాడు. ఈలోపల మహా గొప్పవాళ్ళలాగా తాము వెళ్ళిపో వసరం లేదని ఆమె అన్నది. బావగారు చేసే అన్యాయాన్ని అప న మనుకోరాదని ఆమె ఉద్దేశం.

కుముదిని డాక్టరుతో మాట్లాడుతూ తన అన్న గదిలో ఉండగా, అత్త మోతీతల్లితో, కుముదిని గర్భవతిగా ఉన్న లక్షణా ల్నట్టు చెప్పింది. మోతీతల్లికి పరమానంద మయింది.

ఈ సంగతి విప్రదాసు చెవిన పడింది. మంత్రసాని వచ్చి కుముదిని పరీక్షించి, గర్భమేనని తేల్చింది. ఈ సంగతి మధుసూదనుడికి కూడా తెలిసింది. అతను తన ఆశయాలను మరొకమెట్టు పైకి వెళ్ళినట్టు భావించాడు.

విప్రదాసు కుముదినిని భర్తవద్దకు వెళ్ళమని సలహా ఇస్తూ, "ఇప్పుడు నీ బంధాన్ని తెంపటం ... కాదు," అన్నాడు.

"వెళ్ళవలసిందేనా, అన్నయ్యా?" అన్నది కుముదిని.

"వద్దని ఎలాచెప్పను? నీ సంతానాన్ని స్వగృహానికి వెళ్ళ వద్దనే సాహసం నాకులేదు."

"అలాగైతే ఎప్పుడు వెళ్ళేది?"

"ఆలస్య మెందుకు? రేపే వెళ్ళు."

మర్నాడు పదిగంటల తరవాత పల్లకీవచ్చి విప్రదాసు ఇంటిముందాగింది. ఇత్తడి కట్లుగల చేతికర్రలతో అనేకమంది దవాలీ బంట్రోతులు వెంటరాగా బాజాభజంత్రీలతో మహారాణిని మధు ప్రాసాదానికి చేర్చారు. అట్టహాసంగా బ్రాహ్మణ సంతర్పణ జరిగింది.

★

Printed and Published by A. udhakara Rao Yuva Concerns and Printed at Yuva Press,
5-9-88 Public Garden Rod, Hyderabad-l ontrolling Editor : Sri "CHAKRAPANI